# దేవాపి మహర్షి బోధలు

2

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

# దేవాపి మహర్షి బోధలు

## 2

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ


ప్రథమ ముద్రణ : 2017 ప్రతులు : 1,000
(56వ గురుపూజా మహోత్సవములు)

వెల : రూ॥ **100-00**

ప్రతులకు :
**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-67-8

ముద్రణ :
**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
మధురానగర్,
విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891-2796538, 9849996538.



# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | పరిచయము | ......... | 11 |
| 1. | చికిత్స | ......... | 25 |
| 2. | సుగంధము | ......... | 27 |
| 3. | ఒక సూచన | ......... | 29 |
| 4. | ఉండుట - లేకుండుట | ......... | 30 |
| 5. | స్థూల - సూక్ష్మములు | ......... | 32 |
| 6. | జీవుల కథ | ......... | 33 |
| 7. | నిద్ర విలువ | ......... | 34 |
| 8. | హెచ్చరిక | ......... | 36 |
| 9. | కఠినత్వము - క్రూరత్వము | ......... | 38 |
| 10. | మా ప్రసారము | ......... | 39 |
| 11. | గ్రంథ పఠనము | ......... | 41 |
| 12. | ఊహాతీత సహకారము | ......... | 42 |
| 13. | మనోదృక్పథము - హృదయదృశ్యము | ......... | 44 |
| 14. | మన కథ | ......... | 46 |
| 15. | మానవ సౌఖ్యము | ......... | 48 |
| 16. | సోదరత్వము | ......... | 49 |
| 17. | సోదరత్వము - 2 | ......... | 51 |
| 18. | సోదరత్వము - 3 | ......... | 53 |
| 19. | సోదరత్వము - 4 | ......... | 55 |
| 20. | సోదరత్వము - 5 | ......... | 57 |
| 21. | సోదరత్వము - 6 | ......... | 59 |
| 22. | సోదరత్వము - 7 | ......... | 61 |
| 23. | సోదరత్వము - 8 | ......... | 63 |
| 24. | సోదరత్వము - 9 | ......... | 65 |
| 25. | సోదరత్వము - 10 | ......... | 67 |
| 26. | సోదరత్వము - 11 | ......... | 69 |

| | | | |
|---|---|---|---|
| 27. | సోదరత్వము - 12 | ......... | 71 |
| 28. | మా సాహసము | ......... | 73 |
| 29. | వైద్యము - పాశవికత | ......... | 75 |
| 30. | సోదరత్వము - సూత్రములు | ......... | 77 |
| 31. | సేవ - ఆశయము | ......... | 78 |
| 32. | ఆందోళనము నుండి ఆనందమునకు | ......... | 79 |
| 33. | దయ | ......... | 81 |
| 34. | మేలెంచి కీడెంచుట | ......... | 82 |
| 35. | ఆత్మాహుతి - ఆత్మ సమర్పణము | ......... | 83 |
| 36. | పునర్జన్మ | ......... | 84 |
| 37. | ప్రియము | ......... | 85 |
| 38. | నమ్మకము - అనుమానము - అపనమ్మకము | ......... | 86 |
| 39. | గ్రుడ్డితనము | ......... | 88 |
| 40. | గ్రుడ్డితనము-2 | ......... | 89 |
| 41. | గ్రుడ్డితనము -3 | ......... | 91 |
| 42. | గ్రుడ్డితనము - 4 | ......... | 93 |
| 43. | గ్రుడ్డితనము - 5 | ......... | 94 |
| 44. | కారుణ్యమూర్తి | ......... | 95 |
| 45. | తక్కెడలు - తరణము | ......... | 96 |
| 46. | ఉపదేశము | ......... | 98 |
| 47. | దురభిప్రాయము | ......... | 99 |
| 48. | లోతు | ......... | 101 |
| 49. | పరిశ్రమ | ......... | 103 |
| 50. | నిత్య సత్యము | ......... | 104 |
| 51. | సద్గురువుని రీతి | ......... | 105 |
| 52. | ఉన్నతి | ......... | 107 |
| 53. | చంచలత్వము | ......... | 109 |
| 54. | ముఖవర్చస్సు బాధ్యత | ......... | 111 |

| | | | |
|---|---|---|---|
| 55. | గ్రహముల సమతూకము | ......... | 113 |
| 56. | ఋషి దృష్టి | ......... | 115 |
| 57. | స్ఫూర్తి – భావనము | ......... | 117 |
| 58. | స్ఫూర్తి – గమనము | ......... | 118 |
| 59. | స్ఫూర్తి – అనుచరులు | ......... | 120 |
| 60. | అతీంద్రియ గ్రహణము | ......... | 122 |
| 61. | బ్రహ్మము – సత్యము – చైతన్యము (0-1-2) | ......... | 123 |
| 62. | చిరునవ్వు | ......... | 124 |
| 63. | అగ్నియోగి | ......... | 125 |
| 64. | గౌతమబుద్ధుడు | ......... | 127 |
| 65. | హృదయ వైభవము | ......... | 128 |
| 66. | సంగ్రామము | ......... | 129 |
| 67. | కలియుగ ధర్మము | ......... | 131 |
| 68. | స్వస్థతా ప్రార్థన | ......... | 132 |
| 69. | మరపు – అసమర్థత | ......... | 134 |
| 70. | క్రియా మార్గము | ......... | 136 |
| 71. | సాధనా పరిశీలనము | ......... | 138 |
| 72. | మా బాధ్యత | ......... | 140 |
| 73. | పరహిత ప్రేమ | ......... | 142 |
| 74. | మార్గము – అనుగ్రహము | ......... | 143 |
| 75. | వృక్షములు | ......... | 145 |
| 76. | సత్యయోగము – శ్వేతబృందము | ......... | 147 |
| 77. | అలజడి | ......... | 149 |
| 78. | జీవ పోషణము | ......... | 151 |
| 79. | ఒడ్డాణము | ......... | 153 |
| 80. | నిశితత్వము | ......... | 155 |
| 81. | సూర్యుడు – ధర్మము | ......... | 156 |
| 82. | సూర్యోదయము | ......... | 158 |

| | | | |
|---|---|---|---|
| 83. | సహాజ ప్రకృతి | ......... | 160 |
| 84. | ప్రమాణము | ......... | 162 |
| 85. | క్షమ | ......... | 164 |
| 86. | అసురమాతలు | ......... | 165 |
| 87. | మహాత్ముల బృందము | ......... | 166 |
| 88. | బడిపంతులు | ......... | 167 |
| 89. | తపన | ......... | 169 |
| 90. | సహకారము | ......... | 170 |
| 91. | కార్యోన్ముఖత | ......... | 171 |
| 92. | లోకహితము | ......... | 172 |
| 93. | ఉత్సాహ సూక్తము | ......... | 173 |
| 94. | ధ్యానము - వెలుగు | ......... | 175 |
| 95. | హృదయ తత్త్వము | ......... | 177 |
| 96. | మార్గము | ......... | 178 |
| 97. | సహనము | ......... | 180 |
| 98. | మా యజ్ఞము | ......... | 181 |
| 99. | పని రహస్యము | ......... | 182 |
| 100. | దేహము - హృదయము | ......... | 183 |
| 101. | పరమౌషధము | ......... | 184 |
| 102. | పవిత్రీకరణము | ......... | 185 |
| 103. | ఔషధ సేవనము | ......... | 186 |
| 104. | లోక ద్రోహి | ......... | 187 |
| 105. | హృదయ శక్తి | ......... | 188 |
| 106. | అభయము | ......... | 189 |
| 107. | వృద్ధి | ......... | 191 |
| 108. | కృతస్మర - క్రతుస్మర | ......... | 193 |
| 109. | నేత్ర శిక్షణ | ......... | 195 |
| 110. | సేవ - సమర్థత | ......... | 196 |
| 111. | సంవాదము | ......... | 197 |

# దేవాపి మహర్షి బోధలు

# పరిచయము

మరువు, దేవాపి మహర్షులు అనాది నుండి భూమిజీవుల యుద్ధరణకై నిర్విరామము కృషిచేయుచున్న మహర్షులు. వీరి పుట్టు పూర్వోత్తరములు ఎవరికిని తెలియదు. అన్ని పురాణము లందును వీరు గోచరింతురు. విష్ణుపురాణము నుండి భాగవత పురాణము వరకుగల పురాణములలో అచ్చటచ్చట ప్రస్తుతి చేయబడిరి. జీవులకు వర్ణాశ్రమ ధర్మములను నేర్పుచు, ధర్మము నందు రుచి కల్పించి, ధర్మమార్గమున నడిపింపజేసి, ఉత్తీర్ణులను గావించుట వీరుచేయు మహత్తర నిష్కామ కర్మయజ్ఞము. ఈ యజ్ఞము వీరు అనాదికాలముగ నిర్వర్తించుచున్నారు. జగద్గురువు మైత్రేయునికి దివ్యప్రణాళికలో తోడ్పాటు గావించు చున్నప్పటికిని వీరు మైత్రేయునికన్న పూర్వులు. వాసుదేవుని వ్యూహమునందు జీవుల ఉద్ధరణకై యుగముల తరబడి పనిచేయుచున్న మహానుభావులు.

మరువు మహర్షి సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు వంశము వాడు. అనగా శ్రీరాముని వంశము వాడు. అనగా త్రేతాయుగము నుండి భూమిపై నున్నవాడు. అంతకు ముందునుండి కూడ యుండి యుండవచ్చును. అట్లే దేవాపి మహర్షి చంద్రవంశపు రాజు. ఇతడు భీష్ముని తండ్రి అయిన శంతన మహారాజునకు అగ్రజుడు. ఆ జన్మలో దేవాపి బ్రాహ్మణ ధర్మమును స్వీకరించి తనకు తానుగ కోరి రాజ్యము

నుండి బహిష్కరించబడెను. నిజమునకు కురు సామ్రాజ్యమునకు అతడు చక్రవర్తియై యుండవలసినది. కాని వాసుదేవుని వ్యూహము ననుసరించి వాసుదేవుడు శ్రీకృష్ణుడుగ అవతరించుటకు ముందుగనే రాజ్యపరిత్యాగము గావించెను.

దేవాపి మహర్షి ఆ జన్మలో శ్రీకృష్ణుని కన్న నాలుగు వందల సంవత్సరముల ముందు పుట్టినవాడు! నాలుగు వందల సంవత్సర ముల ముందు దైవము యొక్క వ్యూహమును గ్రహించి, అందు తన పాత్రను గ్రహించి, తదనుగుణముగ చక్రవర్తిత్వమును పరిత్యాగము చేయుటకు కొంత దూరదృష్టి కావలెను. అది ఋషి దృష్టి. దేవాపి ఋషి మాత్రమే కాదు, రాజర్షి. రాజర్షి మాత్రమే కాదు మహర్షి. దేవాపి, శంతనుడు, కాశీరాజగు దివోదాసు, జగద్గురువగు పరాశర మహర్షి- వీరందరును సమకాలికులు. వీరు ఆ జన్మల యందు, ఆయా దేహములందుండుట పురాణ పురుషుని అవతరణమునకు నాలుగు వందల సంవత్సరముల ముందు జరిగినది. దేవాపి మహర్షియై నిలుచుట ఆ జన్మలో జరిగిన దనుకొనలేము. అట్లే మరువు మహర్షి కూడ.

ఈ ఇరువురు మహర్షులు వాసుదేవుని వ్యూహమున అనాది కాలముగ పనిచేయుచు తెరవెనుక నుండుట కెక్కువ అభిలషించి రని అనిపించును. మహర్షుల పుట్టు పూర్వోత్తరములు మనకు పురాణ సంహితలలో లభ్యమగును. వారు చేసిన సాధనలు కూడ లభ్య మగును. కాని ఈ మహర్షుల పుట్టు పూర్వోత్తరములు, సాధనలు పురాణముల యందు కూడ లిఖింపబడలేదు. అది బహుశః వారి

సంకల్పము కావచ్చును. పరాశరులు విష్ణుపురాణమున, వేదవ్యాసులు భాగవత, కల్కి పురాణములలో వీరిని తగు మాత్రము పరిచయముచేసి వదలినారు. అదియును అతి స్వల్పమే.

ఈ భూమి పుట్టుక ముప్పదికోట్ల సంవత్సరముల క్రితము జరిగినది. అందు ఆది మానవుని అవతరణము ఒక కోటి, ఎనభై లక్షల సంవత్సరముల క్రితము జరిగినది. ఈ కోటి ఎనభై లక్షల సంవత్సరములలో కొన్ని మన్వంతరములు గడచినవి. ఎన్నియో యుగములు గడచినవి. మానవజాతి ఉద్ధరణమునకై కుమారులు, ఋషులెందరో భూమికి దిగి వచ్చిరి. ఈ మొత్తము భూమి కథ, మానవజాతుల కథ ఈ మహర్షు లిద్దరికిని కరతలామలకములు. ఈ భూమిపై జరుగుచున్న జగన్నాటకము నంతయు వారు సాక్షీ భూతులుగ గమనించుచు తమవంతు కరవ్యమును వాసుదేవుని కల్పితముగ నిర్వర్తించుచున్నారు. వీరిరువురును దివ్య దేహధారులు. అణువుల నుండి అప్పటికప్పుడు దేహమును కట్టుకొని ప్రత్యక్షము కాగలరు. అట్లే అదృశ్యము కాగలరు. స్మరణ మాత్రమున సాన్నిధ్యము నివ్వగల వాసుదేవోపాసకులు. వీరు విష్ణు స్వరూపులు, త్రికాలజ్ఞులు. వీరికి తెలియని మన్వంతర రహస్యములు, మతాతీత సత్యములు, మానవజాతి కథలు లేవన్నచో అతిశయోక్తి కాదు.

రాశిచక్రమున సద్గురుపరంపర అంతయు ఆషాఢ శ్రావణ ములను అధిష్ఠించి యుండగ మరువు మహర్షి మేషరాశిని, దేవాపి మహర్షి ధనూ రాశిని అధిష్ఠించి యున్నారు. ధనూరాశి మూలాధార ప్రజ్ఞ. అచటనే యోగప్రజ్ఞ యున్నది. ఈ కేంద్రమునకు దత్తాత్రేయు

డధిపతి. కపిలుడు, గణపతి, హనుమంతుడు అచ్చటి గురుపరంపర. ఇట్టి మహత్తరమైనటువంటి యోగప్రజ్ఞకు అధిపతిగ ధనూ రాశిని పరిపాలించుచున్న దేవాపి మహర్షి, సమస్త యోగ మార్గములను ప్రచోదనము గావించుచు జీవులను త్వరితగతిని పురోగమింప చేయు చున్నారు. యోగమునకు మూలాధారము ఆరంభముకాగ సహస్రారము గమ్యమై యున్నది. అచ్చట ఆ ప్రజ్ఞను పరిపాలించుచు మరువుమహర్షి జీవుల నూర్ధ్వముఖమున కాకర్షించు చుండును. ఉత్తమలోకముల ప్రవేశము కల్పించు చుండును. యోగ దండము లేక బహ్మాదండము నకు ఇరుపార్శ్వముల వీరిరువురు పనిచేయుచు భూమి యందలి సమస్త గురు పరంపరకు స్ఫూర్తి నిచ్చుచు మరుగున నున్నారు.

రహస్య దివ్యాచరణము వీరిరువురి ప్రత్యేకత. రహస్యము, మౌనము, అనిర్వచనీయమగు పవిత్రత, ఆత్మత్యాగము వీరి సహజ లక్షణములు. తమకు పేరు ప్రతిష్ఠలు కలుగకుండ దైవమునకే పేరు ప్రతిష్ఠలు కలుగునట్లు ప్రవర్తించు దివ్యజీవులు, చిరంజీవులు.

చిరంజీవులు లోక కల్యాణార్థమై భగవత్ వ్యూహము ననుస రించి జన్మలెత్తుచు తామెవరో తమకు జ్ఞప్తి కలిగి వర్తింతురు. జన్మ ప్రయోజనములను మరువక, లోకహితార్థమగు కార్యముల నొనర్చుచు మనస్సు, ఇంద్రియము, శరీరములను హితకార్యముల కొరకై ఉప కరణములుగ వాడుదురు. చచ్చిన వెంటనే మనుష్యు డంతరించునని, శరీరముకన్న వేరుగ జీవుడు లేడని మ్లేచ్ఛ సిద్ధాంతము. ఇట్టివారు తమ శరీరమే తామనుకొని జీవించు చుందురు. కాని శరీరము లంతము లైనపుడు జీవులా శరీరములతో మరణింపరన్నది శాశ్వత

సత్యము. శరీరము మరణించినప్పుడు జీవుడు మరియొక శరీరమును కోరును. నూతన శరీరము కర్మాను బంధమై ఏర్పడును. నూతన శరీరమున జన్మించినపుడు మునుపటి జీవితము మరపునకు వచ్చును. నిజమునకు మరపే మృత్యువు. మరపు లేనివానికి మృత్యువు లేదు. మృత్యువనగా మరపేకాని, శరీర మంతమగుట కాదని పెద్దల యవగాహన. జన్మల తరబడి తామెవరో, తమ కర్తవ్యమేమో జ్ఞప్తి యున్న వారిని చిరంజీవు లందురు. వీరు మరపులేని వారు గనుక మృత్యువును దాటిన వారు. వీరికనేక జన్మలలో ఒకే స్మృతి అనుస్యూత ముగ నుండును. ఒకే పవిత్రమైన కార్యము ఇన్ని జన్మల తరబడి నిర్వహించుటలో వారు నిమగ్నులై యుందురు.

ఇట్టి చిరంజీవులను గూర్చి వేద పురాణాది సంహితలలో ఉదహరించినపుడు ఏ జన్మలోని శరీర నామముతో చెప్పవలెను? జన్మమున కొకపేరు తల్లితండ్రుల ద్వారా ఏర్పడుచుండును. ఆ పేరు ఆ జన్మాంతము వరకే. మరల జన్మ ఎత్తినపుడు మరియొక పేరు యేర్పడుచుండును. దుస్తులు మారినట్లు జన్మములు మారుచుండగ, ఇన్ని దుస్తుల యందు ఒకే మనిషిని ఒకే నామముతో పిలుతుము గదా! అట్లే సూక్ష్మలోకములలో శరీరములు మారినప్పటికిని నామము ఒక్కటియే యుండును. చిరంజీవుల కిట్టి నామముండును. వారిని గూర్చి ప్రస్తావించినప్పుడు వారి మొత్తము వృత్తాంతమునకును, జన్మ లన్నింటికిని సూచకమగు సంకేతనామ మొకటి యుండుట సదుపాయము. ఇది వేదసంప్రదాయము. వేద పురాణములయందు గోచరించు ఋషుల పేర్లలో ఎక్కువ భాగమిట్టిదే. ఈ విధముగ

దేవాపి, మరువు మహర్షులు వేదవ్యాసుని పురాణములయందు పేర్కొనబడిరి. అంతకు ముందు పరాశరులున్నప్పటి దేవాపి, మరువు మహర్షుల శరీరములు వేరు. వేదవ్యాసులకు సమకాలికులుగ, మైత్రేయునికి ప్రాణమిత్రులుగ నున్న ఈ ఋషుల దేహములు వేరు.

ఈ మహర్షులు మూడు రకముల దేహములు కలిగి మూడు విధములగు కార్యములను ఒకేమారు నిర్వర్తింపగలరు. వీరికి వజ్ర శరీరముండును. ఇది దాదాపు శాశ్వత శరీరమే. దీనిని కారణ శరీరమని కూడ అందురు. ఇందుండి వెలుగు లోకముల కార్యములను చక్కపెట్టుదురు. సూక్ష్మతరమగు దివ్య ప్రణాళికను గ్రహింతురు. తదనుగుణముగ కర్మాచరణ మేర్పరచుకొందురు. వీరికి సూక్ష్మ శరీరముకూడ నొకటి యుండును. ఇందుండి సూక్ష్మ శరీర కార్యములు చక్కబెడుదురు. భౌతిక శరీరమొకటి యుండును. ఇందుండి భూలోక కార్యములను చక్కబెడుదురు. అవసరమగుచో ఒకే సమయమున పలుచోట్ల కనిపింపగలరు. ఈ శరీరము లన్నియు అష్టాంగ యోగమున మానవునికి సిద్ధించగలవు. ఇవి అద్భుతములు కావు, కృషి ఫలములు. జన్మల తరబడి చేసిన నిష్ఠాయుతమైన యోగసాధన యోగసిద్ధి నిచ్చును. ఈ విషయమున మహర్షులు పరిపూర్ణసిద్ధులు.

ఉదాహరణకు మరువు, దేవాపి మహర్షులు హిమాలయ ములలోని కలాప గుహల యందు నివసించుచు భౌగోళికముగ లోకహితులకు, సత్సాధకులకు ప్రేరణ కలిగించుచు జాతి పురోగ మునకై అహర్నిశలు పనిచేయుచుందురు. వీరు శ్రీకృష్ణుని ద్వారకా జీవన సమయమున కృష్ణునికి తోడ్పాటు గావించుచు అనేకానేక

కార్యములను ద్వారకలో చక్కపెట్టుచుండెడివారు. అచ్చట వారి పేర్లు శతానీకుడు (దేవాపి), మధువ్రతుడు (మరువు).

అధర్మ మెప్పుడును ధర్మముపై దురాక్రమణము చేయుచు నుండును. దీనికి అమాయక ప్రజలు బలియగు చుందురు. ఇట్టి ప్రజలను కాపాడుకొనుట, ధర్మమును నిలబెట్టుట ప్రకృతి యొనర్చు నొక కర్తవ్యము. యిట్టి పరమ ప్రయోజనమును సాధించుటకు ప్రకృతియే కొందరు జీవులను సిద్ధులుగను, చిరంజీవులుగను తీర్చి దిద్దుకొనుచుండును. నిజమునకు యీ ఋషులు శ్రీకృష్ణుని అప్రాకృత శరీర నిర్మాణ మహాయజ్ఞమున కూడ పాల్గొనినారు. పరాశరులు, మైత్రేయులు, వేదవ్యాసులతో కలసి తమ వంతు కర్తవ్యములెన్నియో వినియోగించినారు. రహస్య జీవనమున కిచ్చగించుటచే పురాణ సంహితలలో తమను గూర్చిన ప్రస్తావన బీజప్రాయముగ నుండునట్లు జాగ్రత్త పడినారు. మైత్రేయుడు, వేదవ్యాసులు ఎంతటి ప్రసిద్ధిగాంచిన యోగులో వీరుకూడ నట్టి వారే. ఆరాధ్యనీయులే. ప్రాతఃస్మరణీయులు, వాసుదేవ స్వరూపులు.

భాగవతమున వేదవ్యాస మహర్షి ద్వాదశ స్కంధమున వీరిని గూర్చి ఇట్లు పలికెను. *"శంతనుని యనుజుండగు దేవాపియు, ఇక్ష్వాకు వంశజుండగు మరుత్తును, యోగయుక్తులై కలాప గ్రామ నిలయులై కలియుగాంతమువరకు వాసుదేవ ప్రేరితులై ప్రజలను ఆశ్రమాచార ధర్మములు తప్పకుండ నడుపుచు నారాయణ స్మరణంబు నిత్యం బొనర్చి కైవల్యపద ప్రాపులగుదురు."*

అట్లే నవమ స్కంధమున దేవాపి, మరువు మహర్షులీ విధముగ తెలుపబడిరి.

*శీఘ్రునకు మరువు అను రాజశ్రేష్ఠుండు పుట్టెను. ఆ రాజ యోగి సిద్ధుడై కలాప గ్రామంబున నున్నవాడు. కలియుగాంతంబున నష్టంబయ్యెడు సూర్యవంశంబు గ్రమ్మర బుట్టింప గలవాడు.* (12వ అధ్యాయము)

*దేవాపి కలాప పురం*
*బావాసము కాగ యోగియై యున్నాడు*
*ర్వీవర కలి నష్టంబగు*
*జైవాతృక కులము మీద సంస్థాపించున్.*

విష్ణు పురాణమున వీరిని గూర్చి పరాశర మహర్షి యిట్లు పలికెను :

*దేవాపి : పౌరవో రాజా మరుశ్చిశ్వాకు వంశజ మహాయోగ బలౌపేతౌ, కలాపగ్రామ సంశయో కృతేయుగ ఇహాగత్వ ఛత్ర ప్రవర్తకే హితౌ భవిష్యతో మనోర్వేశే బీజ భూతౌ వ్యవస్థితౌ యేతేన క్రమయోగేన మనుపుత్రే వసుంధర కృత త్రేతాది సంజ్ఞాని యుగాని త్రీర్యుగ భుజ్యతే కలౌతు బీజ భూతాస్తే కేచి తిష్ఠంతి భూతలే. యధైవ దేవాపి మరువు సంప్రాప్తం సమవిస్తతే.*

కురువంశపు రాజగు దేవాపి, ఇక్ష్వాకు వంశపు రాజగు మరువు సమస్త యోగ సిద్ధులు కలిగి కలాప గ్రామమున నివసించు చున్నారు. కృతయుగము వచ్చు వరకు వారు జీవులచే హితము ననుసరింప చేయుచు మరల వర్ణాశ్రమ ధర్మములను భూమిపై స్థాపింపగలరు. వారు రాబోవు మన్వంతరమునకు బీజములై నిలచుటకు సంకల్పించి

నారు. భవిష్యత్ యుగములలో (కృత, త్రేత, ద్వాపరములలో) వారు జీవులకు యోగము, ధర్మముల నందింపజేయుదురు.

కల్కి పురాణమున కూడ నిదే విషయమును వేదవ్యాస మహర్షి పేర్కొనుట జరిగినది. అందిట్లున్నది : మరువు, దేవాపి మహర్షులు *యోగేశ్వరులై ఋషి నివాసమైన కలాప గ్రామమున వసించి యున్నారు. కలియుగాంతమున వీరు మరల వర్ణాశ్రమ ధర్మములను మానవుల కందించి నూతన శకము ఆరంభింతురు. (9వ స్కంధము, 22వ అధ్యాయము)*

కల్కిపురాణము, రెండవ అధ్యాయము, ప్రథమ అంశమున శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునితో పలికిన పలుకులుగ యిట్లు లిఖించ బడినది : *నీ ప్రార్థన ననుసరించి నేను భవిష్యత్తున శంబళ గ్రామమున విష్ణు యశస్సు, సుమతి దంపతికి జన్మించ గలను. నా నలుగురు సోదరులతో నేను మరల అజ్ఞానమును, అధర్మమును ఛేదించి ధర్మమును స్థాపించగలవాడను. నీవును, దేవతలు మీ మీ అంశలలో జన్మించి నాకు తోడ్పాటు గావించగలరు. నా హృదయేశ్వరియగు శ్రీలక్ష్మి సింహళరాజగు బృహద్రుతుడు – కౌముదులకు పద్మ అను నామమున జన్మించగలదు. అపుడు నేను భూవలయమునకు మరువును చక్రవర్తిగను, దేవాపిని జగద్గురువుగను స్థాపింతును. అప్పటినుండి భూమిపై సత్య యుగ మారంభమగును. శాశ్వత ధర్మము నెలకొల్ప బడును. కలి వధింపబడును.*

కల్కి పురాణమున యింకను యిట్లున్నది : మునుల ప్రార్థనల నంగీకరించి కల్కి భగవానుడు గంగాతీరమున వారికి ప్రత్యక్షమై

మునుల నందరిని పలుకరించి ఆశీర్వదించి యిట్లనెను. "పుణ్య పురుషులారా! మీ యందు దేదీప్యమైన కాంతులతో వెలుగొందుచున్న ఆ యిరువురి మహాత్ములెవరు? వారిచ్చటి కెందుల కేతెంచిరి? వారు గంగకు ఎందుకు ప్రార్థనలు సలుపుచున్నారు?" అనుచూ యింకను వారిరువురిని ఉద్దేశించి యిట్లనెను. "మీరు జాహ్నవి నెందుకు ఆరాధించు చున్నారు? మీరెవరు? మీ నామములేవి?"

అపుడు మరువు మహర్షి ముందుకేతెంచి, కల్కి దేవునికి నమస్క రించి తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు, తన నామమును తెలిపెను. చతుర్ముఖ బ్రహ్మ నుండి మరీచి పుట్టుట, మరీచి నుండి మరువు పుట్టుట, మరువు నుండి ఇక్ష్వాకు పుట్టుట అట్లు వరుసగ వంశపరంపరను విశదీకరించి తాను యిక్ష్వాకు వంశజుడనని, శీఘ్రుని కుమారుడనని వివరించెను. మరువు ఇంకను యిట్లనెను.

కృత యుగాంతము నుండి ఈ కలియుగాంతము వరకు కలాప గ్రామము నివాసిగ తాను ధ్యాన నిమగ్నుడై లోకహితమున నిలచి వాసుదేవ ప్రేరితముగ నిలచియున్నానని తెలిపెను. మరువు మహర్షి బ్రహ్మనుండి జనించిన వంశమునందు తాను యాభై తొమ్మిదవ వానిగ తెలుపుకొనెను. అప్పుడు కల్కిదేవుడు కోరగ దేవాపి మహర్షి కూడ తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు చంద్ర వంశమును వర్ణించెను. అత్రి మొదలుకొని, ప్రతీకుని వరకు గల చంద్రవంశమును తెలిపి, తాను ఆ వంశమున నలుబది రెండవ తరమునకు చెందినవాడనని, తన నామము దేవాపియని తెలిపెను. తాను కూడ మరువు మహర్షివలె కలాప నివాసియై, ధ్యానయోగమున

నిలచి వాసుదేవప్రేరితముగ లోకహితముగ కార్యముల నొనర్చితినని తెలిపి నమస్కరించెను.

అపుడు కల్కిదేవుడు సంతసించి వారిరువురి నాశీర్వదించి యిట్లు పలికెను :

*"మీరిరువురు అసమాన ధర్మస్వరూపులు. వాసుదేవుని వ్యూహము ననుసరించి జగత్‌హితముగ యుగముల తరబడి మానవజాతి ఉద్ధరణకై కృషి సలిపినారు. నేను కలి ధర్మమును నశింపచేసి కృత ధనువును స్థాపించగలవాడను. అపుడు మరువు భూవలయమునకు చక్రవర్తియై, అయోధ్య రాజధానిగ ధర్మ పరిపాలనమును ప్రారంభింప గలడు. దేవాపి జగద్గురువై హస్తిన కేంద్రముగ విశ్వ విజ్ఞాన విద్యను, వేద వేదాంగములను, యోగ మును జీవుల కందించుచు వారిని అమృతత్త్వదిశగ నడుపగలడు."*

ఇట్లనేకానేక విషయములు కల్కిపురాణమున ఈ మహర్షుల గురించి వివరింపబడినవి.

ఇట్లు మరువు, దేవాపి మహర్షులు కలాప గుహలయందు నివసించుచు, మైత్రేయునితో సహకరించుచు విశ్వవిజ్ఞాన విద్యయు, యోగమును భూగోళ వ్యాప్తి గావించుచు తదనుగుణమైన శిష్య పరంపరను నేర్పరచుచు సాగుచున్నారు.

వీరి ప్రభావముననే గ్రీకు, ఇజ్రాయిల్ దేశములలో విశ్వ విజ్ఞానవిద్య ఆయా శతాబ్దములలో వెలుగొందినది. పైథాగొరస్, సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ మొదలగు జ్ఞానులు గ్రీకు దేశమున

కెంతయో జ్ఞానము నందించిరి. గ్రీకు దేశపు జ్ఞానులలో పైథాగొరస్ అత్యంత ప్రసిద్ధి గాంచినాడు. దేవాపి మహర్షియే పైథాగొరస్గ జన్మించి గ్రీకు దేశీయులకు జ్ఞానభిక్ష పెట్టెనని యొక నానుడి కలదు.

అటులనే రోమనుల యందు పుట్టిన చక్రవర్తు లందరికిని సూర్యవంశపు రాజైన మరువు ప్రచోదన కారకుడని కూడ యొక నానుడి కలదు. రోమను సామ్రాజ్యమున ఘనకీర్తి సంతరించు కొన్నవాడు జూలియస్ సీజర్. అతడు మరువు మహర్షి యొక్క ప్రధాన శిష్యుడని యొక నానుడి కలదు. రోమను రాజ్యమే లేనిచో ఐరోపా ఖండమునకు నాగరికతయే యుండెడిది కాదు. సంఘ జీవనము, నగరవాసము, పౌర బాధ్యతలు, రాజ్యాంగము, చట్టము పరిరక్షణ, ఖగోళ భూగోళ శాస్త్రములు, జ్యోతిష్యము– ఇత్యాది మానవ వికాస పరమగు అంశము లన్నియు రోమనులే ఐరోపా ఖండమున ప్రవేశ పెట్టిరి. అంతకుముందు శతాబ్దముననే ఆర్యావర్తపు ప్రజలు నాగరికులై యుండెడివారు. హస్తిన, ద్వారక, వారణాసి, మధుర, ఉజ్జయిని విశిష్ట నగరములుగ నుండెడివి.

యూదు ప్రజలను బానిసత్వము నుండి విడిపించిన మోజెస్ మరువు మహర్షి అవతారమని, అతి బలిష్టమైన ఈజిప్ట్ చక్రవర్తిని నిర్జించి, బానిసత్వపు చెరనుండి విడిపించి యూదులకు స్వాతంత్ర్యము కల్పించుటయే కాక, వారికి జ్ఞానభిక్షను కూడ పెట్టినాడు. అటులనే యూదు ప్రవక్తలో అత్యంత ప్రాధాన్యము వహించిన జ్ఞాని 'యలీజా' దేవాపి మహర్షి యొక్క అవతారమని కొందరు భావించుచుందురు.

ఏసుక్రీస్తు జన్మ సమయమున అతనిని సందర్శించి, ఆశీర్వ

దించిన ముగ్గురు జ్ఞానులును మైత్రేయుడు, మరువు, దేవాపి మహర్షు లని హిమాలయములలోని ఆశ్రమవాసులు భావింతురు. చివరి మూడు సంవత్సరములు ఏసును నడిపించినది కూడ మైత్రేయుడే అని వారి భావన.

ఇటీవల శతాబ్దములలో నెపోలియన్ చక్రవర్తికి ప్రేరణ కలిగించి, ఐరోపా ఖండమంతటికిని ఒకే రాజ్యాంగ విధానము నందింపజేసిన బృహత్తర ప్రయత్నము వెనుక మరువు మహర్షి హస్తమున్నదని ప్రతీతి.

పంతొమ్మిదవ శతాబ్దములో ఈ మహర్షులే హెలీనా పెట్రోవ్నా బ్లావెట్స్కీకి దర్శన మిచ్చి జ్ఞానబోధను గావించి, పిండాండ బ్రహ్మాండ సృష్టి రహస్యములను, మన్వంతర రహస్యములను తెలియజెప్పి, విశ్వ విజ్ఞాన విద్యకు మరియొక ప్రయత్నము చేసినారు. ఆ ప్రయత్నమునకు కొనసాగింపుగ 20వ శతాబ్దమున 'ఏలిస్. ఏ. బెయిలీ' అను ఆంగ్ల యువతిని, నికోలారోరిక్' అను రష్యాదేశపు యువరాజును, భారతీయులైన 'కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యుల' వారిని తమ స్పర్శచే ప్రభావితము గావించి భౌగోళిక జ్ఞానసంపదను సంతర్పణ గావించినారు.

భౌగోళికముగ ఐదువేల సంవత్సరములలో ఈ మహర్షులు గావించిన మహత్తర కార్యములన్నియు కూడ మానవ పురోభివృద్ధికే నిర్దేశింపబడినవి. జీవ పరిణామమునకే తోడ్పడినవి. గత ఐదువేల సంవత్సరములుగ వీరు తీర్చిదిద్దిన శిష్యపరంపర భౌగోళిక వ్యాప్తి చెందినవి. అన్ని రంగములలోను నిష్ణాతులైన శిష్యులు కలరు.

అమెరికన్ ప్రెసిడెంట్ 'రూజ్‌వెల్ట్', శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' వంటి మహా పురుషులు కూడ వీరి శిష్యకోటిలోని వారే. మతముల కతీతమైన సత్యములను దర్శింపచేయుచు మత ఛాందసము నుండి జీవుల నుద్ధరించుట కూడ వీరు చేయు ప్రయత్నములోని భాగములు. అట్టి వారిలో భరత దేశము నేలిన అక్బరు చక్రవర్తి యొకరు. ఆయన దేవాపి మహర్షి శిష్యుడని ప్రతీతి.

ఋషి కార్యముల నెరుగుట ఋషుల అనుగ్రహముననే తెలియగలదు. అంతయును తెలుపుట ఎటులను సాధ్యము కాదు. కాని వారి స్మరణ సకల శుభంకరము. అట్టి ప్రయత్నమే ఇది. మరువు, దేవాపి మహర్షుల గూర్చి పురాణ సంహితల యందున్నను తెలిసిన వారు బహుకొద్ది. గుప్తముగ వేల సంవత్సరముల నుండి జగద్ధిత కార్యముల నొనర్చుచున్న ఈ మహర్షులను గూర్చిన విషయములు ఇప్పుడిప్పుడే జనసముదాయము పరిచయము లోనికి వచ్చుచున్నవి.

వారిని గూర్చి పరిచయము చేయు ప్రయత్నములో ప్రస్తుతము వీరి బోధనలలో రెండవ భాగమును అందించుచున్నాము.

# 1

## చికిత్స

ఐరోపా ఖండమందు చలికాలమున వేసవికై ఎంతయో ఎదురు చూచుదురు. వైద్యులు సహితము “కొద్దిరోజులలో వేడిమి వచ్చును, సూర్యుని వెలుగు వచ్చును, మీ అస్వస్థతకు ఉపశమనము కలుగును” అని రోగులకు ఊరట కలిగింతురు. మేము చేయునది కూడ అదియే. “నూతన యోగము వచ్చుచున్నదని, జీవులు మరణమును దాటుదురని, భూమిపై దివ్యత్వము అవతరించునని, సుఖశాంతులు వర్థిల్లునని, భవిష్యత్తు చాల బాగున్నదని” స్ఫూర్తి నిచ్చుచున్నాము. జ్యోతిష్యులు, సాముద్రిక శాస్త్రజ్ఞులు, యోగులు, వైద్యులు సంస్కారవంతులైనచో ముందు కాలము బాగున్నదని తెలుపుదురు. ఇది కేవలము మభ్యపెట్టుట కాదు. యిందొక సత్యమున్నది. గతము మరల రాదు– గత కర్మమే ప్రస్తుతమున అనుభవింపబడుచున్నది. ముందు కాలము బాగుండు టకు ప్రస్తుతము చికిత్స చేసుకొనుట కర్తవ్యము. అందుచేత చికిత్స కున్ముఖులగుటకు ప్రోత్సహించవలెను కదా! లేనిచో ముందు కాలముకూడ యిట్లే యుండును.

నిన్నటి రోజున తినునది ఈ రోజునకు కడుపునొప్పి తెచ్చును.

నేడు చికిత్స పొందినచో రేపు బాగుండును. నిన్నటి రోజున తిన్నది మరల తినకూడదని తెలియుట కూడ చికిత్సలో భాగము. యిట్లు చికిత్స చేయుటయే మా పని. ఇది ఆశావాదమని భావింపక యిందలి శాస్త్రములను తెలుసుకొనుడు. రేపు బాగుండునని తెలిపినచో నేడు చికిత్సకు మీరు పూనుకొనరు కదా! మీకు ఉత్సాహము కల్పించుట వలన కదా చికిత్సకు సిద్ధమగుచున్నారు! లేనిచో మీరు నిర్లిప్తులై కర్తవ్యోన్ముఖులు కాక అట్లే యుందురు. మిమ్ములను కర్తవ్యోన్ముఖులను చేయుటయే మా పని. ఇది శాశ్వతముగ జరుగుచునే యుండును.



# 2

## సుగంధము

సువాసన లన్నియు సుగంధములు కావు. ఆధునిక కాలమున మానవులచే తయారు చేయబడుచున్న అనేకానేక పరిమళములు అసహజములై, విషపూరితములై మానవులకు హాని కలిగించుచున్నవి. రకరకములగు రసాయనములతో చేయు పరిమళములు చిత్తమునకు వికాసము కలిగింపవు. సుగంధములు, సుపుష్పములు సహజమగు పరిమళములు కలిగి, చిత్త వికాసమునకు తోడ్పడి జీవ చైతన్యమును బలపరచును. చందనము, కస్తూరి, సాంబ్రాణివంటి సుగంధములు; మల్లెలు, గులాబీలు, సంపంగి, చంపకము వంటి సువాసన గల పుష్పములు ఆత్మ చైతన్య వికాసమునకు తోడ్పడగలవు. కామతృష్ణను పెంచు పరిమళములు చిత్తమును వికారమునకు గురిచేయునేగాని, వికాసము కలిగింపవు. బుద్ధిమంతులు ఈ విషయమును గ్రహింతురు గాక!

**మనస్సు, యింద్రియములు, శరీరములను పవిత్ర భావము, పవిత్ర భాషణము, సత్కర్మాచరణమునకు వినియోగించుచున్నచో, దేహమే సహజముగ సువాసనలను కలిగి యుండును. శుభవాసనలు గల దేహము సువాసన పూరితమై యుండును.** దుర్గంధములకు

ప్రతిరూపమే దుర్వాసన. సంఘపరముగ సువాసనలను ప్రసరింప జేయుటకు సుగంధములు, పరిమళములు వాడవచ్చునుగాని, అవి సహజములు, ప్రకృతి సిద్ధములై యుండవలెను. అట్టి వానివలన చిత్తము గూడ ప్రశాంతతను పొంది వికాసమును చెందును. ఇది కారణముగనే దైవప్రార్థన, పూజాది సమయములందు సుగంధములు, సుపుష్పములు వాడుట ఆచారములోనికి వచ్చినది. సత్సాధకులీ విషయమున తగు హెచ్చరిక కలిగి యుందురు గాక!

## 3

## ఒక సూచన

మీలో కొందరు మా ఆశ్రమ ప్రవేశమునకై తహతహ లాడు చుందురు. ఇదికూడ మోహమే. ఈ మోహమును వదలుడు. ప్రపంచ మున మీవంతు కర్తవ్యము నిర్వర్తింపుడు. మా సందేశములను సామాన్యులకు అందించి వారికి ఊరట కలిగింపుడు. మమ్ములను గూర్చి వివరించుచు, మా సాన్నిధ్యమును మీరు పొందుచు, వినువారికి కూడ అందింపుడు. మమ్ములగూర్చి, మా బోధల గూర్చి వివరించు టలో మీకు ఉన్నతి యున్నది. ఇది ఒక భాగవత సేవ. నిస్సందేహముగ మీరు దివ్యపథమున ఈ విధముగ నిలువ వచ్చును.

మిమ్ములను గూర్చి మీరెప్పుడును ప్రసంగింపకుడు. మీకు మహాత్ములతో గల సన్నిహితత్వము నెప్పుడును ప్రకటింపకుడు. మీరు పలుకు మాటలు, మీరు నిర్వర్తించు చేష్టలు మిమ్ములను గూర్చి చెప్పుచునే యున్నవి. మరల మీరు చెప్పుకొనుటయేల? బుద్ధుడు నిష్క్రమించు సమయమున తమ అనుయాయుల నుద్దేశించి యిట్లు పలికినాడు. “మిమ్ములను గూర్చి మరచుడు. ధర్మపథము నందింపుడు. మీరెల్లప్పుడును నాతోనే యుండగలరు.”

4

## ఉండుట - లేకుండుట

"మైత్రేయ సంఘము ఒక అభూత కల్పన" అని అహంకారులు చాటుచు నుందురు. "మైత్రేయ సంఘము పామరులను మోసగించుటకు స్వార్థపరులేర్పరచిన ఒక మాయాజాలము" అని ఇంద్రజాలికులు భూమి నలుచెరగుల ప్రచారము చేయుచున్నారు. "మైత్రేయ సంఘము లేదట, ఉన్నదని భ్రమ పడితిమి" అనుచు కొందరు బలహీనులు క్రిందుమీదు లగుచున్నారు.

సంఘమున చేరి శ్రమించువారిలో కొందరికి అహంకారము కలుగును. వారహంకరించినపుడు సంఘము వారికి సహకారము నందించదు. అపుడు మరింత రోషపడి ఈ అహంకారులు వ్యతిరేక ప్రచారము చేయుదురు.

సంఘ కార్యక్రమములందు పాల్గొని కొన్ని సిద్ధులను పొందిన వారు, తమ సిద్ధులను దుర్వినియోగము చేయుట అపుడపుడు జరుగుచుండును. అట్టివారు కూడ సంఘమునకు దూర మగుదురు. వారు స్వతంత్రించి తమదైన పద్ధతులలో తమను గొప్పవారిగ ప్రకటించుకొనుటకు చేయు ప్రయత్నమున సంఘమును నిరాకరింతురు.

పై రెండు తెగలవారు చేయు ప్రచారములు సామాన్యజనులకు తికమక కలిగించు చుండును. మైత్రేయ సంఘమును గూర్చి ప్రస్తుత మున ప్రపంచమున గల పరిస్థితి యిదియే. అహంకారులు, మాయావులు, పామరులు మూడు తరగతులుగ నిరాకరించువారు గోచరింతురు. ఇందు మొదటి యిద్దరు పాపకర్మమును కూడగట్టుకొను చున్నారు. పామరులు గమ్యమున తడబడుచున్నారు.

ఉండుట, లేకుండుట అనునవి ద్రష్టయొక్క చేతనను బట్టి యుండును. సృష్టియందు నామము ధరించిన ప్రతి అంశము ఉన్నదియే. లేనిది భావనకు రాదు. ఉన్నది లేకుండుట జరుగదు.

# 5

## స్థూల - సూక్ష్మములు

స్థూల సూక్ష్మలోకములు ఉన్నవి. స్థూలమే యున్నది, సూక్ష్మము లేదని భావించువారికి సమగ్రమగు అవగాహన యుండదు. సమస్తము సూక్ష్మము నుండియే స్థూలమునకు అవతరించు చుండును. స్థూల మదృశ్యమైనపుడు సూక్ష్మమున నుండును. ఈ జ్ఞానము కలిగినవారికి ఘర్షణ యుండదు. విచారము, దుఃఖము, బాధ కూడ ఉపశమించును. తమ సమస్యలకు కారణము తమయందు సూక్ష్మముగనున్న స్వభావమే యని తెలియును. తమ స్వభావమున మోహము, మమకారము, అహంకారము ఉన్నపుడు సమస్యలు సృష్టించుకొనుచు, యితరుల వలన తాము దుఃఖపడుతున్నా మని భావింతురు.

స్థూల సూక్ష్మముల ధర్మము నెరుగుడు. కార్యకారణముల రహస్యము తెలియుడు. అట్టి తెలివితో ప్రశాంత మనస్కులై జీవితము సాగింపుడు.

# 6

## జీవుల కథ

**పు**నర్జన్మమును గూర్చి యోచించుము. ప్రతి జన్మము ఒక నూతన వాతావరణము నందించును. నూతనమైన అవకాశములు కూడ అందించును. ఒక ఉద్యోగి బదిలీ అయినపుడు నూతన ప్రదేశమునకు పోవును. నూతన గృహమున వసించును. నూతన పరిచయము లేర్పడును. కాని కర్తవ్యము నూతనము కాదు. తాను నూతనుడు కాదు. అతడు నూతన ప్రదేశమున, నూతన పరిచయము లతో మునుపటి కర్తవ్యమునే నిర్వర్తించుచు నుండును. ఊరు మారినను, స్వభావము మారదు. లంచగొండి లంచగొండిగనే కొన సాగును. నిజాయితీపరుడు నిజాయితీపరుడుగనే కొనసాగును. ఇంతలో మరల బదిలీ యగును. ఒక బదిలీకి మరియొక బదిలీకి మధ్యనున్న మజిలీ తాత్కాలికమే. కాని కర్తవ్యము, స్వభావము తన వెంట నడచును.

జన్మ పరంపరలు బదిలీల వంటివి. అందు తాను సనాతనుడు. తన కర్తవ్యము సనాతనమే. తన కేర్పడిన స్వభావము తన కర్తవ్య నిర్వహణము బట్టి ఏర్పడిన పొర. కనులకీ పొర కట్టినవారు తదను భవమును, అందలి సారమును, పారమును తెలిసి మరల నిష్కామ మగు కర్తవ్యమున చేరుదురు. ఇది జీవుల కథ.

7

## నిద్ర విలువ

**సూ**క్ష్మలోకము లోనికి ప్రవేశింపవలెనని తపన చెందు జిజ్ఞాసువులకు ధ్యానమొక ఉపాయము. కాని ధ్యానమున స్వభావ రూపమున తమ భావములే తమ కడ్డు పడుచుండును. ధ్యానము ద్వారా సూక్ష్మలోక ప్రవేశము సిద్ధులు మాత్రమే నిర్వర్తింపగలరు.

సూక్ష్మలోక ప్రవేశమునకు ప్రకృతి అందించిన నిద్ర ఒక ఉపాయము. నిద్ర ద్వారా జీవుడు భౌతికమునుండి సూక్ష్మములోనికి ప్రవేశించుచున్నాడు. కాని అట్లు ప్రవేశించుచున్నాడని తెలియదు. తదనుభూతియు ఉండదు. నిద్ర కుపక్రమించు సమయమున తాను సూక్ష్మలోక ప్రయాణము చేయుచున్నాను అను భావముతో నిద్రించు నపుడు, నిత్యము అట్టి భావన చేయునపుడు ప్రవేశమున కర్హత కలుగును. దైవమునుగాని, సద్గురువునుగాని ప్రార్థించుచు నిద్రించి నచో త్వరితగతిని ప్రవేశార్హత కలుగును.

నిద్ర విలువ తెలిసి నిద్రించుట సాధకునకు అతిముఖ్యము. మెలకువలో జీవనమెంత విలువ కలదో, అంతకుమించిన విలువ

నిద్రద్వారా కలుగ గలదు. సూక్ష్మలోక ప్రవేశము భౌతికలోక పరిమితులను దాటినపుడు జీవునికి ప్రశాంతత నిచ్చును. ఈ కారణముగనే నిదురనుండి మేల్కాంచిన జీవుడు సహజముగ ప్రశాంతత పొంది యుండును.

# 8

## హెచ్చరిక

నీ మనసు, యింద్రియములు, శరీరము నీతో సహకరించు చున్నవా? వానిమధ్య సంఘీభావము, పరస్పరత్వము ఉన్నవా? నీ లోపల లేని సహకారము, సంఘీభావము, పరస్పరత్వము నీవు వెలుపల నిర్వర్తించలేవు. ఆశయములు నిర్వర్తించుటకు వలసిన అర్హత అంతరంగమున ఏర్పరచుకొనవలెను. భావన, భాషణము, నిర్వర్తనము అనుసంధానము చెందనిచో నీ ఆశయము నిర్వర్తింప బడదు. ఆవేశము పాలు కొంత వుండుట మంచిదే కాని, ఆశయము లను కప్పివేయు ఆవేశము వర్జనీయము.త్రికరణశుద్ధి ప్రథమముగ నీ గమ్యమై యుండవలెను. మాటలు మడతపెట్టుట, మడమలు త్రిప్పుట వలన అలౌకికమగు కార్యములు సాధించలేవు. వానివలన తాత్కాలిక విజయములే కలుగును కాని, పతనము శాశ్వతముగ జరుగుచుండును.

అంతర్ముఖుడవై నీయందలి అంతర్లోకముల అలజడిని సర్దుబాటు చేసుకొనుము. అందులకు నిర్మలమగు దైవారాధనమే ప్రధానమగు ఉపాయము. ఇతరోపాయములు పెడదారి పట్టింప

గలవు. నీ తెలివిని నమ్మక దైవమును నమ్ముము. నీ తెలివి నీ స్వభావమను రంగుటద్దము నుండియే పనిచేయును గనుక, నీ తెలివి, నీ తర్కము నిన్నుద్ధరించుటకు ఉపయోగపడవు.

# 9

## కఠినత్వము - క్రూరత్వము

**క**ఠినత్వము వేరు, క్రూరత్వము వేరు. ధర్మపరులు కూడ ధర్మాచరణమున కఠినముగ నుందురు. అది క్రూరత్వ మనబడదు. స్థిరచిత్తము అవగాహన కానపుడు ఎదుటివారికిది కఠినత్వముగ గోచరించును. స్థిరచిత్తులు కఠినముగ నుండుట తమకు, తమ పరిసరములకు అప్రమత్తత కలిగించుటకే. పథకము నాచరించుచు స్థిరముగ నున్నామనుకొనుచు, కఠినముగ నుండుట క్రూరత్వమగును.

కఠినత్వమునకు, క్రూరత్వమునకు స్థిరచిత్తము పునాది. స్థిరచిత్తము జ్ఞానులకు, అజ్ఞానులకు కూడ నుండవచ్చును. అజ్ఞానుల స్థిరచిత్తము క్రూరత్వమై నిలచును. జ్ఞానుల స్థిరచిత్తమట్టిది కాదు. అజ్ఞానము నుండి జ్ఞానమునకు జీవుడు మార్పు చెందుచున్నకొలది, స్థిరచిత్తమను మూఢత్వము సడలి, మార్పున కవకాశమిచ్చును. జ్ఞానుల స్థిరచిత్తము పరిస్థితుల ప్రభావమునకు లోనుకాక స్థిరమై నిలచును. పదముల అంతరార్థము తెలియుట జిజ్ఞాసువునకు ప్రధాన లక్షణము.

## 10

# మా ప్రసారము

**భా**రతదేశమున నున్న భక్తి విశ్వాసములు యితర జాతులలో కానరావు. కానీ భారతీయులు దైనందిన జీవన సమస్యలలో కూరుకొనిపోయి దైవమును, గురుపరంపరను సద్వినియోగము గావించుకొనుట లేదు. సహజముగ నిరహంకారులైనను, ప్రాపంచిక విషయములపై ఆకర్షణ పెరిగి, అహంకారు లగుచున్నారు. చాలమందికి గురుపరంపర దైవమునకు, మానవునకు మధ్య వంతెన వంటిదని తెలియదు. తెలిసినవారు కూడ, పరంపర అస్థిత్వమును అంతంత మాత్రముగనే జ్ఞప్తియం దుంచుకొందురు. పరిహాసముగ భాషించునప్పుడు పరంపరను గాని, అందలి సభ్యులను గాని పేర్కొనుట తగదు. వారి విషయమున అపహాస్యము తగదు.

మానవ దైనందిన ప్రాపంచిక భావములకన్న అతీతముగ గురుపరంపర యున్నది. ఉత్తమ భావములలో విహరించువారికి మాత్రమే మా అస్తిత్వము స్పర్శ కలుగగలదు. సంకుచితము, కలుషితము, అజ్ఞానపూరితము అగు మానవుల భావనలు సోకకుండునట్లుగ ఊర్ధ్వ శిఖరములయందు ఆవాస మేర్పరచుకొని,

దివ్యము, ఉత్తమము అగు భావములను మీ కొరకు గురుపరంపర నిత్యము ప్రసారము చేయుచున్నది. ఈ ప్రసారము నందుకొనుట మీ వంతు.



11

## గ్రంథ పఠనము

సద్గ్రంథములను చదువుట వేరు, పఠించుట వేరు. ప్రస్తుత కాలమున చాలమంది గ్రంథములనే చదువరు. చదివెడి కొద్దిమందిలో పఠించువారు బహు కొద్ది. చదువుటకు అక్షరజ్ఞానము, భాషాజ్ఞానము చాలును. పఠనమునకు సంస్కారము అవసరము. తనను తాను సంస్కరించుకొనుచు గ్రంథమును పఠించినచో లోతైన విషయములు గ్రంథ మావిష్కరించును. సద్గ్రంథము పఠించినవెంటనే దానిపై భాష్యము చేయుట తగదు. దాని నాకళింపు గావించుకొని జీవితమున అనుభవమును చెంది, అటుపై కోరినవారికి బోధింపవలెను. గొప్ప తనమునకై బోధన చేయుట పురోగతికి అవరోధము కలిగించును.

# 12

## ఊహాతీత సహకారము

**మా** సహాయము మీకు ఎన్ని విధములుగ అందించుటకు ప్రయత్నింతుమో, మీరు ఊహింపనైన ఊహింపలేరు. సహాయ మెప్పుడును అనూహ్యమైన రీతిలోనే మీ కందును. మీరూహించిన రీతిలో సహాయము అందకపోవుటకు కారణము మీరే. అందివచ్చు సహాయమును, మీ ఊహతో అడ్డుదురు. ఆశించుటవలన, భావ లోకములలో అవరోధము లేర్పడును. అందువలన ఆశించురీతిలో గాక, మరియొక రీతిలో సహాయ మందును. ఉత్తమమైన సహాయ మెప్పుడును అనూహ్యముగనే అందించబడును.

సూక్ష్మలోకములలో (మీరు నిద్రించునపుడు) మా సాన్నిధ్యము నిచ్చి మిమ్ములను స్థిరచిత్తులను చేయుదుము. మీరు పఠించు సామాన్యమైన పుస్తకముల నుండి కూడ అనూహ్యమగు సందేశము లందింతుము. మీరు సినిమాలు మొదలగునవి చూచునపుడు కూడ, అందుండి మీకు స్ఫురించవలసిన సందేశ మందింతుము. అన్వేషాత్మక మైన మనసున్నవారికి తత్సంబంధమైన సందేశములు అనేకానేక రూపములలో అందించి సహాయ మొనర్చుట మా ప్రయత్నము. ఏ సన్నివేశము నందైనను మీరు హెచ్చరికగ నున్నచో మీకు సందేశ

మందగలదు. అందిన సందేశమునకు, సలహాకు కృతజ్ఞులై కూడ యుండవలెను. కృతజ్ఞత మానవుని సంస్కారములలో ప్రప్రధానమైనది. అన్వేషాత్మకమైన మనస్సుతో, కృతజ్ఞతతో అప్రమత్తులై ఉన్నవారికి సందేశము, సలహా, సహకారము, సహాయము తప్పక లభింపగలదు. భక్తి విశ్వాసములతో కర్తవ్యము నిర్వర్తించు వారికి వచ్చు సహకారము సున్నితముగ మేమందించు చున్నాము.

13

## మనోదృక్పథము - హృదయదృశ్యము

ఎచ్చట జ్ఞానమును గూర్చి తపన యుండునో, అచట వికాసమను వెలుగు ఏర్పడుచుండును. తపన మండుట వంటిది. అది తీవ్రమైన కోరిక. అట్టి కోరిక జ్ఞానపరమైన విషయములందు కలిగినచో వికాసము తప్పనిసరిగ కలుగును. మంట పెరిగినకొలది జ్వాలలై పరిసరములకు ప్రకాశము నందించగలవు. అట్టి తపనయే తపస్సు.

అజ్ఞానము పరిమితత్వము కలిగించును. సంకుచితత్వము కలిగించును. జ్ఞానము విశాలత్వము కలిగించును. విశాల దృక్పథము లేనివారికి జ్ఞానము మృగ్యమే. మనో వైశాల్యమునకు హృదయము నుండి భావించుట నేర్వవలెను. హృదయ తత్వము అపరిమిత తత్వము. మనోతత్వము పరిమితము. సంకుచితత్వము మానవ చైతన్యమునకు అడ్డుగోడలను కట్టును. మనో సంకుచితత్వమును హృదయ వైశాల్యముతో నిర్మూలించుకొనుట సాధకుని కర్తవ్యము. దీనికి సంసిద్ధత ప్రధానమైన లక్షణముగ నున్నది. సంసిద్ధత లేనివారు వైశాల్యమును పొందలేక కూపస్థ మండూకములవలె జీవించుచు,

మరణించుచు నుందురు. జ్ఞానము నాశ్రయింపుడు. జ్ఞానాగ్ని చేత పరిమితులను దగ్ధము చేయుడు. దృక్పథములు నశించినపుడే దృశ్యము గోచరించ గలదు.

## 14

# మన కథ

**మా**నవజాతి ఒక్కటియే. భూగోళము వారి ఆవాసము. ఎక్కడ నున్నవారు అక్కడ భూమిపై పరిధుల నేర్పరచుకొని పరిమితు లగుచున్నారు. స్వదేశీయులు, విదేశీయులు అగుచున్నారు. ఇది మనసున చేసుకొనిన ఏర్పాటు. ఈ ఏర్పాటు వలన తమవారు, యితరులు అను భావ ముద్భవించును. స్వదేశీయులలో కూడ ఏ ప్రాంతము వారు ఆ ప్రాంతమునకు పరిమితులై ప్రాంతీయ భావములను పెంపొందించుకొను చున్నారు. ఇది మరియొక తప్పటడుగు. ప్రాంతీయు లలో కూడ కులమును, మతమును ఆధారముగ చేసుకొని మరికొన్ని పరిధు లేర్పరచినారు. అటుపైన భాష ఆధారముగ కూడ పరిమితులు కల్పించుకున్నారు.

ఏడుగురు పిల్లలుగల ఒక తండ్రి బిడ్డలందరు సుఖముగ నుండ వలెనని, ఒక విశాలమగు గృహ మేర్పరచి, అందరికిని వసతు లేర్పరచి నాడట. ఆ గృహమందరిదిని. తండ్రి అదృశ్యమవగ, తనయులు క్రమముగ వేర్పాటు భావము ధరించి, ఒక గృహమున ఏడు గృహములుగ గోడలు కట్టుకొని అందిమిడినారు. వారి తనయులు ఏడు భాగములలోను మరల గోడలు కట్టి 49 భాగములు చేసినారు.

భాగములు చిన్నవగుటచేత దౌర్జన్యముతో ప్రక్కవారి భాగములను కూడ ఆక్రమించినారు. ఆక్రమణకు గురియైనవారు తిరుగుబాటు కావించి నారు. అప్పటినుండి యిప్పటి వరకు ఆ కుటుంబము వివాదములతో, ఘర్షణలతో సతమతమగుచు జీవితము దుర్భరము గావించు కొన్నది. అదృశ్యుడైన తండ్రి మరల అవతరించి, తన సంతతి దుస్థితిని చూచి, పరితపించి సంఘీభావమునకై కృషి చేయుచున్నాడు. ఇప్పటికిని కృషి జరుగుచునే యున్నది.

15

## మానవ సౌఖ్యము

విలువైన వస్తువులను, యిష్టమైన వస్తువులను భద్రపరచుకొనుట మానవునికి సహజముగ తెలియును. వానిని యినుమడించిన శ్రద్ధతో భద్రపరచి కాపు కాయుచుందురు. ఈ విషయమున మానవులను మించిన తెలివి గలవారు లేరు. ఇట్టి తెలివిగల మానవులు విలువైన ఖనిజములను, లోహములను భద్ర పరచుదురు. కాని యితర ప్రాణులైన వృక్షములు, జంతువుల యందు ఈ శ్రద్ధ కనబరచుట లేదు. ఇది దురదృష్టకరము. పంచభూతముల యందు కూడ అతడికి శ్రద్ధ లేదు. భూమి, నీరు, గాలిని నిత్యము కలుషితము చేయుచునే యున్నాడు. ఇతర ప్రాణులను, పంచభూతములను విలువ తెలియక దుర్వినియోగము చేయు మానవునికి సుఖశాంతు లెట్లు లభ్యము కాగలవు? సహజీవనమను పదమునకు విశాలమగు అవగాహన మానవునకు అవసరము. తెలివిగల మానవుడు చేయు తెలివితక్కువ పని యితర ప్రాణిహింస, దుర్వినియోగము. మానవుని యందు ఈ తెలివికూడ ఉద్భవించిననాడు సమష్టి జీవనమున అతడు సుఖపడ గలడు.

## 16

# సోదరత్వము

***సహకారము :***

సహకారము తెలియనివారికి సోదరత్వమను పదము అందని ఫలము. తనతో అందరు సహకరించవలెనని ప్రతి ఒక్కరును కోరుచుందురు. తా నెందరితో సహకరించు చున్నాడో గమనించుట సాధకునకు ముఖ్యము. తాను సహకరించినచో తనకును సహకారము లభించును. సహకరించని వారికి సహకారము లభించదు. అధికారము చూపినచో అసలు లభించదు. సోదరత్వమునకు సహకారము మొదటి మెట్టు.

ఒకే రక్తము పంచుకొని పుట్టినవారి నడుమనే సహకార మంతంత మాత్ర మున్న ఈ రోజులలో ఆధ్యాత్మిక సోదరత్వము నీటిపై మాటవలెనే యుండును. రామాయణమున మూడురకముల సోదరత్వములు దర్శింపవచ్చును. మొదటిది రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు. రెండవది వాలి, సుగ్రీవులు. మూడవది రావణ, కుంభ కర్ణ, విభీషణులు. మొదటి జట్టులో సహకారము, సహవేదన, ప్రేమ అత్యుత్తమముగ గోచరించును. రెండవ జట్టులో అహంకరించుట, పొరపడుట, వైరము గోచరించును. మూడవ జట్టులో పూర్ణవైవిధ్యము,

వైరము గోచరించును. స్వార్థచింతన పెరిగినపుడు సోదరులే కాదు మరి ఎవ్వరైనను ఒకటియే. స్వార్థము నుండి పదార్థము వైపునకు మళ్ళుటకు సహకారము మొదటి మెట్టు.



17

# సోదరత్వము - 2

*ప్రజ్ఞ - పదార్థము - విభజన :*

పదార్థము ప్రజ్ఞను విభజించుచు తనను తాను పెంచుకొనుచు పోవును. మానవ ప్రజ్ఞను మానవదేహము పై విధముగ విభజన చేసి తన వృద్ధికై చింతన చేయుచుండును. దేహము పదార్థమయము. అందు వసించునది ప్రజ్ఞ. పదార్థమయమగు దేహము నివాసమై యుండవలెను గాని, కారాగారము కారాదు. దేహమందలి అణువులను ఆహారము, నిద్ర, వ్యవహారముల ద్వారా పలుచగ నేర్పరచుకొనవలెను. వంగని దేహము లొంగని గుఱ్ఱము వంటిది. దానిపై ప్రయాణము క్లిష్టమగును. ప్రజ్ఞ విభజనకు గురి అయినపుడెల్ల పదార్థమునకు బలము పెరుగును. పదార్థమునకు విభజించు గుణముండుట వలన తనయందలి జీవ ప్రజ్ఞనే విభజించి బంధించగలదు. అట్టి తరుణమున తోటివారితో విడిపడుట యిత్యాదివి సులభముగ సాగును. వేర్పాటు ధోరణి వలన తనయందు సహకారబుద్ధి నశించుచు నుండును. తాను సహకరింపనపుడు క్రమముగ తనకును ఎవ్వరును సహకరింపరు. మానవ ప్రజ్ఞ పదార్థము వైపునకు అతిగ ఆకర్షింపబడినపుడెల్ల కలుగునది ఎడబాటే. ఎడబాటు సహకారము

నకు వ్యతిరేకము. దేహమందు వసించుచున్న ప్రజ్ఞకు వేర్పాటు భావన కలిగినపుడెల్ల అది కలి భావమని గ్రహించి త్రోసిపుచ్చవలెను. అట్లు చేయనిచో మిగులునది ఒంటరి జీవితమే!

# 18

# సోదరత్వము - 3

**చైతన్య వికాసము :**

మానవజాతి ప్రస్తుతము సూక్ష్మలోకము లను, దివ్యలోకము లను మరచినది. భౌతిక లోకమే సమస్తమని భావించు చున్నది. ఈ స్థితియందు విశాలభావమగు సోదరత్వము ఆవిష్కరింపబడుట ఎట్లు? భూమిపైననే అత్యద్భుతమగు ఆధ్యాత్మిక సోదరబృందము ఉన్నదని ఎట్లు తెలియదగును? సహకరించుట తెలియని వారికి మా సోదర బృందము స్పర్శయే కలుగదు. దర్శనము, సంభాషణము ఎట్లు కలుగును?

మనసున పదార్థభావములే మెండుగ నున్నపుడు ప్రజ్ఞ పదార్థము వైపునకే మ్రొగ్గు చుండును. విశాల భావములు కలుగవు. సంకుచిత భావముల వలన మానవప్రజ్ఞ కూడ సంకోచించును. వ్యాకోచము కలుగవలెనన్నచో సద్గ్రంథ పఠనము ఆవశ్యక మగును. సద్గ్రంథ పఠనము, సత్పురుష దర్శనము, సద్బోధలు, చైతన్య వికాసము కోరువారు తప్పక నిర్వర్తించవలసిన కార్యము. పరివర్తనకు ప్రధాన మగు లోగిళ్లు పై తెలిపిన మూడంశములే. ఈ అంశములయందు

విముఖత కలిగినపుడు జీవప్రజ్ఞకు పతన మారంభ మగుచున్నదని తెలియదగును.

దేహాతీతమగు విషయముల గూర్చి ప్రతిదినము కొంత భావన చేయుట వలన కూడ వికాసము కలుగుటకు అవకాశ మేర్పడును. చైతన్య వికాసమునకై ప్రతినిత్యము కృషి చేయుట సత్సాధకుని కర్తవ్యమై యున్నది.

# 19

# సోదరత్వము - 4

**సమానత్వము :**

సోదరత్వముతో పాటు, సమానత్వము, స్వతంత్రము అనెడి భావములు కూడ లోకమున ప్రచారము చేయబడుచున్నవి. సమానత్వము, స్వతంత్రము సోదరత్వముతో చేర్చుట కలి ప్రభావము. వ్యక్తుల యందు ప్రజ్ఞా వికాసము వైవిధ్యముగ నుండును. ప్రజ్ఞా వికాసమునుబట్టి గురుత్వము లభించును. దైవ సృష్టియందు గల జీవులందరు సమానులే అయినను వారి ప్రజ్ఞా వికాసము లందు వైవిధ్యమున్నది. శ్రీరాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు సోదరులే అయినను, రామునియందు పూర్ణ వికాసముండుటచే, మిగిలిన ముగ్గురును అతనిని అనుసరించిరి. అట్లే పాండవులయందు యుధిష్ఠిరుని ప్రజ్ఞ మిగిలిన నలుగురి ప్రజ్ఞ కన్న మిక్కుటముగ వికాసము చెందియున్నది. భీమార్జునులు యుధిష్ఠిరుని కన్న శక్తి వంతులేగాని, యుధిష్ఠిరునితో సమానమగు ప్రజ్ఞావంతులు కారు.

సోదరత్వమున ఒకరియందొకరికి ఆదరము, ప్రేమ యుండుటతో పాటు విశాలమగు ప్రజ్ఞ కలవారిని అంతకన్న తక్కువ ప్రజ్ఞ కలిగినవా రనుసరించుట శ్రేయస్కరము. గురుశిష్య సంబంధము

కూడ అట్టిదే. తెలిసినవారే పెద్దలు. తెలియుట వయస్సుతో నిమిత్తము లేదు. ఈ కారణముగ సోదరత్వమున సమానత్వము అను భావమును జోడించుట సమంజసము కాదు.

# 20

# సోదరత్వము - 5

***ఆశయము - భావన - ఏకత :***

స్వభావములయందు జీవించు మానవుల నడుమ సోదరత్వ భావము ఒక ఆశయము మాత్రమే. స్నేహము, సోదరత్వము, ప్రేమ యిత్యాదివి స్వభావమును దాటి ఆత్మజ్ఞానముతో జీవించువారికి మాత్రమే సత్యము. పలుమార్లు భూమిపై ఆధ్యాత్మిక సోదరత్వముకై సంస్థలు స్థాపించబడినవి. అవి యేవియును ఫలించలేదు. ఫలించవు కూడ. కోటానుకోట్ల ప్రత్యగాత్మలన్నియు విశ్వాత్మ భావననే ఏకత్వము నందగలదు గాని ఆత్మస్థితిలో కూడ సోదరత్వమును అంత పరిపూర్ణముగ గౌరవింపలేరు.

సోదరత్వమన్నది ఆశయమేగాని భౌతికలోకము నందు సిద్ధించు విషయమని భ్రమపడరాదు. కాని ఆశయము మేరకు చేయు కృషిలో తప్పక జీవుడు ఉత్తమ స్థితిని పొందగలడు. ప్రశాంత జీవితమును గడుపగలడు. ఉన్నతాశయముల నేర్పరచుకొని జీవించుట ద్వారా ఆశయసిద్ధి కలిగినను, కలుగక పోయినను, జీవుడు పరిణామము చెందుట తథ్యము. ఎట్లునూ సిద్ధించునది కాదుకదా

యని ప్రయత్నము మానరాదు. ప్రయత్నముననే మానవునకు వృద్ధి యున్నది.

రక్త సంబంధముకన్న బలమైనది భావ సంబంధము. ఏకత్వము భావైక్యత వలన కలుగునుగాని, కేవలము ఒకే రక్తము ఉండుట వలన కాదు.

# 21

## సోదరత్వము - 6

***ఏకత్వము :***

సోదరత్వము సిద్ధించుటకు చేయవలసిన కృషి సామాన్యముగ మానవులు గమనింపకున్నారు. కలసి ఉండవలెనను భావన, పొరపొచ్చెములు లేక ఉండవలెనను భావన, ఒకరినొకరు ఆదరించు కొనవలె నను భావన, ఆదుకొనవలె నను భావన– ఇట్టి భావనలన్నీ సిద్ధించుటకు చేయవలసిన కృషి ఆత్మ సంయమము. అచ్చటనే ఏకత్వ మున్నది. అంతకు క్రింది స్థాయిలలో ఏకత్వము వివిధత్వమై యుండును. ఏకత్వము సాధించని వారికి సోదరత్వ మనగా నేమో తెలియదు. వారి వారి స్థాయులనుబట్టి సోదరత్వము నిర్వచించుట, నిర్వర్తించుట జరుగుచుండును.

స ఉదరత్వమే సోదరత్వము కదా! అందరునూ ఒకే చోటు నుండి పుట్టిరిగదా! తాము పుట్టిన చోటేదో తెలిసినపుడే ఏకత్వము సాధ్యమగును. ఐక్యతా భావన సిద్ధించును. తాను పుట్టిన చోటునుండే అందరు పుట్టిరి. పుట్టిన చోటు నెరుగుటకే ఆత్మసాధన, యోగసాధన. అది సిద్ధించిన వారికి అన్నిటియందు ఒకే ఆత్మ వర్తించుచుండునని తెలియును. వర్తనములు వివిధము లైనను దానికాధారమగు తత్వ

మొక్కటే అని తెలియును. అట్టి వానికి చెట్టునందు, పుట్టనందు, పురుగునందు, పండితుని యందు, పామరునియందు, సమస్తము నందు, తనయందు ఆ తత్త్వమే గోచరించును. అట్టి వానికే సోదరత్వము సత్యమని తెలియును. ఇతరుల కది నినాదమే. కొందర కది ఉన్మాదము కూడ. సత్యమున నినాదము లేదు. ఉన్మాదము లేదు.

సద్గురువులు ఆత్మతత్త్వము నెరుగుటచే సోదరత్వమునకు వారే నిజమగు ఉదాహరణము.

## 22

# సోదరత్వము - 7


***మొదటి గడప :***

జనబాహుళ్యమునకు క్రమశిక్షణ నచ్చదు. క్రమశిక్షణము నచ్చనివారు కర్తవ్యములను నిర్వహింపలేరు. కార్యము నందు వారికి సిద్ధి కలుగదు. క్రమశిక్షణ, కర్తవ్యము, కార్యసిద్ధి, యిత్యాది వన్నియు సృష్టియందు యజ్ఞార్థముగ నిర్వర్తింపబడుచున్నవి. అనగా అందరి శ్రేయస్సుకొరకు నిర్వర్తింపబడుచున్నవి. ఇట్లు నిర్వర్తించుటకు సంసిద్ధులు కానివారికి కర్మమునం దాసక్తి తగ్గి, కర్మహీనులై పతనము చెందుచు నుందురు.

పనిచేయుట కిష్టపడకపోవుట, తక్కువ పనిచేసి ఎక్కువ ఫలితము పొందవలె ననుకొనుట, పనిచేయకయే లాభములు పొంద వలె ననుకొనుట పతన కారణములు. ఇట్టి వారందరు కలసి సోదరత్వ నినాదములు చేయుచు లబ్ధిపొందుటకు ప్రయత్నింతురు. వీరి వలన సోదరత్వమను పదము ఏవగింపై నిలచినది.

యజ్ఞార్థముగ జీవితమును నిర్వర్తించుట మానవుని ప్రధాన కర్తవ్యముగ దైవము తెలిపినాడు. ఈ ప్రధానమగు గడప దాటక ఆనందము పొందుట కాశించువారు తాగునీటి కొరకు ఎండమావుల

వెంటపడిన వారివలె వెట్టితనమున యుందురు. సోదరబృందము అను భావమునకు నీవు సమర్పణ చెందదలచినచో యజ్ఞార్థ జీవనమునకు దీక్షను గైకొనుము.



## 23

# సోదరత్వము - 8

***శక్తి - ఏకత్వము :***

సోదరత్వము నాపాదించుట, బలవంతముగ రుద్దుట దానిని కించపరచుటయే. సోదరత్వము ప్రతి ఒక్కరును తమయందు దర్శించవలసినదే కాని బాహ్యముగ సాధించునది కాదు. ఆత్మజ్ఞాను లకే సోదరభావ ముండును. ఆత్మ జ్ఞానములేని శక్తివంతు లకు, క్రియావంతులకు, జ్ఞానవంతులకు సోదరత్వ మనగ నేమో తెలియదు. వారు సమత్వముతో ఏకత్వమును సాధించినవారు కాదు. వారు శక్తులకు లోబడినవారు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు మూడింటికిని సామ్య మేర్పడుట ఆత్మజ్ఞానముననే కలుగును. చక్రవర్తు లెందరో వారి యిచ్ఛ ననుసరించి ఏకఛత్రాధిపత్యమునకై పాటుపడిరి. కాని అది సాధ్యము కాలేదు. జ్ఞాను లెందరో వివిధమగు సిద్ధాంతము లను ప్రబోధించి ఏకత్వమును సాధించుటకు కృషి సలిపినారు. అదియును సాధ్యపడలేదు. క్రియాశీలురగు వారు చాలమంది క్రియతో ఐకమత్యమును స్థాపించుటకు ప్రయత్నించినారు. అదియును సాధ్యపడలేదు.

మానవజాతి యంతయు పరిణామమున వివిధ శ్రేణులలో యున్నది. ఇందులో ఆత్మవంతులైనవారే అన్ని శ్రేణులయందు గల ఒకే తత్వమును దర్శనము చేయగల వారు. వారే సోదరబృందములుగ ఏర్పడి అందరికిని ఏకత్వ దిశకు దారి చూపు చున్నారు.



# 24

## సోదరత్వము - 9

### *సోదరత్వము - ఆత్మ - శక్తి :*

ఆత్మతత్వమునకే ఏకత్వమనగ నేమో తెలియును. ఇతర తత్వములయం దున్నవారికి ఏకత్వము తెలియదు. ఆత్మతత్వమునకు సన్నిధియం దేకత్వము, ఏకత్వము సన్నిధి యందు సోదరత్వము వశించి యుండును. సోదరత్వము సన్నిధిన సహకార ముండును. సహకార మున్నచోట జ్ఞానసిద్ధి యుండును. జ్ఞానసిద్ధికి వలసిన సాధక బృందములు యిట్టి వారి చుట్టును ఏర్పడుచు నుండును.

ఆత్మతత్వమున నిజమగు ఆసక్తి కలవారు శక్తులను విడతురు. శక్తులన్నిటికి మూలము ఆత్మయే. ఆత్మ నుండియే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు పుట్టుచున్నవి. తాను ఆత్మయే అయి ఉండగ, తన నుండి పుట్టుచున్న త్రివిధమగు శక్తి ప్రవాహములందు తాను కొట్టుకొని పోవుట అజ్ఞానము. శక్తులన్నియు నదీ ప్రవాహములవలె ఆత్మసాగర మున ఐక్యమగును. తా నాత్మయే అయినపుడు శక్తి ప్రభావమునకు లోనగుట మాయయే అగుచున్నది. ప్రపంచమంతయు శక్తి ఆరాధనే జరుగుచుండును. శక్తి ఆరాధనమున శాంతి యుండదు. అనంతమగు శక్తి నుపాసించుటలో, ఉపాసకుడు శాంతిని కోల్పోవుట జరుగు

చున్నది. శక్తికే అంతమగు ఆత్మను తెలుసుకొనుట వలన పరమశాంతి లభించును. పురాణమున శక్తికిని – ఆత్మకును నడుమగల వ్యత్యాస మును చూపుటకే విశ్వామిత్ర–వశిష్ఠ కథలను బోధించినారు. వశిష్ఠు డాత్మజ్ఞాని యగుటచే శాంతమూర్తియై మహా శక్తిసంపన్నుడగు విశ్వామిత్రుని నిర్జించి ఆత్మ మహిమను చాటినాడు. ఆత్మజ్ఞానికి ఆరాటములు, పోరాటములు యుండవు. సోదరత్వ మన నేమో అతనికే తెలియును. శక్తి ఆరాధకులకు తెలియదు.

శక్తి సంకర్షణ వ్యూహము. ఆత్మ వాసుదేవ వ్యూహము. చేయుట, సాధించుట సంకర్షణత్వము. ఉండుట, సమస్తమును దర్శించుట వాసుదేవ తత్త్వము. శక్తి పరిమితత్వము తెలిసినవారికే ఆత్మజ్ఞానము. ఇట్టి వారికి ఆరాటములు, పోరాటములు యుండవు కనుక, అందరి యందును సోదరత్వమునే నెరపుదురు.

25

## సోదరత్వము - 10

*పని సూక్తము 1 :*

పనియందు ప్రేమ ప్రధానము. పని లేనివాని జీవితము వృథా. పనికిరాని జల్సారాయుళ్ళు సృష్టి కపకారము చేయుచున్న వారే. చెట్టు, పుట్ట, పాము, పంచభూతములు, దేవతలు అందరును పని యందు నిమగ్నులై యున్నారు. పని విలువ తెలిసిన వారికే పనియందు ప్రేమ కలుగును. విలువైన విషయములందు ప్రేమ కలుగుచుండును గదా! బంగారము, వజ్రములు, ఆభరణములు, ఆస్తులు, మన కుపయోగపడు మనుషులు, సంస్థలు వీటన్నింటిని మనము ప్రేమింతుము. కారణము వాటి విలువ తెలియుటయే. కాని యివి యన్నియు లౌకికమైన విలువలు. పని విలువ తెలిసినవారు అలౌకిక శక్తులను కూడ ఆవాహనము చేసుకొను స్థితి యందుందురు. ప్రాణము మనయందు అహర్నిశలు పనిచేయుచున్నది. అట్లే మెలకువ కలిగిన క్షణమునుండి నిద్రించువరకు ఏదో ఒక నిర్మాణాత్మకము, సృజనాత్మకము అగు కార్యమున నిలచి యుండుట, ఆ కార్యమును క్రతుబద్ధము చేయుట దీక్షగ సాగవలెను. ఇట్టి వారియందు క్రియాశక్తి పరిపూర్ణముగ వికసించి పరిసరములకు తోడ్పడును. ఇట్టివారికే

సోదరబృందమున అర్హత కలుగును. పనికిమాలిన విషయములు పది చర్చించుటకన్న పనికివచ్చు పనిచేయుట చాల ప్రధానము. ఇట్టి పనికి ఫలితములతో సంబంధము లేదు. పనియే జీవమై పురోగతి కలిగించగలదు.

26

## సోదరత్వము - 11

*పని సూక్తము 2 :*

పని ప్రధానముగ ఏర్పడిన బృందములు జీవించి తరించగలవు. పని తగ్గినచో పస తగ్గును. బృందములు విడిపోవును. పనికి పరహితమే ప్రాణము. స్వహితము విషము. పని యందు అందరును శ్రేయస్సునకే సమర్పణము చెందియుండవలెను. వ్యక్తిగత మగు గుర్తింపులు, గొప్పదనములు అప్రధానములు.

పనికన్న మాట పెరిగినచో పని మరచుట జరుగును. సకాలమున నిర్వర్తించుట యుండదు. పని భ్రష్టత్వము పద భ్రష్టత్వమును కలిగించును. మనిషియందలి క్రియాశక్తి హిత కార్యములకు సమర్పింపబడినపుడు క్రమముగ జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి కూడ వృద్ధి పొందగలవు.

పనియం దాసక్తిగల సోదరబృందములు తమకన్న మిన్నగ పనిచేయు బృందములను ఆదర్శముగ భావించి పురోగమించవలెనే కాని, తమను తాము పొగడుకొనుటలో నిమగ్నమై యుండరాదు. ఎవరికైనను తమను గూర్చిన సద్భావన తమ పురోగతికి అవరోధము.

ఇది తెలిసి స్వయమును గూర్చి భావించుట కన్న ఇతరములను గూర్చి శ్రమించుట ముఖ్యము. తమను గూర్చి యితరులు ప్రకటించు చున్న భావములు లెక్కచేయక తాము నమ్మిన హిత కార్యములు నిర్వర్తించువారే పురోగతి చెందగలరు. వలసిన ప్రోత్సాహము పని నుండియే లభ్యమగును గాని పరిసరముల నుండి కాదు. అంతరాయ ములు కలుగుచున్నకొద్ది, పనియందు పట్టుదల పెరుగుట పనిపై గల ప్రేమ నుండి ఉద్భవించును. అట్టివారికి పురోగతి తప్పనిసరి.

# 27

## సోదరత్వము - 12


***పని సూక్తము 3 :***

పగలంతయు నిర్విరామముగ పని చేయుట, రాత్రి మొదటి జామున (6 గంటల నుండి 9 గంటల వరకు) సద్గ్రంథ పఠనము గాని శ్రవణముగాని చేయుట, వ్యర్థమగు భాషణలు విసర్జించి కార్యోన్ముఖులై ఉల్లాసముగ జీవించుట సోదరబృందమున ప్రధానమగు లక్షణములు. ప్రతిదినము నాటక రంగమందలి పాత్రవలె తెర తొలగింపునుండి తెర పడువరకు శ్రమించుటయే సోదరబృందము నకు ప్రధానము. సూర్యోదయమునకు ముందుగనే దివ్య ప్రార్థనలు గావించి ఇచ్ఛాశక్తిని సరిచేసుకొని, జ్ఞానశక్తి సంపత్తితో క్రియాశీలురై దినమంతయు పరహిత భావముతో పనిచేసి సూర్యాస్తమయమునకు మరల ప్రార్థనలతో ముగించి, అటుపై సద్బోధలను పఠించి, హృద్య మగు ఆటపాటలతో దినమును పరిసమాప్తిచేయుట పరిపూర్ణ జీవన ముగ సోదరబృందమున భావింపబడును.

తనవంతు కర్తవ్యమును ఆ దినమందు సవ్యముగ నిర్వర్తించిన ప్రతివ్యక్తియు ఆ రాత్రికి నిశ్చింతగ నిదురపోవచ్చును. దినమున శ్రమించని వారికి రాత్రి విశ్రమించుట కుదరదు. నిదురించుట

జరుగదు. శ్రమించు వారికే నిద్ర నందించుట ప్రకృతి ధర్మము. ఇతరుల శ్రమపై జీవించు వారికి నిద్దుర కరువగునను సత్యము తెలియవలెను. ఇతరుల కొరకై శ్రమపడు వారికి నిద్ర అందిన ఫల మగును.

భాషణము తగ్గినచో క్రమముగ భావములు తగ్గ గలవు. భావనలు తగ్గినచో భాషణ లెట్లును తగ్గును. పనిమంతునకు చిల్లర భావము లేర్పడవు. కావున చిల్లర భాషణములు కూడ జరుగవు. అట్లని ముంగివలె యుండక చతురోక్తులతో యితరులను ఉల్లాస పరచుచు, తన వంతు కార్యమును అప్రమత్తుడై నిర్వర్తించును. ఇట్టి వారికి మనో వికాసము తథ్యము. చేయుట యందే నేర్చుట కూడ యుండును.



## 28

## మా సాహసము

విలువైన వస్తువులను, ఇష్టమైన వస్తువులను జాగ్రత్త చేసుకొనుట మానవునికి సహజముగ తెలిసిన విద్య. దానిని గూర్చి ఎవ్వరును ఏ విధమైన బోధనలు చేయనక్కరలేదు. అట్టి వస్తువులను ఎంత పదిలముగ దాచుకొందురో గమనించినచో మానవుడు సహజ ముగ తెలిసినవాడని తెలియును. ఆ వస్తువులను కాపాడుకొనుటలో అమితమగు శ్రద్ధ చూపించు చుండును. అవి పగులకుండ, పాడు కాకుండ చక్కగ కాపాడుకొను చుందురు. అందు వారి సమర్థత ప్రస్ఫుటముగ గోచరించును. వజ్రములు, బంగారము ఎడల మానవు నకు గల ప్రేమయే దానికి కారణము. అట్టి ప్రేమ మానవునికి మొక్కలయందు, వృక్షములయందు లేదు. పశువుల యెడ అసలే లేదు. మనుష్యుల విషయమున చెప్పనక్కరలేదు. మనిషి రాళ్ళ కన్నను, ఖనిజములకన్నను, లోహములకన్నను, వృక్షములకన్నను, జంతువుల కన్నను కూడ విలువైనవాడు. మనిషి మనిషిని జాగ్రత్త చేసుకొనలేదు. కాపాడుకొనలేదు. పదిలముగ రక్షించుకొనలేదు. కారణము – మనిషికి మనిషిపై ప్రేమ లేకుండుటయే.

మానవుడు తన జాతిని తానే హింసించుకొను మూర్ఖుడగుటకు

కారణము ద్వేషము. ప్రేమించుట చేయకపోగ ద్వేషించుచుండును. ఇట్టివారెట్లు సుఖ సంతోషములు బడయగలరు. మానవుడు ప్రేమింప వలెనని శిక్షణ యిచ్చు విద్యాలయము లేవియును లేవు. సహజముగ ప్రేమగల మానవుడు ప్రేమను సంకుచితము గావించుకొని ద్వేషమును పెంచుచు జీవించుటలో అర్థము లేదు. అతడు ప్రస్తుతము మానవులనే గాక అన్ని జాతులను హింసించు చున్నాడు. పంచభూతములను కూడ హింసించుటకు ప్రయత్నించు చున్నాడు. అట్టివానికి ఆధ్యాత్మిక సోదరత్వమును బోధించుట సాహసమే అగుచున్నది. మా పరంపర అట్టి సాహసమునకు పూనుకొనినది.



29

## వైద్యము - పాశవికత

ప్రశాంతమగు తరంగములను క్రమముగ ప్రసరింప జేసినచో వ్యాధులు ఉపశమించును. కంగారుపడి, కంగారు పెట్టువారు వ్యాధికి బాధితులుగాని, వ్యాధి నిరోధమునకు కాదు. ప్రశాంతమగు చిత్తము వైద్యున కత్యవసరము. ఎట్టి వ్యాధి అయినను నివారణము అగునని పూర్ణ విశ్వాసము వైద్యునకుండవలెను. అట్లే రోగి కుటుంబమున నున్న వారికి కూడ ఉండవలెను. కుటుంబమున అస్వస్థత యున్నపుడు ప్రత్యేకముగ ప్రశాంతమగు వాతావరణము కూర్పు చేయవలెను. వెలుతురు, గాలి ప్రవేశించునట్లు రోగి పరుండు స్థలము ఏర్పాటు చేసుకొనవలెను. రోగి వద్ద, రోగిని ఉల్లాసపరచువారు చేరవలెను. భయపడు వారు, సందేహపడువారు, దుఃఖించువారు రోగి వద్ద నుండరాదు. రోగి కోరిక ననుసరించి ఒంటరితనమును అతనికి ఏర్పాటు చేయవలెను. అధికమగు భాషణము చేయరాదు. రాజకీయ ములు, ప్రపంచ మందలి అవినీతి – యిత్యాది విషయములను చర్చించ రాదు. సద్గ్రంథ పఠనము, మంద్రస్థాయిలో ప్రార్థన జరుప వచ్చును. ఎట్టి పరిస్థితి యందును రోగికి నిరుత్సాహము కలిగించరాదు. పై

తెలిపిన విధాన మవలంబించినపుడు ఔషధములతో సమానముగ వ్యాధి నివారణమునకు బలము పట్టును.

మానసిక వ్యాధులు కూడ ఈ విధముగనే తొలగించుట ఔచిత్యము. మత్తు పదార్థములతో కూడిన మందులు మానసిక రోగులకు ఉద్రిక్తత పెంచును. ఇది తెలియుట చాల ముఖ్యము. వైద్యమొక పవిత్ర కార్యమేకాని, పాశవిక కృత్యము కారాదు.

## 30

## సోదరత్వము - సూత్రములు

ఇరువురు కలసి సేవాకార్యము చేయుటకు ఈ క్రింది సూత్రము లత్యవసరము. వీటిని పాటింపనిచో ఇరువురి మధ్య సోదరత్వము ఏర్పడదు.

1. ఒకరినొకరు ప్రత్యక్షముగ గాని, పరోక్షముగ గాని విమర్శించ కుండుట.
2. ఒకరినొకరు అన్ని విషయములయందు సంప్రదించుకొనుట.
3. ఒకరు చేసిన పనిని మరియొకరికి వివరించి అవగాహన ఏర్పరచుట.
4. ఒకరి పనియం దొకరు తప్పులు పట్టకుండుట. తప్పులు జరిగినపుడు ఒకరికొకరు వివరించుట, వివరము కోరుట.
5. ఒకరిని గూర్చి ఒకరు సందేహ పడకుండుట.
6. ఒకరితో నొకరు సహకరించుకొనుట.
7. ఇట్లు మూడు సంవత్సరములు కలసి పనిచేసినచో సోదరత్వ మేర్పడును. ఏడు సంవత్సరములు నిర్వర్తించినచో సోదరత్వము పటిష్ఠమగును.

31

## సేవ - ఆశయము

నిర్మలమగు చిత్తము, పరిశుద్ధ జీవనము లేనివారు కూడ సత్కార్యము లాచరించ వచ్చును. అట్టి సత్కార్యములు వారు వారిని ఉద్ధరించుకొనుట కొరకే. అట్టి కార్యములకు స్థిరముండదు. ఆయుష్షు కూడ అంతంత మాత్రమే. కాని తమను తాము పవిత్రీకరించుకొనుటకు, చిత్తము స్థిరమగుటకు సత్కార్యము లాచరింపబడు చున్నవని జ్ఞప్తి యందుంచుకొని సత్కార్యములు చేయువారు చక్కని సాధకులు. ఇట్టి వారు సత్కార్యములు జరుగుచున్నపుడు గుర్తింపునకై తహతహ లాడుదురు. అది ఊబివంటిదని తెలియక గుర్తింపుకై పడు తపన వలన పవిత్రత తగ్గును. పవిత్రత తగ్గినపుడు చిత్తమునందు స్థిరము తగ్గును. సత్కర్మాచరణము యొక్క సాధనాశయము పై కారణముగ మరుగుపడును. ఇట్లు ఎన్నియో వేల సత్కార్యములు భూమిపై జనించి బాలారిష్టములతో మరణించినవి. శతాబ్దముల తరబడి ఉన్న సత్కార్య ముల యందలి రహస్య మేమనగ, వాటిని నిర్వర్తించుచున్నవారు పరిశుద్ధ జీవనమునకై పాటుపడుచున్నవారే.

32

## ఆందోళనము నుండి ఆనందమునకు

ఆనందమునకు, ఆందోళనకు భావమే పునాది. ఎట్లు ప్రవర్తించిన ఆనందము కలుగును, ఎట్లు ప్రవర్తించిన ఆందోళన కలుగును అని తెలియజెప్పుట, తెలుసుకొనుట సులభము. కాని ఆనందముగ జీవించుట అరుదుగ జరుగుచుండును. దానికి కారణము స్వభావము. ప్రతి జీవునికి అతని స్వభావమున కొన్ని పరిమితు లున్నవి. స్వభావమున పరిమితు లెట్లేర్పడినవి? స్వార్థచింతనము వలన పరిమితు లేర్పడినవి. పరహిత చింతనము వలన పరిమితులు క్రమముగ తొలగును. స్వార్థపరులకే ఆందోళనలు ఎక్కువగ నుండును. పరహిత చింతనము చేయువానికి ఆందోళనము క్రమముగ తగ్గును. ఇది ఒక సత్యము. ప్రశాంతముగ ఉండవలెనని భావించినంత మాత్రమున ప్రశాంతత కలుగదు. ఆచరణ మార్గమున, స్వభావమున మార్పు కలిగినపుడు ఆనందమునకు తెర తొలగింపబడును.

పరహిత కార్యములు నిస్వార్థముగ నిర్వర్తించుచున్న వారికి ఉత్తమము, ఉత్కృష్టమగు భావములు కలుగుచుండును. క్రమముగ పవిత్ర భావములు చేరి, అటుపైన దివ్యభావములను చేరును. సహజముగ దివ్యభావముల యందున్నవారే ఆనందముగ నుండగలరు.

భక్తి కార్యక్రమములు, ధ్యాన కార్యక్రమములు నిర్వర్తించువారు కొంత తడవు శిఖరముపైనను, కొంత తడవు లోయలలోను సంచరించుచు శ్రమపడుచుందురు. ఉన్నత స్థాయిలో సహజముగ నుండుటకు మార్గ మొక్కటియే. జీవితము యజ్ఞార్థ మయినచో ఆనందము స్థిర మగును. అంతదనుక ఆందోళనలు తప్పనిసరిగ కలుగుచుండును.

33

## దయ

"దయ గలవారే దూరదృష్టి కలవారు." ఈ వాక్యమును పరిశీలింపుడు.

జీవులయందు దయ చూపుట ఒక దీక్ష. "అందరును బ్రతుకవలెను గదా!" అని భావించుట ముఖ్యము. అందరు బ్రతికినచో తానును బ్రతుకును అని తెలిసినవాడే తెలిసినవాడు. ఎదుటివారి కష్టములకు కారణము వాని కర్మమే అయినను అట్లు భావింపనివారు కఠినులు, దయ లేనివారు. కష్టము వచ్చినపుడు ఆదుకొనుట ప్రధానము గాని కర్మ సిద్ధాంతములను ఉద్ఘాటించుట దుష్టత్వము కూడ.

వాలిని నిగ్రహించిన శ్రీరాముడు రామ బాణమునకు గురియై వ్యథ చెందుచుండగ శ్రీరాముడు కరుణ కలిగినవాడై తన స్పర్శ నిచ్చి, వ్యథను తొలగించి దివ్య స్ఫూర్తిని కలిగించెను. వనవాసమున నున్న పాండవులు కూడ తమకు భంగపాటు కలిగించుటకై వనమునకు వచ్చిన సుయోధనాదులను గంధర్వుని చెఱ నుండి విడిపించి దయను చూపిరి. దయ లేనివారు సోదరత్వము అను పేరును కూడ తలచుటకు అనర్హులు.

# 34

## మేలెంచి కీడెంచుట

ఒక దేశము, ఒక జాతి, ఒక కుటుంబము, ఒక వ్యక్తి పతనము చెందుటకు పునాది భావమునందేర్పడును. "యద్భావం - తద్భవతి" అనునది ఆర్యోక్తి. కీడెంచుట కన్న మేలెంచుట మేలు. కీడెంచువారు కీడు నాహ్వానింతురు. మనో భావములందు సందేహము, అనుమానము, భయముగలవా రెపుడును కీడునే తలచుచుందురు. అది క్రమముగ మనోలోకమునుండి భౌతికము చేరగలదు.

మేలెంచు భావములు కోరి అలవరచుకొనవలెను. సేవకుడొకడు ఒక మంచి భావన కలిగి యజమాని రథమును విశిష్టముగ తీర్చిదిద్దెను. యజమాని దానిని జూచి నీ భక్తికి నేను సంతసించితిని. నీ ఉద్దేశ్య మును నేను గౌరవించు చున్నాను. కాని ఇట్లు విశేషముగ అలంక రింపబడు రథమందు మనము కూర్చున్నచో గుఱ్ఱములకు బరువు మిక్కుటమై శ్రమపడును. ప్రయాణము సాగదు అని తెలిపెను. సేవకుడు రథమును మరల సామాన్యముగ అమర్చెను. వారి ప్రయాణము సౌమ్యముగ సాగినది. కీడును దర్శించిన యజమాని ముందుగ మేలును పలుకుట పై భాషణమున గోచరించినది. ఇట్లు పలుకు వారికి శుభములు తప్పక కలుగును. విమర్శించువారికి శుభములు కలుగవు. ఇది సత్యము.

35

## ఆత్మాహుతి - ఆత్మ సమర్పణము

**ఆ**త్మాహుతి ఆత్మ పరిత్యాగము కాదు. అది ఒక పిచ్చితనము. అది ఆత్మహత్య వంటిదే. ఆవేశపరులు మాత్రమే ఆత్మాహుతికి పాల్పడుదురు. ఆవేశపరులే ఆత్మహత్య కావించు కొందురు. వానికిని ఆత్మ పరిత్యాగమునకు సంబంధము లేదు. ఆత్మ పరిత్యాగము చేసిన వారు తమయందు కల్యాణ గుణములను పెంపొందించుకొని, అవి యినుమడింపగ, తమయందు దైవమే యున్నాడని, దైవమే తాముగ యున్నామని తెలిసి, తాముండుట అను భ్రమను వీడినవారు. వీరు పూర్ణ సిద్ధులుగాని, దుర్బలులు కారు. పిచ్చివారు కారు. ఆవేశపరులు కారు. వీరి సమర్పణకును, ఆత్మహత్య చేసుకొనువారి సమర్పణకును హస్తి మసికాంతర భేదమున్నది. ఆత్మ పరిత్యాగులు అనన్య భక్తిపరులు. ఆత్మహత్యకు లోనగువారు వెఱ్ఱి ఆవేశమునకు లోనైనవారు. ఆత్మ పరిత్యాగులు లోక కల్యాణకారకులు. ఆత్మాహుతి కావించు కొనువారు లోక కంటకమునకు పాల్పడువారు.

# 36

## పునర్జన్మ

**కొం**దరికి కొందరిని చూచినచో ఇష్టము కలుగును. కొందరికి కొందరి యందు అయిష్టము కలుగును. చూచిన వెంటనే ఇష్టము కలుగుటకు, కలుగకుండుటకు కారణము లేవియు యుండవు. నీ కెందు కిష్టము అని ప్రశ్నించిన సమాధానము కూడ దొరుకదు. తనను తాను పరిశీలించుకొనినను సమాధానము దొరుకదు.

కొందరియందు కొంతకాలముగ యిష్టము కలుగును. అటు పైన ద్వేషము కలుగును. దానికిని నిజమగు కారణము లేవియును ఉండవు. మనిషి ఏవో కారణములు అల్లుకొనును కాని, అవి సత్యము కావు. ఇష్టమున్నపుడు ఎదుటివా డేమిచేసినను ఇష్టముగానే యుండును. ఇష్టము లేనపుడు ఎంత మంచిపని చేసినను ఇష్టము కలుగదు. తానే యిదివరకన్నియు యిష్టముగ భావించినాడు. తన కపుడేమి చేసినను ఇష్టముగ యుండును.

కారణము లేని ఇష్టము, కారణము లేని అయిష్టము పూర్వ జన్మలకు నిజమగు ఉదాహరణము. పునర్జన్మ సిద్ధాంతమును ధ్రువీక రించుట కింతకన్న ఏమి కావలెను?

37

# ప్రియము

**ఉ**దాసీన భావము చాల అపాయకరము. దానిని పోషించు వానికి కీడు జరుగ గలదు. నైరాశ్య భావము వలన ఉదాసీనత కలుగును. చైతన్యమునకు ఒక రకమగు స్తబ్దత ఏర్పడును. మాయా వరణము అట్టి సమయమున బలపడును. అది కారణముగ బాధ్యతా రాహిత్య మేర్పడును. దానితో పతన మారంభమగును. అంతయు అగమ్య గోచరమై నిస్పృహతో ఆత్మనిందకు పాల్పడును. అట్టి సమయమున మిత్ర వాక్యములు కూడ చేదుగ నుండును. ఇట్టి సమయమున సాధకుడు నిస్సహాయుడై తన్ను తాను రక్షించుకొనలేని స్థితియం దుండును. ఇతరులు కూడ రక్షింపలేని స్థితియం దుండును. అతని మనస్సు అల్పపీడనమునకు (Dipressions) గురి యగును.

ఇట్టి వారిని రక్షించుటకు మార్గ మొక్కటియే. వారికి అమితాసక్తి, యిష్టము కల సన్నివేశములను, సన్నిహితులను ఏర్పరచి, ప్రియ భాషణము గావించుట. ఇట్టి సమయమున ప్రియమే ఔషధము. ఇతర ఔషధములు నిస్తేజములు, నిరుపయోగములు.


38

## నమ్మకము - అనుమానము - అపనమ్మకము

**అ**పనమ్మకము వేరు, అనుమానము వేరు. అనుమాన మనగ తెనుగు భాషయందు సందేహమని అర్థము. సందేహపడుట అనిశ్చిత స్థితి. అట్టివాడు అన్ని విషయములందు ఊగిస లాడుచుండును. నమ్మకము కుదరదు. ఏ విషయము తెలిపినను ముందుగ సందేహము కలుగుట కొందరికి జరుగుచుండును. వారు క్రమముగ సమాధాన పడుచుందురు. ఒక్కొక్కప్పుడు సమాధానపడరు కూడ. వీరి జీవన ప్రయాణము జంజాటనలతో సాగును. ప్రయాణమున వీరి కలు పెక్కువ. విపరీత చింతనము వలననే అలుపు. నమ్మకము గలవారికి అలుపు తక్కువ. వారు ఏది విన్నను నమ్ముదురు. దైవమున్నాడని తెలిపినచో నమ్ముదురు. దెయ్యమున్నదని తెలిపినను నమ్ముదురు. నమ్మకస్తుల మనస్సు చిన్నపిల్లల మనస్సు వంటిది. చిన్నపిల్లలు దైవము నకు దగ్గర. అట్లే నమ్మకస్తులు కూడ. వీరి జీవితము సందేహపడు వారి జీవితము కన్న సుఖవంతముగ సాగును. నమ్మి చెడినవారు లేరని ఆర్యోక్తి.

సందేహము విపరీతధోరణి చేరినపుడు క్రమముగ అది అపనమ్మకమై స్థిరపడును. సందేహము కరుడు గట్టినచో అప

నమ్మకముగ ఏర్పడును. అపనమ్మకము నుండి బయట పడుట చాల
కష్టము. అది ఊబి వంటిది. అట్టివారు పతనము చెందుట తథ్యము.
దేనిని నమ్మనివారు తమని తాము పూర్తిగ బంధించుకొన్నవారు.
వారికి మేమును ఎట్టి సహాయము అందించలేము. ఇట్టి వారిని
ప్రకృతియే కాపాడగలదు. విద్యుద్ఘాతమువంటి సన్నివేశము ద్వారా
ప్రకృతి వీరిని ఉద్ధరించగలదు.



# 39

## గ్రుడ్డితనము

గ్రుడ్డితనమన్న అందరికి భయమే. కాని నిజమునకు దాదాపుగ అందరు గ్రుడ్డివారే. ఏ ఒక్కరును తాము చేయుచున్న ఆలోచనలు, పలుకుతున్న మాటలు వాతావరణమును ఎన్ని రకములుగ కలుషితము చేయుచున్నవో చూచుట లేదు. ఈ గ్రుడ్డితనమే మానవ సంక్షోభమునకు ప్రధాన కారణము. మానవునికి ఆలోచన, మాట ప్రధాన ఆయుధములుగ ప్రకృతి ఏర్పరచినది. వాని వినియోగము కన్న దుర్వినియోగమే ఎక్కువ జరుగుచున్నది. ఇది దురదృష్టకరము, అపాయకరము కూడ. ఈ విషయము గూర్చి నీవెప్పుడైన లోతుగ పరిశీలించితివా?

ప్రతి ఒక్కరును తమ ఆలోచనను, తమ మాటను అత్యంత విలువైన శక్తులుగ భావించవలెను. ఈ శక్తులను పవిత్రముగనే వాడవలెను. అపవిత్రము గావించినచో తాను నష్టపోవుటయేగాక, సామూహిక కష్టమునకు కూడ తోడ్పడిన వారగుదురు. విషబీజములను చల్లుకొనుచు పోవువారు అమృత తుల్యమగు జీవన మెట్లు సాగించగలరు?

40

## గ్రుడ్డితనము - 2

**భూ**మిపై మహత్తరమగు బోధనలు జరిగినవి. బోధన లనుసరించువారు విభేదించుట విపరీతముగ జరిగినది. హరికళగ మహాత్ములు దిగివచ్చినపుడు ఏకత్వమును గూర్చి బోధించిరి. దానిని అనుసరించువారు అనేకత్వములు సృష్టింతురు. ఒకే ఆచార్యు ననుస రించుచు భిన్నమతముల నేర్పరచుచు, వ్యత్యాసములు చూచుకొనుచు విరోధించుచు జీవించుట మానవజాతి గ్రుడ్డితనము.

దైవమే దిగివచ్చి జ్ఞానమును గీతాసారముగ అందించినాడు. కాని అదే సారమును అద్వైతపరముగను, ద్వైతపరముగను, విశిష్టాద్వైత పరముగను వ్యాఖ్యానములు చేయుచు మూడు మతములు స్థాపించిరి. అట్లే వైష్ణవమునందు కోకొల్లలుగ విభేదము లున్నవి. అందెవరికి వారే మహాత్ములు. అట్లే దైవమునందు గోచరించును. క్రీస్తు బోధనలు కూడ ఇటీవలి కాలమున నిట్లే వైవిధ్య మేర్పడినవి. బుద్ధుని బోధనలు కూడ మినహాయింపు లేక అదే విధముగ వైవిధ్యము చెందినవి. బోధనలన్నియు ఏకత్వము కొరకే అయినను, అనుసరించువారు ఏకత్వస్థితి కెదగలేక, తామున్న స్థితికి బోధన లన్వయించుకొని వైవిధ్యము లేర్పరచుకొందురు.

మనసు యందు జీవించు మానవుడు ఏకత్వమును గుర్తింప జాలడు. బుద్ధిలోని కెదుగుట అతని ప్రధాన కర్తవ్యము. అపుడు మాత్రమే బోధనలు దృగ్గోచర మగును. అంతవరకు గ్రుడ్డితనమే యుండును.

41

## గ్రుడ్డితనము - 3

ప్రతిభ కలవారు కూడ రాబోవు అపాయమును గుర్తించలేని గ్రుడ్డివారే కదా! అపాయము రాబోవుటకు ముందు సజ్జనులకు ప్రకృతి కొన్ని సూచనల నిచ్చును. ప్రతిభ గల సజ్జనులు కూడ ఈ సూచనలను గమనించరు. కారణము వారును యితరులవలె లోక వ్యవహారముల యందు మునిగియుండుటయే. లోక వ్యవహారము లందున్నను ప్రతిభావంతులు కొంత ఒంటరితనము తమ కేర్పరచుకొనవలెను. ప్రశాంత మనస్కులుగ ఎప్పుడును ఉండవలెను. సహజ ప్రశాంతత, ఏకాంతము దినచర్యలో భాగముగ నున్నపుడు ప్రకృతి అందించు సూచనలు అప్రమత్తులగు వారికి అందగలదు. ప్రశాంతత, ఒంటరి తనము, ప్రతిభలతోపాటు అప్రమత్తత కూడ కూడియుండవలయును. ఇట్టివారికి కూడ సున్నితమగు సూచనలు అందుకొను స్థితి యుండదు. స్వభావమున పై విధమగు సద్గుణములతో పాటు లోకశ్రేయస్సును గూర్చిన చింతన గూడ యుండవలయును. అట్టివారే నిజమగు చూపు గలవారు. ఇతరులు గ్రుడ్డివారే. ముందుగా తెలియకున్నను తమకు ముందే తెలుసు అనువారు గ్రుడ్డివారిలో ప్రథమ కోవకు చెందినవారు. నిజమగు చూపునకు పై తెలిపిన పంచ సూత్రములే పునాది.

1. సహజ ప్రశాంతత, 2. ప్రతిభ, 3. ఏకాంతత, 4. అప్రమత్తత, 5. లోక శ్రేయస్సును గూర్చిన చింతన.

# 42

## గ్రుడ్డితనము - 4

**త**నతో అంగీకరించువారు, సహకరించువారు, తనను అనుసరించువారు తెలుపు విషయములను డంబము కారణముగ గుర్తించకుండుట జరుగును. తనను విమర్శించువారు, ఎదురించువారు, వాదించువారు తెలిపిన విషయములను తటస్థ బుద్ధితో చూచుటకు అహంకార మడ్డుపడును. ఇట్లు అనుకూలురు తెలిపినది, ప్రతికూలురు తెలిపినది పట్టించుకొని జీవించువాడు గ్రుడ్డివాడు. అతనికి మూర్ఖత్వమే అన్ని విషయములందు అడ్డుపడుచుండును. జీవితము అగమ్యగోచరమగును. అనగా దారి తెలియని స్థితి కలుగును. ఇట్టివారికి ఏకాంతము, ఆత్మశోధనము, ప్రార్థన ప్రధాన కర్తవ్యములై నిలచినవి. సత్సాంగత్యము కొంతవరకు ఉపయోగపడును. తనయందు పేరుకొన్న మూర్ఖత పనులు పోవలెనన్నచో యిది ఒక్కటే మార్గము.

43

## గ్రుడ్డితనము - 5

**క**న్నులలో దుమ్ముపడినపుడు కనులు మూసుకొనుట సహజము. దుమ్ము పడినపుడు కన్నెట్లు చూడలేదో, అట్లు లోకరీతులను గమనించు చున్న మనస్సు వెలుగును చూడలేదు. సత్సాధకుడు తనకు వెలుగు ఎందుకు గోచరించుట లేదో విచారించుకొనవలెను. వెలుగును చూచుటకు తపన యుండవలెను. పరిమితమగు విషయములనుండి, శాశ్వతమగు విషయముల కొరకు మనసును మరల్చి ప్రతినిత్యము యోచన చేయుట అభ్యాసము చేయవలెను. పరిమితములో తిరుగాడు మనస్సు, పరిమిత విషయములకే అంకితమగును. అపరిమితము, శాశ్వతము అగు విషయములను గూర్చి ప్రతిదినము కొంత చింతన చేసినచో మనో వృత్తము భేదించుకొని, మానవ ప్రజ్ఞ దివ్యలోకములను దర్శింపగలదు. దివ్యమగు ప్రదేశమునుగాని, దివ్యపురుషుని రూప మునుగాని మనస్సున తలచి ధారణ చేసినచో దివ్యమగు విషయ ములు గోచరించుటకు అవకాశ మేర్పడును. పరిమితము, కుత్సితము అగు పరిధిలోనికి వెలుగు దిగివచ్చినను, పై తెలిపిన కంటి ధూళి దానిని గుర్తింపలేదు. ఇది సత్యము.

44

## కారుణ్యమూర్తి

టెలిఫోన్ ద్వారాగాని, టెలిగ్రామ్ ద్వారాగాని ఒక విషయమును వినిపించినపుడు మరల మరల తెలుపుమని ఎవ్వరును కోరరు. కాని సద్విషయములు తెలుపునపుడు వెంటనే మరచి, మరల కోరుట జరుగుచున్నది. ఇది దురదృష్టము. జాతి దురదృష్టము. ఎన్నిసార్లు తెలిపినను మరల మరల వినుటకే ఇచ్ఛగింతురుగాని, మానవులు అనుసరించరు, ఆచరించరు. ఇది ఏమి న్యాయము? భౌతికమున కొక ధర్మము, సూక్ష్మవిషయముల కొక ధర్మము ఉండునా? పరమాత్మ కూడ మరల మరల తెలుపుదుననే శాసించుచున్నాడు. వానియందు వశించు సత్పురుషులు సద్విషయమును వేయి విధములుగ బోధించు చున్నారు. వారు చేయు శంఖారావములను మానవజాతి పెడచెవిన పెట్టుచున్నది. అపాయము కలిగినపుడు మాత్రము ఆర్తనాదములు చేయుచు తమ మొర వినమని దివ్య లోకమునకు అర్జీలు పెట్టుదురు. రక్షించమని వేడుకొందురు. రక్షణ యిచ్చిన వెనుక శిక్షణ యివ్వ కుండినచో మిన్నకుందురు. ఇట్టివారి యెడ నిస్పృహ లేకుండుటయే మహాత్ముల కారుణ్యము. వారు అపరిమిత కారుణ్యమూర్తులు.

45

## తక్కెడలు - తరణము

మనసు త్రాసుయందలి తక్కెడల వంటిది. తక్కెడలు పరస్పర విరుద్ధములు. మనోభావము లన్నియు పరస్పర విరుద్ధములుగ నుండును. జీవితమున ఒక విషయమునకు ఎక్కువ శ్రద్ధ జూపిన మరియొక విషయము ఈ లోపల నిర్లక్ష్యవశమున చెడును. ఆర్థిక విషయములకు ఎక్కువ సమయము, శక్తి వినియోగించినపుడు కుటుంబ విషయములు అదుపు తప్పును. కుటుంబ విషయములకు ఎక్కువ ప్రాధాన్యత యిచ్చినపుడు ఆర్థిక విషయములు అంతంత మాత్రముగ నుండును. ఇవి కాక సాంఘిక కార్యములు, పూజాదికములు, తీర్థ యాత్రలు, ఆరోగ్యము వంటి విషయములు కూడ ప్రాధాన్యము వహించు చుండును. అశ్రద్ధ చేసినదెల్ల ప్రతికూలించు చుండును. ఇట్లు మానవుని మనస్సు కేవలము రెండు తక్కెడల త్రాసు కాదు. చాల తక్కెడ లున్నవి. వీటన్నిటిని సర్దుబాటు చేయుటలో మానవుడు శ్రమించుచు వయస్సు చెడి మరణించును. ఒక త్రాసునకు పది తక్కెడ లున్నపుడు పది తక్కెడలను సమన్వయించుట సులభము కాదు. దీనికి పరిష్కారము మనసులో లేదు.

తక్కెడ సూత్రము లన్నియు బుద్ధియను కఱ్ఱల కమర్చబడినవి.

కర్రలన్నియు వాని మూలమగు ఇరుసున కేర్పరచబడినవి. ఆ ఇరుసే హృదయము. అందువల్ల మానవుడు మనోలోకమునుండి బుద్ధి లోకము, బుద్ధిలోక మూలమైన హృదయమునకు చేరుట పరిష్కారము. ఇది జాతి మొత్తమునకు ఒక్కమారు జరుగదు. ఒక్కొక్కరుగ తరించుట యుండును.



46

## ఉపదేశము

సత్పురుషులు విరోధములు పెంచరు. తిరుగుబాట్లను సమర్థించరు. వారి ఏకైక కార్యము అందరికి వికాసము కలిగించుట. మూర్ఖుని నుండి మోక్షార్థి వరకు అందరిని వికాస మార్గమున ప్రోత్సహించు చుందురు. ఎవ్వరిని నిరసించుట ఉండదు. ప్రతి ఒక్కరికిని సామరస్యము నందించును. వారు విప్లవములను నిర్వర్తించరు. దారి కోరువారికి దారి చూపువారేగాని, ఇతర విషయములందు వారి కాసక్తి లేదు. అజ్ఞానము తొలగించుటయే ప్రధాన కార్యముగ వారు జీవించుచుందురు. అందరికిని అందు బాటులో నుందురు. వారి జీవనమునకు వ్యక్తిగత కారణ మేమియు ఉండదు. వారు అమితోత్సాహవంతులు. వారి స్ఫూర్తి నిత్య నూతనము. వారు బోధన పేరున జ్ఞాన బీజములను భూమిపై చల్లుచు అజ్ఞాన రూపమైన కలుపును తీయుట యుండును. వారెవ్వరికిని హానికరము కాదు. వారు పూర్ణ అహింసాపరులు. ప్రేమ మూర్తులు. పక్షపాత మెరుగనివారు. జాతి మేలునకై అహర్నిశలు కృషి చేయువారు. అట్టి వారిని అవహేళన చేయుట, కించపరచుట, హింసించుట జాతి కపాయము. చేతనయినచో మన్నించుట నేర్వవలెను.

# 47

## దురభిప్రాయము

దురభిప్రాయము అన్ని అనర్థములకు ముఖద్వారము. దురభిప్రాయము గలవారి ప్రవర్తనయందు అధర్మము చోటు చేసుకొనును. అజ్ఞానము బలపడును. ఇతరులపై అభిప్రాయము లుండుట సామాన్య మానవునకు సహజము. సదభిప్రాయమునే ఆశ్రయించి, దురభిప్రాయము చేరకుండుటకు ప్రతి ఒక్కరును అప్రమత్తులై యుండవలెను. అది పేను వంటిది. క్రమముగ వ్యాపించి శిరోజములను మొలకెత్తకుండ తినివేయును. మూడు కోతుల సంకేతము అందరికిని తెలియునుగాని, ఆచరించువారు చాల అరుదు. దురభిప్రాయము సున్నితముగ ఏర్పడును, కాని అది ఎట్లు చోటు చేసుకొన్నదో తెలియుట కష్టము. వేరున పుట్టిన పురుగు క్రమముగ చెట్టునే ధ్వంసము చేయును. అట్లే దురభిప్రాయము గూడ.

దురభిప్రాయము బలపడినపుడు సమస్తము ఆ దృక్కోణము నుండి చూచుటయే జరుగును. అపుడు న్యాయ నిర్ణయము జరుగదు. పక్షపాతవైఖరి యుండును. అది కఠినముగ మాటాడుటతో మొదలై, కఠినముగ ప్రవర్తించుట వరకు పెరుగును. దురభిప్రాయమునకు

లోనుకాని మానవుడుండడు. దురభిప్రాయ సమూహమునుండి బయటపడుట చాల కష్టము. ఈ చెఱ నుండి బయల్పడనిచో మా అనుగ్రహము లభింపదు. సోదరత్వమన్న మాట కర్థముండదు.

## 48

## లోతు

విలువైన విషయముల కొరకు దూరతీరములలో వెతుకు కొనుట పరిపాటి. మహత్తర ప్రదేశములు విలువైనవే కావచ్చును కాని ఒక్కొక్కమారు అంతకు మించిన విషయములు పరిసరములలోనే యుండవచ్చును. ప్రకటింపబడిన విలువల కొరకు తిరుగాడువారు ఆయా ప్రదేశములకు పైనుంచి ఏదియో గొప్ప విషయములు చూసితి మని, గొప్ప అనుభవము పొందితిమని భ్రమ, భ్రాంతి పొందుదురు. హిమాలయ మందలి చతుర్ధామములు, మానస సరోవరము, కైలాస పర్వతము యిత్యాదివి నిర్ద్వంద్వముగ మహత్తర ప్రదేశములే అయినను ఆ ప్రదేశములకు ప్రయాణించి పొందు అనుభూతి కేవలము యితరులు తెలిపిన మాహాత్మ్యమును తామును పొందితిమని చెప్పుకొనుటకే. ఆ అనుభూతు లన్నియు నేతిబీరకాయలోని నేయి వంటివి. లోతులేని అనుభవములను ప్రోగుపోసుకొని అందు జీవించువారు కాలిమడమ లోతుగల నీటిలో ఈదెడివారివలె గోచరింతురు. ఏదియో వింటిమని, ఏదియో కంటిమని చెప్పుకొనుచు, తమను తాము మభ్య పెట్టు కొందురు. ఖర్చును, కష్టనష్టములను భరించుచు, పొందని అనుభూతి పొందితిమని పలికెడివారిని చూచి మాకు దయ కలుగును. వీరు స్వప్న లోకములలో తిరుగాడు చుందురు.

సామాన్య ప్రదేశములలో కూడ సత్పురుషులు, సద్విషయములు ఉండును. అవి చాల అప్రకటితముగ నుండును. వానిని గుర్తించుటకు జిజ్ఞాసువులలో లోతు వలయును. లోతు పెంచుకొన్నకొలది విలువగు విషయములు సమీపముననే గోచరించును. మహనీయులగు సత్పురుషులు సమీపింతురు కూడ.

పై మెరుగులకు భ్రమపడక లోతు పెంచుకొనుచు జీవించుట నేర్చుడు. అపుడు సూక్ష్మ లోకములు మిమ్ములను సమీపింపగలవు.

**"I believe in depth, not in heights."** - Master C.V.V.



49

## పరిశ్రమ

శని ప్రభావమునకు గురియైనవారు శని నెప్పటికిని మరువ లేరు. శని మనసును, దేహమును తమస్సునకు గురిచేయును. కాని శనీశ్వరుడే ఓర్పును, నెమ్మదితనమును కూడ నేర్పును. భరించు శక్తి నిచ్చును. శనిదేవుడు సూర్యదేవుని కుమారుడే. జీవుల జాతకము లలో సూర్యుని పైన కూడ ప్రభావము చూపును. శని సమీపించు చున్నదని భయపడుట కన్న, సోమరితనము ఆవరించుచున్నదని తెలియుట మంచిది. సోమరి శ్రమపడడు. శని శ్రమను బలవంతముగ నేర్పును. స్వచ్ఛందముగ శ్రమ నంగీకరించువారు, పరిశ్రమించి క్షమ, ఓర్పులను నేర్చుకొందురు.

పరిశ్రమించువారిని శని అనుగ్రహించును. అతడి బలహీనత లను సరిదిద్దును. అతడి స్వభావమందలి అవరోధములను తొలగించును. కావుననే నా ఆశ్రయమున నున్నవారు అందరును శ్రమజీవులే. పరిశ్రమించుచునే యుందురు. విశ్రమము వారి స్వభావమునుండి తప్పింపబడును. అపుడు వారిని శనీశ్వరు డాశీర్వదించు చుండును. అట్టి వారిని శుక్రు డనుగ్రహించి, సుఖ సంతోషములను కలిగించును.

# 50

## నిత్య సత్యము

**శాం**తియుత జీవనులకు సత్పురుషులే శాంతిని ప్రకటింప గలరుగాని, శాంతి కొరకు ఆందోళన చేయువారెట్లు శాంతిని పంచ గలరు? నేడు శాంతి కోసము నినాదములు చేయువారందరును కూడ స్వభావమున అలజడి గలవారే. అలజడి శాంతికి విరుద్ధము గదా!

నిశ్శబ్దము గలవారే నిశ్శబ్దమును ఆవిష్కరించి వ్యాప్తి చేయ గలరు. అరవిందయోగి అట్లు చేసెను. అతని ఆశ్రమమున నిశ్శబ్దము కొట్టవచ్చినట్లు గోచరించును.

నిశ్చలత్వము గలవారే నిశ్చలత్వమును అందించగలరు. మరువు మహర్షి నిశ్చలుడు. అతని ఆశ్రమ వాసులందరు నిశ్చలులే. ధృవుని వలె దృఢమగు నిశ్చయము గలవారు.

మైత్రేయులు నిర్మల ప్రేమమూర్తులు. అతని స్మరణయే ప్రేమ, జ్ఞానములను సున్నితముగ వ్యాప్తి చేయుచున్నది.

మహాత్ముల ఆరాధనమువలన వారి గుణములు అనుయాయు లకు అబ్బుననుట సత్యము.

51

## సద్గురువుని రీతి

సద్గురువునకు తనదైన నివాస మొకటి యుండును. అది గృహము కాదు. గృహమున్నను అతడు తన నివాసముననే యుండును. అతనికి హృదయమే నివాసము. అతనికి తన హృదయమే కాక, తన కర్పణ చేసిన హృదయము లన్నియు నివాసములే. అత డెవరి హృదయములందు చొరబడరు. త్రికరణశుద్ధిగ ఆహ్వానించినచో తప్పక ప్రవేశింతురు. వారు హృదయము నర్పించినచో నివాసము కూడ నేర్పరచుకొందురు.

సద్గురువులు సామాన్యులను స్పృశింపరు. వారితో కలిసిమెలసి మెలగినను, తన స్పర్శ సత్యాన్వేషకులకే నొసగును. అతని స్పర్శ తగిలిన సాధకుని జీవితము అందమును, ఆనందమును, వికాసమును పొందును.

సద్గురువు ఎవరి సుఖదుఃఖములయందు పాల్గొనడు. చూచి ఆనందించుట, జాలిపడుట మాత్రమే యుండును. ఇతరుల దుఃఖమున కతడు శోకింపడు. జాలి పడును. సానుభూతి యుండును గాని సహవేదన యుండదు. అతడు శిక్షణ నిచ్చునేగాని శిక్షించడు. అతని కందించిన అతి చిన్న సహకారమునకైనను మరువక

కృతజ్ఞతతో నుండును. ఇతరుల ఉద్దేశములు, భావములను బట్టి వారియందు ప్రతిస్పందించుచు, వారి బలహీనతలను క్రమముగ తొలగించును. విషయాసక్తులయం దతనికి ఆసక్తి యుండదు. విషయములందు విషము మెండుగ నుండును. కనుక వానిని విస్మరించును. అతడెవరిని నిర్లక్ష్యము చేయడు. అట్లని వారి భావములకు పట్టుపడడు. అతడు తన పరిసరములందు గలవారి ప్రజ్ఞా వికాసములకు అనునిత్యము తోడ్పడును. తాను కారణముగ వారహంకారులగుట అతడు సహింపడు. అహంకారులయందు, విషయాసక్తుల యందు మౌనము వహించును. జ్ఞానాసక్తి యున్నచోట ప్రతిస్పందించును. అతడు సహజముగా సూక్ష్మలోకముల యందు దివ్యానుభూతి ననుభవించుచు ఐహికమున అప్రమత్తతతో కర్తవ్యమును నిర్వర్తించు చుండును.

52

## ఉన్నతి

ఒక జాతి భవిష్యత్తున వృద్ధి చెందునా లేక పతన మొందునా అనునది జాతియొక్క సమష్టి మనస్సుపై ఆధారపడి యున్నది. జాతియందు సగటు భావము ఉన్నత విషయముల వైపునకు మొగ్గు చున్నచో భవిష్యత్తు బాగున్నదని గుర్తించవచ్చును. ఉన్నత ఆశయ ములు లేని వ్యక్తులు, సంస్థలు, జాతులు భవిష్యత్తున ఔన్నత్యము పొందలేరు. ఎచ్చట పరిశోధనములు, సృజనాత్మక అంశములపై ఆసక్తి, మేధోమథనము లందు అనురక్తి, ప్రకృతిని సంరక్షించుకొను బుద్ధి, ఇరుగు పొరుగు దేశములతో మైత్రివంటి భావములకు అవకాశ ముండునో అచ్చట వృద్ధి యుండును. కేవలము ఆటలు, పాటలు, స్ఫూర్తినీయని చిత్ర ప్రదర్శనములు, అవినీతి, లంచగొండితనము, దోపిడిబుద్ధి మిన్నగ నుండునో అచ్చట వృద్ధికి అవకాశ ముండదు. జాతి నిర్వీర్యమై పోవును.

ప్రస్తుతము భారత దేశమున సగటు యోగు లందరికిని సినిమా తారలు, ఆటగాళ్ళు, పాటగాళ్ళు, రాజకీయ నాయకులు కథా నాయకులై గోచరించు చున్నారు. పరిశోధకులు, శాస్త్రజ్ఞులు, మేధావులు కనీసపు గుర్తింపుకూడ లేకుండ యున్నారు. జాతి కేవలము ఇంద్రియ

కామమునందే తపించు చున్నప్పుడు ఉన్నత భవిష్యత్తు ఆశించుట అపహాస్యమే. ధన పిశాచము, కామ పిశాచము, పదవీ పిశాచము జాతిని నిర్వీర్యము చేయుచున్నవి. ఘటనా ఘటన సమర్థులగు మహాయోగులు, యోధులు జన్మించిన దేశమున మరల ఉన్నతి కలుగవలెనన్నచో యోగులు, యోధులు కథానాయకులై నిలువ వలెను.



53

## చంచలత్వము

మేమందించు సందేశములు ఒకదాని కొకటి విరుద్ధముగ నున్నట్లు మీ కనిపించు చుండును. వైవిధ్యమే యుండును గాని, పరస్పర విరుద్ధములు మా సందేశము లందుండవు. సందేశము లందుకొనువారిలోగల చంచలత్వము కారణముగ అవి వక్రీకరించ బడి తికమక కలుగుచుండును. తికమక తగ్గవలె నన్నచో స్థిరచిత్తము మీ కేర్పడుట ముఖ్యము. స్థిరచిత్త మేర్పడవలె నన్నచో దీక్షాపరులై కార్యములను కొనసాగించుట నేర్వవలెను. కార్య నిర్వహణము నిరంతరమై యుండవలెను గాని వేసవి సెలవులు, శీతాకాలపు సెలవులు యుండరాదు. వారమున కొకమారు సెలవున్న చాలును. ఇతరమగు సెలవులు కార్యదక్షునకు పనికిరావు. దీక్షాదక్షులై కార్యము నిర్వర్తించువారికి స్థిరమతి ఏర్పడుట సులభము. విశ్రాంతి, విరామము, అతినిద్ర మీ పురోగతికి శత్రువులని గమనింపుడు. అట్టి భావములు కలిగినపుడు వెంటనే జలస్నానము చేయవలెను. జలమందు స్ఫూర్తి నిచ్చు శక్తి కలదు. ప్రాథమిక సూత్రములందు అలసత్వ మున్నవారు చంచల స్వభావులై, అస్థిరమంతులై అవగాహన కోల్పోవుదురు. చంచలమగు పశువునకు ముక్కుకు తాడు వేయుట, మెడలపై కాడి

కట్టుట, పొలము దున్నుట అలవాటు చేసినట్లు, కార్యనిర్వహణము సాధకుని స్థిరమతిని చేయును. దున్నని పొలమెట్లు పండదో, కార్యదక్షుడు కానివాని శరీరమున యోగపరమగు మార్పు లేవియు జరుగవు. మార్పులు జరిపించి, మనసునకు వికాసము కలిగించి, స్థిరబుద్ధులను చేయుట మా ప్రాథమికమగు కార్యము. అటుపైన మా బోధనల యందలి సమన్వయము స్పష్టముగ అవగాహన యగును.

గుర్తుంచుకొనుడు, **“చంచల స్వభావము సర్వదా వర్జనీయము.”**

54

## బాధ్యత

బ్రహ్మాండ పిండాండ సమన్వయము ఒక మహత్తరమగు జ్ఞానము. ఆధునిక శాస్త్రజులు భూమిపై మార్పులను, సంచలనములను మాత్రమే గుర్తించు చుందురు. జరుగబోవుటకు ముందు వానిని గూర్చి కొంత ఊహాగానము కూడ చేయుదురు. ఫలములను గుర్తించుట, రాబోవు ఫలములను ఊహించుట సామాన్యమగు తెలివి. వాని కారణములను గుర్తించుట అసామాన్యము, విశిష్టమగు తెలివి. భూమిపై గల సంచలనములకు ఎక్కువగ మానవులే కారణమని, వారు ఉత్పత్తి చేయు రకరకములగు కాలుష్యములే కారణమని పదే పదే మేము తెలుపుచు నుందుము. మానవజాతి ప్రవర్తన యందు పరివర్తనము లేకపోగా విపరీత వర్తనము పెచ్చు పెరుగుచున్నది. విపరీత వర్తనమును దూషించువారు కూడ విపరీత వర్తనులే. దూషణము కూడ కాలుష్యమే. తనవంతు కర్తవ్యముగ ప్రతి మానవుడు తన యందు, తన పరిసరముల యందు స్థూలము, సూక్ష్మము అగు కాలుష్యములను నివారించుకొనుచు నుండవలెను. అట్లు నివారించుకొనువారు బృందములుగ నేర్పడవలెను. అట్టి బృందములు పెరుగుచు నుండవలెను. భూమి, నీరు, గాలి, కోరికలు, ఆలోచనలు,

భాషణములు– వీనియందు పవిత్రత పెంచుకొనుచు నుండుట వారి కర్తవ్యము. అటుపైన ప్రార్థన, పూజాది క్రతువులు, సద్గోష్ఠి, సద్గ్రంథ పఠనము, దివ్యస్తోత్రము, సంకీర్తనము, మననము, ధ్యానము యిత్యాదివి ఏర్పరచుకొనవలెను. ఇది ఒక్కటియే సంచలనములను నివారించు సున్నితమగు మార్గము. దీనియందు విశ్వాస మేర్పడుట అదృష్టము. ఏర్పడకుండుట దురదృష్టము.

మానవుని దేహము భూమివంటిదే. దేహము, భూమి నర ప్రజ్ఞకు భూమికలు లేక వేదికలు. అపవిత్రమగు వేదికపై ప్రజ్ఞా వికాసము, పురోభివృద్ధి కలుగనేరవు.

55

## గ్రహముల సమతూకము

మనభూమి సౌరకుటుంబమున గల సభ్యులలో కనిష్ఠ సభ్యుడు. సౌరకుటుంబమున ఒక సభ్యుని అస్వస్థత యితర సభ్యులపై కూడ ప్రభావము చూపును. దేహమొక సౌర కుటుంబముగ భావించినచో, అందలి ప్రధాన అంగములు సభ్యులుగ భావింప వచ్చును. దేహము నందలి ఒక భాగమున అస్వస్థత చేకూరినపుడు అందుండి పుట్టు మలినములు క్రమముగ యితర అంగములకు వ్యాపింపగలవు.

ఉదాహరణకు మలమూత్ర విసర్జనము సవ్యముగ జరుగని మానవుని యందు అస్వస్థత స్థిరపడి, వ్యాప్తిచెంది, దగ్గు, జలుబు, తల నొప్పి, కడుపు నొప్పి, ఉబ్బరము కలుగుచు రక్తమును మలినము గావించును. రక్తము మలినమైనపుడు మధుమేహము, రక్తపోటు, గుండెజబ్బు, పక్షవాతము యిత్యాదివి కలుగ వచ్చును. అజీర్ణము కారణముగ పది రకముల జబ్బులు ఏర్పడి దేహమును క్రుంగ దీయును. జీవుడు బాధలకు గురియగును. అట్లే భూమి అపవిత్రత కారణముగ సౌరకుటుంబము సమతూకమును కోల్పోవు అపాయ

మున్నది. ఇతర గ్రహముల యందు సమతూకము ఏమాత్రము చెదరినను వారినుండి కూడ భూమిపై రోగములు పెరుగును. ఈ అవగాహన మానవజాతికి చాల ముఖ్యమై యున్నది.



# 56

## ఋషి దృష్టి

**భూ**మిపై మానవునికి బాధ్యత మెండు. జంతువులు, వృక్షములు, ఖనిజముల కన్న మానవులు పెద్దవాళ్ళు. అనగా ఎరుక యందు పెద్దవాళ్ళు. ఎరుకగల మానవునికి బాధ్యత గూడ యున్నది. బాధ్యతను వహించినపుడు ఎరుకను సద్వినియోగము చేయవచ్చును. ఎరుక గలిగి బాధ్యతలేని మానవుల వలననే అపాయము లన్నియు సంభవించు చున్నవి. రావణబ్రహ్మ చాల ఎరుక గలిగినవాడు. శివుని మెప్పించినవాడు. కాని వర్తనము బాధ్యతారహితమై లోకమును కష్టపెట్టినది. వానరులలో వాలి కూడ అట్టివాడే. ఎరుక లేనిచోట బాధ్యత తక్కువై యుండును. ఎరుక యున్నచోట బాధ్యత ఎక్కువై యుండును. ఎరుక గలవారు జీవన ప్రయోజనము నెరిగి జీవింప వలయును. స్థూల సూక్ష్మముల నెరిగి ప్రవర్తింపవలెను. ధర్మమును ఆచరించి యితరులకు ఆదర్శమై యుండవలెను. చిల్లర విషయము లకు ఆకర్షింపబడి తమకు, యితరులకు అపాయమును కలిగింప రాదు. గృహ మగ్ని ప్రమాదమున నున్నపుడు పరిగెత్తుటకు చెప్పుల కొరకు వెతకు కొనరాదు. మంచి దుస్తులు వేసుకొను ప్రయత్నమునకు ఉపక్రమించరాదు. ఇల్లు తగులబడు చుండగ తల దువ్వుకొని బయలు

వెడలుద ననరాదు. ప్రాణములకే ముప్పు వాటిల్లినపుడు తలదువ్వు కొనుట, బట్టలు వేసుకొనుట, పాదరక్షలు ధరించుట యిత్యాది విషయ ములపై ఆసక్తి మూఢత్వమే యగును.

సూక్ష్మము నుండి మానవజాతిని అవలోకనము చేయుచున్న ఋషులకు మానవుల ప్రవర్తనము అమితాశ్చర్యము కలిగించు చున్నది. అపాయమును గుర్తింపలేని మానవులు ఎన్ని శాస్త్రములు తెలిసినను ఉపయోగ మేమి? ఎన్నిమార్లు మానవజాతి యిదే విధముగ భూమిపై ప్రవర్తించినదో చూచు ఋషులకు యింకను జాతి ఉజ్జ్వల భవిష్యత్తుపై విశ్వాస ముండుట వారి ఋషిత్వమునకు గీటురాయి.

57

## స్ఫూర్తి - భావనము

స్ఫూర్తి నిచ్చు సందేశము అతి క్లుప్తముగను, బీజప్రాయ ముగను అపుడపుడు మానవ ప్రజ్ఞకు లభించుచుండును. అశ్రద్ధ గలవాడు దానిని గుర్తించడు. గుర్తించినను లెక్కచేయడు. తత్కారణ ముగ జీవితము ఫలింపదు.

మెఱపు తీగలవంటి ఆలోచనలు క్షణకాలము కూడ నుండవు. అవి ఊర్ధ్వ లోకముల నుండి వ్యక్తమై మానవమేధస్సున ఒక మెఱపు వలె మెరిసి మాయమగు చుండును. అట్టి మెఱపు భావమును పట్టిన వారే మానవజాతికి మహత్తరమగు ఉపకారము గావించి, శాశ్వత కీర్తిలోకమున వసించి యున్నారు.

అట్లుకాక ఎన్నో రకములగు తత్త్వపరిశోధన, తత్త్వవిచారము, దీర్ఘాలోచనలు, సమాలోచనలు, చర్చలు చేయుచు నిర్ణయములు చేయువారి జీవితములు నత్తనడక నడచుచు సాగును. మేధోమథనము వలన కలుగునది మానసిక శ్రమే గాని, పురోభివృద్ధి కాజాలదు.

స్ఫూర్తిదాయకమగు ఒక భావన నుండి శ్రేయోదాయక మగు కార్యములు జగత్కల్యాణముగ నిర్వర్తింపబడును. అట్టి భావన చర్చనీయాంశము కాదు.

58

## స్ఫూర్తి - గమనము

హృదయ వికాసము పొందినవారికే స్ఫూర్తి యుండును. మెఱుపువలె వారి హృదయమున ఒక దివ్య భావము ఆవిష్కరింప బడును. దానిని క్రమముగ మనస్సుతో నిర్వర్తించుట కర్తవ్యము. అట్టి భావన చర్చనీయాంశము కాదు. కనుక చర్చించక నిర్వర్తించుచు సాగవలెను. నిర్వర్తించునపుడు అనుపానము చెందువారు కొంద రేర్పడుదురు. వారిని కూడ కలుపుకొనుచు నిర్వర్తించుట సాగవలెను. అట్టివారు స్ఫూర్తివంతమగు భావములకు సహకరించు వరకు వారి సహకారమును అందుకొనవలెను. సహకరించనపుడు స్ఫూర్తిమంతుడు తానుగ సాగవలెను. అందినపుడు సహకారమును అందుకొనుట, అందనపుడు ఒంటిగ సాగుట నేర్వవలెను. నదీ ప్రవాహమున కొన్ని ఉపనదులు వచ్చి చేరుచు నుండును. కొంతదూరము కలసిసాగి, అటుపైన కొన్ని ఉపనదులు విడిపోవును. అయినను సాగర సంగమము నకై పరితపించుచు నది సాగుచునే యుండును. తోటివారితో సహకరించువారు మారుచున్నను, కూడి యుండవలసినది స్ఫూర్తితోనే గాని, సహకరించని వారితో కాదు. స్ఫూర్తి వెలుగుదారి. సహకారము నీడ వంటిది. నీడ పెరుగుచు, తరుగుచు, పెరుగుచు నుండును.

నీడ ననుసరించినచో ప్రయాణము అస్తవ్యస్తమై ఆగును. వెలుగు ననుసరించినచో నిరంతరముగ సాగును.

ప్రతి సాధకుడు దీనిని గుర్తించి జీవన యాత్ర సాగింపవలెను.

59

## స్ఫూర్తి - అనుచరులు

స్ఫూర్తిమంతుడు తెలియవలసిన సూత్ర మొకటి యున్నది. తాను స్ఫూర్తి ననుసరించి నడచుచుండగ తన ననుసరించు వారేర్పడుదురు. అనుసరించువారికి తానే స్ఫూర్తి. అనుసరించువారి సంఖ్య పెరుగుచుండగ, స్ఫూర్తి మార్గమున గమనము వేగము కావలెను. తాను స్ఫూర్తి ననుసరించుట వలననే, తన ననుసరించు వారేర్పడి రని తెలియవలెను. కనుక స్ఫూర్తిదాయకమగు కార్యములు రెట్టించిన ఉత్సాహముతో, దీక్షతో నిర్వర్తింపవలెను.

తన ననుసరించువారిని తా ననుసరించుట అనర్థమునకు దారితీయును. అట్టివారు తప్పక తిరోగమనము చెందుదురు. తన ననుసరించువారి సలహాలను తాను పాటించుట, పాటించకుండుట అను నిర్ణయము, ఆ సలహాలు స్ఫూర్తికి దోహదము కలిగించునో, ద్రోహము కలిగించునో పరిశీలించి నిర్ణయింపవలెను. అట్లు కానిచో స్ఫూర్తిమంతుని స్ఫూర్తి క్రమముగ బలహీనపడును. తనకన్న బలహీనులను తా ననుసరించుట వలననే ఇట్టి అపాయమునకు సాధకుడు గురి యగుచున్నాడు.

తన ననుసరించువారిలో 1. తనను ప్రశంసించువారు,

2. ప్రశంసించుచు అనుసరించువారు, 3. అనుసరించుచు ప్రశంసింపని వారు, 4. తనను విమర్శించువారు కూడ నుందురు. ఇందు మూడు, నాలుగు తెగలవారు తనకు బలము. ఒకటి, నాలుగు వర్గములవారిని మౌనముగ, నిర్లిప్తముగ సహించుచు సాగుట సాధన.

పై సూత్రములను పాటించు సాధకునకు విజయము తథ్యము.

60

## అతీంద్రియ గ్రహణము

ప్రకృతి సందేశములు సున్నితముగ నుండును. ఆ సందేశములను గ్రహించుటకు సున్నితమగు మనసు కావలెను. సూర్యోదయము, సూర్యాస్తమయము, చంద్రోదయము, పూర్ణ చంద్రోదయము, తిథులు, ఋతువులు, పూర్ణిమలు, అమావాస్యలు, గ్రహ కూటములు, శుభ దృష్టులు, అశుభ దృష్టులు, గమనము, వక్రగమనము, ఆకాశము, మేఘములు, వాయువు, జలము- ఇట్టి వెన్నియో కోణములనుండి ప్రకృతి ఏర్పడినపుడు సందేశము లిచ్చుచుండును. అట్లే పక్షికూతలు, జంతువుల అరపులు, మానవుల సంభాషణములు, పరిసర సన్నివేశములు కూడ సందేశాత్మకమే.

బహు రూపముల ప్రకృతి అందించు సందేశములను చూచుట, వినుట, గ్రహించుట వలన సాధకునికి మార్గము సుగమ మగును. వానిని గ్రహించకుండుట నిజమగు గ్రుడ్డితనము. గ్రుడ్డి, చెముడు, కుంటి ఎట్లు జీవితము సాగించుటకు తిప్పలు పడునో అట్లే బహు విధములుగ అందివచ్చుచున్న సందేశములను గ్రహించని సాధకుడు తిప్పలు పడును.

## 61

# బ్రహ్మము - సత్యము - చైతన్యము (0-1-2)

ఆరంభము తెలియనివారు అంతము నెరుగలేరు. అంతము నెరుగనివారు ఆరంభము తెలియరు. అన్నిటికిని ఋజువులు, సాక్ష్యము లుండవు. మొదలు తెలిసినచో తుది కూడ తెలియును. మొదలు నందు ఒక్కటే యుండును. ఒకటి రెండయినపుడు, రెండునకు మొదలు తెలియదు. రెండునకు ఒకటి తెలియును. ఒకటికి మాత్రమే మొదలు తెలియును. రెండునకు మొదలు తెలియుటకు, ఒకటియే ఆధారము. ఒకటిది ప్రత్యక్షజ్ఞానము. రెండునకు పరోక్ష జ్ఞానమే మిగులును. కనుక రెండు ఒకటిని చేరి, ఒకటిగ మారి మొదలును తెలియుటయే మార్గమై యున్నది.

సత్యము ఒకటి. చైతన్యము రెండు. చైతన్యము సత్యముగ మరల నివృత్తి చెందినపుడే బ్రహ్మ మన నేమో తెలియును.

పై సత్యమును అవధానము చేయుడు.

62

# చిరునవ్వు

**అ**సత్యమున్నచోట చిరునవ్వు అసహజమై యుండును. అసత్యము పతన కారణము. అసత్యమును కప్పిపుచ్చుకొనుటకు ప్రకటించు చిరునవ్వు వికారముగ గోచరించును. సత్యమున్నచోట చిరునవ్వు గంభీరమై యుండును. ఆ చిరునవ్వు యందు సహజత్వ ముండును. అందుండి చల్లని వెన్నెల తరంగములు జీవుల హృదయ ములను స్పృశించును. అందలి వెలుగు స్ఫూర్తిదాయకమై యుండును. సత్యవంతుని విజయము శాశ్వతము. అతని చిరునవ్వు కూడ శాశ్వతమే. సత్యము జయము, సత్యవంతుని యందు స్థిరముగ నుండుట వలన తదానందము హృదయవికాసము కాగ, దాని ప్రకటన చిరునవ్వై విలసిల్లును. ఎదుటివాని కనుల నుండి సత్యా సత్యములను, ఆనందమును పరికించుట మా అనుయాయులకు వెన్నతో నేర్చిన విద్యవలె యుండును.

మా అనుయాయులు విజయులే. వారి విజయమునకు మూలము సత్యమే. ఆనందము వారి సహజ సంపద. చిరునవ్వు వారి శ్రీకళ.

63

## అగ్నియోగి


సనాతనము, సంప్రదాయబద్ధము అను క్రతువుల పర్యవసానము భావశుద్ధి. భావ శుద్ధియందు దేహేంద్రియ మనో శుద్ధి అంతర్గతమై యున్నది. భావశుద్ధి కలిగిన వెనుక అగ్నియోగమున ప్రవేశించుట సులభమగును. భావశుద్ధి లేనివారు ధ్యానము చేయుట పరిహాసమే. ప్రాణాయామాది కార్యక్రమములు కూడ ఫలించవు.

ఆధునిక యుగమున "భావము ప్రధానము" అను మాట తరచుగ వినుచుందుము. మానవులందరికిని భావములున్నవి. వలసినవి పరిశుద్ధ భావనము. పరిశుద్ధ భావమున వినయము మెండుగ నుండును. అహంభావ ముండదు. విమర్శ యుండదు. క్రత్వాది కార్యములందు చులకన భావముండదు. విమర్శ, చులకన భావము, అహంభావము కలవారు యోగమునందు ప్రవేశింపలేరు. క్రతువులు నిరాకరించువారు పరిశుద్ధ భావనము, పరిశుద్ధ జీవనము కలిగియున్నచో క్షేమముగ నుందురు. లేనిచో క్రతువుల యందు పాల్గొని మనో వాక్కాయ కర్మలను శుద్ధి పరచుకొనుట ఉత్తమము. క్రత్వాది కార్యక్రమములు చేయువారు కూడ మలిన భావములు

దాటి జీవించుటయే ఆశయముగ నుండవలెను. అట్లుకానిచో వారి క్రతు వ్యాపారమంతయు కేవలము డంబాచారమే యగును.

పరిశుద్ధ భావనము, పరిశుద్ధ జీవనము గలవారు ఇహ జీవనమున సమస్త విషయముల యందు అట్టి పరిశుద్ధతను ప్రదర్శించ వలెను. అటుపైన ఊర్ధ్వముగ ప్రజ్ఞను లగ్నము చేసి, భర్గోదేవునితో అనుసంధానము చెంది, సమాధి స్థితిని పొందవలెను. **ప్రజ్ఞా పూర్వక ముగ భర్గో దేవునితో అనుసంధానము చెందుటయే అగ్నియోగము.** అదియే నిజమగు గాయత్రి ఉపాసన. అట్టి యోగము సిద్ధించినపుడు వారగ్నియోగు లగుదురు. వారే నిజమగు భారతీయులు. కేవలము భరతదేశమున పుట్టినంతమాత్రమున ఎవ్వరును భారతీయులు కారు.

పై తెలిపిన భారతీయులను మా మిత్రులగు మరువు నడిపించు చున్నాడు. అతడగ్నియోగి.



64

## గౌతమబుద్ధుడు

**అ**గ్నియోగమున పరాకాష్ఠ చెందువారు యోగమాత యగు దుర్గ సాన్నిధ్యమున బడయుదురు. ఆమె అగ్నివర్ణ. తపస్సుచే అగ్ని దేవుడగు శివుని పొందినది. శివునితో యోగము చెందినది. తపస్సు నందు ప్రీతి చెంది, తపస్సుచే తమను తాము దగ్ధము చేసుకొనువారు అగ్నియోగులు. వారికి శివాశివులే తలిదండ్రులు. అట్టి వారికి అంతః బహిర్లోకములందు తిరుగు లేదు. వారి హృదయము లగ్నిభరితములై యుండును. వారు సహజ సమాధి యందుందురు. దృఢవ్రతులు, దృఢ సంకల్పురు అగ్ని యోగమునే ఎన్నుకొందురు. ఇటీవలి కాలమున గౌతముడు ఇట్టి అగ్నియోగమును నిర్వర్తించి, నిర్వాణము చెంది, నిర్వాణ కాయమును పొంది, ప్రతి వైశాఖ పూర్ణిమ గడియలయందు జీవుల ననుగ్రహించు చున్నాడు. అగ్నియోగులు తిరుగులేని యోగులై హృదయము నుండియే సమస్తము నిర్వర్తించు చున్నారు.

65

## హృదయ వైభవము

విశ్వమంతయు హృదయ కేంద్రములతో నిండి యున్నది. కేంద్ర మెచ్చట నుండునో అచ్చటనే హృదయ మున్నది. ఎచ్చట హృదయ మున్నదో అచ్చటనే ఆత్మ ప్రజ్ఞ యున్నది. అదియే సూర్యుడు. ఆత్మయే సూర్యుడు. సూర్యుడే కేంద్రము. కేంద్రమే హృదయము. జీవప్రజ్ఞ సూర్యుడు కావున అట్టి ప్రజ్ఞ హృదయ మందుండును కావున హృదయము నుండే వెలుగు ప్రకాశించును. హృదయము సూర్యునివలె వెచ్చదన మిచ్చును. ఆకర్షించును. అయస్కాంతీకరణము కలిగించును. హృదయమున జీవించు వాడు స్వాంతనుడై యుండును. స్వాంతనునికి మరియొక పేరే శాంతనుడు. ఎవరు వెచ్చదనమును చల్లదనమును, ఆకర్షణ పోషణములు కలిగియుందురో వారందరు హృదయ కమల వాసులే. ఇట్టి వారి కవగాహన మెండు. వారి దినచర్య కూడ క్రమ బద్ధముగను, ప్రశాంతముగను యుండును. హృదయమే నివాసముగ గలవారు అవగాహన కలిగియుందురు. వారభిప్రాయములలో జీవింతురు. వారి సందర్శనము సూర్యోదయ స్పర్శవలె హాయిని గొలుపును. బాధలను తీర్చును. భయమును పోగొట్టును. ధైర్యము కలిగించును. మానవుని గమ్యము మరియు సర్వసాధనలు హృదయ మును చేరుటకే. హృదయమును చేరుట వలన సర్వము సముద్రముగ దర్శనమిచ్చును.

66

## సంగ్రామము

**ఓం**కారము చేయునపుడెల్ల అది ఒక సంగ్రామమునకు పిలుపువలె యుండును. ఓంకారము చేయగనే పదార్థమున కదలిక లుండును. సంచలన ముండును. సంగ్రామ ముండును. పదార్థ మందలి ప్రజ్ఞ పదార్థము నుండి విడుదలకై ప్రయత్నించు చుండును. ఓంకారము వలన పదార్థమున చక్కని మార్పులు జరిగి ప్రజ్ఞకు పోషణము లభించును. ఓంకారము నందు విముఖతకు కేవలము జీవుల యందలి తమస్సే కారణము. తమస్సు పదార్థమును రక్షించును. పదార్థమందలి ప్రజ్ఞ ఓంకారముచే మేలుకొనుట వలన పదార్థమునకు సంచలనము తప్పనిసరియై యుండును. పదార్థముచే విడదీయబడిన ప్రజ్ఞ సమీకరణము చెంది ఊర్ధ్వముగ ప్రసరించు చుండగ, తనను తాను రక్షించుకొనుటకై పదార్థము ఓంకారమును నిర్జించును. పదార్థ రక్షణము రక్షస్సులు చేయుదురు. ప్రజ్ఞా రక్షణము యక్షస్సులు చేయుదురు. యక్షస్సులు, రక్షస్సులు నడుమ ఎప్పుడునూ ఒక సంగ్రామ మున్నది. యక్షస్సులు ప్రజ్ఞను ఊర్ధ్వముఖముగ ఉద్ధరించుటకు పూనుచుండగ, రక్షస్సులు ప్రజ్ఞను అధోముఖము పట్టించుటకు పదార్థ బలమును వాడుదురు. కనుకనే దేహమున

యక్షస్సులు సహస్రారమందు, రక్షస్సులు మూలాధారమందు యుందురు. ఒకరుత్తర ముఖమున వసించి యుండగ, రెండవవారు నైరుతి యందు వసింతురు.



67

## కలియుగ ధర్మము

**మా**నవజాతికి ఆరోగ్యకరమగు దేహములు ప్రధానమా లేక సంస్కారవంతమగు హృదయములు ప్రధానమా? అనాగరిక హృదయములు, ఆరోగ్యకరమగు దేహములు కలవారందరు అసురులే. దేహ దారుఢ్యము, దేహారోగ్యము ప్రస్తుత కాలమున విపరీతమగు ప్రాముఖ్యమును పొందుచున్నవి. దేహ పోషణమునకై అనేకానేక కృత్యములను మానవుడు చేయుచున్నాడు. అట్టి కృషియందు పది శాతము హృదయ సంస్కరణమునకు వినియోగించినచో తన దేహము, తన దేశము ఆహ్లాదమును పొందగలదు. అనారోగ్యమగు దేహమున్నను ఆరోగ్యకరమగు హృదయము కలిగించు పోషణ వర్ణనాతీతము. దైవ సాన్నిధ్యమున నిలచుటకు సంస్కారవంతమగు హృదయమే సాధనగాని, దారుఢ్యముతో కూడిన దేహమునకు అసాధ్యము.

జ్ఞానము పేరున, సాధన పేరున, యోగాభ్యాసము పేరున తోటివారి కష్ట నష్టములను గ్రహింపనివారు, గ్రహించినను సహాయ పడని వారు సంస్కారవంతు లెట్లు కాగలరు? ప్రస్తుతము మానవజాతి దారుఢ్యమగు శరీరములు పొందుటకే కృషి సలుపుచున్నదిగాని ఔదార్యవంతమగు హృదయముల నేర్పరచుకొనుటకు ఉత్సహించుట లేదు. ఇదియే నిజమగు కలియుగ ధర్మము.

68

## స్వస్థతా ప్రార్థన


**మా**నవ హృదయము మానవునకే పరిమితము కాదు. కేవలము వ్యక్తి సమస్యలు మాత్రమే, వ్యక్తి హృదయముపై ఒత్తిడి పెంచు ననుకొనుట అవివేకము. మానవజాతి ఒత్తిడి కూడ అన్ని హృదయములకు పంచబడుచుండును. అందరి హృదయమందు పనిచేయుచున్న దొకే స్పందన. ఒక ప్రాంతమందు కొంతమంది హృదయములు ఉమ్మడిగ ఆందోళనకు గురియైనపుడు వారి స్పందన యందు కొంత అంతరాయములు కలిగి స్పందన చెదరును. చెదరిన స్పందన అట్టి చెదరును ఇతరులకు కూడ పంచును. తత్కారణముగ అందరియందును తగుమాత్రము ఒత్తిడి అనుభూతమగును. నిశ్చల మగు తటాకమందు ఏ మూలనైనను ఒక బెడ్డను విసరినపుడు ఏర్పడు తరంగములు తటాక మంతయు ఎట్లు వ్యాప్తిచెందునో అట్లే ఒక ప్రాంతమందలి దుర్ఘటనయొక్క తరంగములు ఆ ప్రాంతము వారి హృదయ స్పందనపై ప్రభావము చూపగ, క్రమముగ ఆ ప్రభావము సంస్కారముగల మానవులందరిని స్పృశించును.

పై కారణముగ సున్నిత హృదయములకు హృదయ సంబంధిత మగు అస్వస్థతలు కలుగుచుండును. మానవుల భావములు వేరుగ

నున్నను హృదయ స్పందనములు మాత్రము ఒక్కటే యగుట వలన ఒకరి హృదయమున కలిగిన వేదన మరియొక హృదయమును కూడ సోకును. ఒక బృందమునకు కలిగిన వేదన మరియొక బృందము నకు సోకును. అందువలననే హృద్రోగము హెచ్చుగు చున్నది.

ఒక బృందమున కలిగిన వేదన మరియొక బృందము నెట్లు సోకుచున్నదో, అట్లే ఒక బృందమున చేయు స్వస్థతాపరమగు ప్రార్థనలు, ధ్యానములు ఇతర బృందములకు కూడ స్వస్థతను చేకూర్చు నని తెలియవలెను. కనుకనే బృందపరముగ స్వస్థతా ప్రార్థనలకు ప్రాధాన్య మేర్పడినది. మానవ సేవయందు స్వస్థతా ప్రార్థనలకు ప్రత్యేకమైన విలువ యున్నది. అట్లు ప్రార్థన చేయు బృందములకు మా సహకారము కూడ మెండుగ లభించును. ఇది సత్యము.

వారమున కొకమారు పూర్ణ హృదయములతో బృందపరముగ స్వస్థతా ప్రార్థనలు చేయుట లోకహిత బృందములకు తప్పనిసరి యని గ్రహింపవలెను.



69

## మరపు - అసమర్థత

సామాన్య జీవితమునకూడ కొందరికి కనపడునవి, వినపడునవి మరికొందరికి కనపడవు, వినపడవు. గోడకు చిత్రపటము వంకరగా వ్రేలాడుచున్నపుడు కొందరు గమనింతురు. కొందరు గమనింపరు. దుమ్ము, ధూళి, బూజు కొందరు గమనింతురు. కొందరు గమనింపరు. కుర్చీలు, బల్లలు క్రమపద్ధతిలో లేనపుడు కొందరు గమనింతురు. కొందరు గమనింపరు. గడియార మాగినపుడు కొందరు రోజుల తరబడి దానియందు బేటరీ మార్చరు. కొందరు మార్తురు. సక్రమముగ లేని విషయమును సరిదిద్దుకొనుట కొందరు వెంటనే చేతురు. కొందరాలస్యముగా చేతురు. కొందరసలు చేయరు. ఇట్లు మానవుల మధ్య చేతలయందు వ్యత్యాసమున్నది.

అట్లే వినికిడి విషయమునందుకూడ కొందరు శ్రద్ధగ విందురు. కొందరు శ్రద్ధ లేకపోవుటవలన కొంత విని కొంత వినకుందురు. వినిన విషయములను కొందరు జ్ఞప్తియందుంచుకొందురు. చాల మంది మరతురు. మరికొందరు వక్రభాష్యము చెప్పుదురు. ఇట్లు వినుట యందు వ్యత్యాసముండును.

చూచుట యందు, వినుట యందు గల వ్యత్యాసము ఎరుక యందలి వ్యత్యాసమే. కొందరికి ఎరుక ఎక్కువగ నుండును. కొందరికి తక్కువగ నుండును. ఎరుకనుబట్టే విజయములు, వైఫల్యములు ఉండును. కనుక జీవితము విజయోపేతము కావలెనన్నచో ఎరుకను పెంచుకొనుట ఒక్కటియే మార్గము. దానికి ప్రధాన సూత్రము క్రమ బద్ధమగు దినచర్య. దినచర్య క్రతుబద్ధమైనచో మానవుని యందు ఎరుక పెరుగునని తెలియవలెను. క్రతుబద్ధముగ కార్యములు నిర్వహించువారికి క్రమ మేర్పడును. క్రమ మేర్పడినపుడు ఎరుక వ్యాప్తి చెందును. ఇదియే ఆక్రమణము. అది చక్కగ వ్యాప్తి చెందినపుడు విక్రమ మగును. ఇట్లు వ్యాప్తి చెందుచు సూక్ష్మలోకముల లోనికి కూడ ఎరుక ప్రవేశించ వచ్చును. అపుడది పరాక్రమమై వెలయును. క్రమము ఆక్రమమై, ఆక్రమము పరాక్రమ మగుట చేతనాపరముగ జరిగినచో మానవుడు అపరిమితమగు బుద్ధిలోకమున ప్రవేశించ గలడు. కనుక ఎరుకను మెరుగు పరుచుకొనుటయే మార్గమని తెలియవలెను.

ఎరుకకు మరపు శత్రువు. మరపు కలిగినపుడెల్ల పశ్చాత్తప్తుడై ఎరుకను పెంచుకొనుటయే పరిష్కారముగాని, మరపును సమర్థించు కొనుట పరిష్కారము కాదు. తన మరపును సమర్థించుకొను మానవుడు అసమర్థుడు. అసమర్థునికి బాధ్యతాయుతమగు కార్యము అప్పగించ బడదు.

70

# క్రియా మార్గము

లాభము, భయము అనునవి మానవ మస్తిష్కమున నివాస మున్నంతకాలము మానవునకు బంధము తప్పదు. కృషి సలుపుచు, కర్తవ్యములను నిర్వర్తించుచు, బరువు బాధ్యతలను తప్పించుకొనక జీవించుటలో గల విలువను తెలియనివారే లాభములకై ప్రాకులాడుచు నష్టము వచ్చునేమోయని భయపడుచు జీవించుచు నుందురు. కర్తవ్యము లందు, బాధ్యతల యందు నిమగ్నమై యున్న మనసునకు మోసగించ నవసరము లేదు. వక్రభాషణము చేయనవసరము లేదు. అవినీతి నాశ్రయించు అవసరముండదు. ఆశించువానిని ప్రకృతి బంధించును. కృషిసాధనము యందు మాత్రమే దృష్టి గల వానికి సిద్ధియందు కూడ దృష్టి యుండదు గనుక బంధనమున కాస్కారమే లేదు.

మానవునకు కర్తవ్య నిర్వహణమునందు మాత్రమే అధికార మున్నదని శ్రీకృష్ణుడు తెలిపెను. ఆశించుట కధికారము లేదని కూడ తెలిపెను. ఆశించుచు పనిచేయుట వలననే మానవుడు బంధింపబడు చున్నాడు. చేయవలసిన పని చేయుటయందే సిద్ధి యుండును. ఆశించుట యందు సిద్ధి లేదు. కర్తవ్యము నిర్వర్తించునపుడు ఆనంద

ముందునుగాని, నిర్వహణము లేక ఆనందింప జూచుట అవివేకమే యనబడును. చేయుట యందే ఆనంద మున్నదిగాని చేయుట వెనుక లేదు. చేయుచు ఆనందముగ నుండుటయే జీవన రహస్యమని భగవానుడు తెలిపినాడు. మరియొక మార్గమున ఆనందము పూర్ణమై యుండదు. దేవతలు, ఋషులు చేయవలసినది చేయుచు ఆనంద ముగ నున్నారు. చేయకుండగ ఆనందమెట్లు పొందవలెనో వెదకికొను మానవుడు ఎండమావుల వెంటపడుచు శ్రమపడుచున్నాడు. క్రియ యందున్న ఆనందము మరి దేనియందును లేదని తెలియవలెను.

71

## సాధనా పరిశీలనము

**ఆ**ధ్యాత్మిక సాధన యందు దూకుడు ప్రమాదకరము. దూకుడు రజోగుణము వలన ఏర్పడును. సరళముగ సాగుట సత్వగుణము. రజోగుణ దోషమున తమ కన్నియు తెలియునని, తమకు మహాత్ముల పరిచయమున్నదని, తాము దివ్య దర్శనము పొందితిమని రజోగుణ సంపన్నులు తమ ఆధిక్యతకై బీరములు పలుకుచు, తాము పలికిన బీరములను తామే నమ్ముచు, భ్రమకు లోనై ఇతరులను కూడ భ్రమయం దుంచుదురు. ఇది యంతయు మాయావిలాసమే కాని ఆధ్యాత్మికత కాదు.

తమకు గురువనుగ్రహము వలన జ్ఞానపు తాళము చెవి దొరికినదని నకిలీ తాళములు, నకిలీ తాళము చెవులు అందించుచు, తాము మోసపోవుచు, ఇతరులను మోసము చేయుట దురదృష్టము. ఆత్మసాధకుడు ఆశకు లోనైనపుడు ఇట్టి భంగపాటు పడుచుండును. ఇట్టి విషయములందు సాధకుడు జాగరూకత వహించవలెను. భ్రమను చెంది ఇతరులపై ఆధిక్యతను పొందుటకు ప్రయత్నించు వారెల్లరును ఒక అవలక్షణమును ప్రదర్శించు చుందురు. అది యేమనగా, తాము

పూర్వము చెప్పిన వాదములను, తర్కములను వారే తెలియక ఖండించుచు నుందురు. ఇట్టివారిని విడచుట సత్సాధకునికి మేలు.

పై విధముగ భ్రమకులోనైన సాధకులు ఒంటరి వాడైనపుడు భ్రమ తొలిగి వాస్తవము దర్శనమగును. నిజమునకు ప్రతి సాధకుడు కొంత ఒంటరితనము దైనందినముగను, సప్తాహమునందును, పాక్షికమందును, ప్రతి మాసమునందును ఏర్పాటు చేసుకొన వలెను. ఏకాంతమున తన ప్రవర్తనను తానే నిశితముగ పరిశీలించుకొన వలెను. ఈ క్రింది ప్రశ్నలకు సమాధానమును పరిశీలించుకొనవలెను.

1. తాను నిజముగ పరహిత కార్యము లొనర్చుచున్నాడా? లేక ఇతరులు చేయుచుండగ తాను చెప్పుకొనుచు తిరుగుచున్నాడా?

2. తాను చేయు పనియందు శ్రద్ధ పెరుగుచున్నదా లేక వ్యామోహము పెరుగుచున్నదా?

3. హితకార్యముల నుండి గుర్తింపు, ప్రాముఖ్యము ఇత్యాది అంశములపై దృష్టి పడుచున్నదా లేక హితకార్యము లందే నిమగ్నమై యున్నదా?

4. తా ననుసరించు వారిలో కార్యసాధకు డున్నాడా లేక స్తోత్రపరులే చేరుచున్నారా?

5. తన ననుసరించు వారిలో లౌకిక ప్రయోజనము కోరి చేరు వారెందరు, ఆత్మ సాధనకై చేరువారు ఎందరు?

6. తాను చేయుచున్న కార్యముల ప్రయోజన మెట్లున్నది? దానికి సవరణ మవసరమా?

72

## మా బాధ్యత

అంతరంగమున సద్గురువునందు నిర్లక్ష్యము చోటు చేసుకున్నచో ఆత్మ వికాసమునకు గల అవకాశములు జారిపోవును. ఇష్టములేని కాపురము ఎట్లు కష్టముగ నుండునో, ఇష్టములేని గురువు ననుసరించుట కూడ కష్టమే. ప్రారంభమున గురువుపై అమితాసక్తి కలిగినవారు క్రమముగ అనాసక్తికి లోనగుటకు అవకాశ మున్నది. అట్టివారు తెలియకయే సద్గురువును క్రమముగా అంతరంగమున నిరాకరింతురు. సద్గురువును నిరాకరించుచు అతని ననుసరించు చున్నట్లుగ జీవించు వారి వలన సద్గురువునకు, అనుసరించు వానికి కూడ అపాయములు సంభవించును. ఏసునకు జూడ అట్టివాడు. పరాశరునకు బృహస్పతి అను శిష్యు డట్టివాడు. ద్రోణునకు దుర్యోధను డట్టివాడు. ఇట్లెన్నియో ఉదంతము లున్నవి.

శిష్యునికి గురువుపై అనాసక్తి, గురువుకు శిష్యునిపై అనాదరణము ప్రస్తుతకాలమున మెండుగ గోచరించుచున్నవి. గురు శిష్య సంప్రదాయమున అచంచలమగు విశ్వాసము ప్రధానము. అట్టి విశ్వాసమునకు విఘాతము కలిగించుట కలియుగ లక్షణము. దీనికి

లోనగు గురు శిష్యులెందరో కలరు. తత్కారణముగ అత్యంత పవిత్ర మగు గురు శిష్య సంప్రదాయము నశించు అవకాశమున్నది. ఇట్టి ప్రయత్నము నరికట్టుట మా బాధ్యతలలో నొకటి.

## 73

# పరహిత ప్రేమ

పరిశ్రమయం దాసక్తి ఒక కల్యాణ గుణము. శ్రమ కిచ్చగించని వారు పురోగమించలేరు. మా అనుయాయులందరు అనంతమగు పరిశ్రమను ప్రేమించువారే. పరిశ్రమను ప్రేమించువారే కలియుగ స్వభావమును అధిగమించగలరు. పరిశ్రమించువారికే పరలోకప్రాప్తి.

దేహమునకు బానిసలైనవారు పరిశ్రమ నిచ్చగించరు. కాని బానిసత్వము అమిత దుఃఖదాయకము. బానిసత్వమున పరిశ్రమ విధింపబడును. పరిశ్రమయందు ఆసక్తి గల వారికి బానిసత్వముండక పోగ పరిశ్రమ కనుగుణమగు ఆనందముండును. స్వచ్ఛందముగ పరిశ్రమించుట పరిశ్రమగ తోచదు. ప్రేమ భావము చేత పరిశ్రమ అను భావన అదృశ్యమగును. ప్రేమ వలన కష్ట నష్టములు తోచవు. ప్రేమ యున్నపుడు ఉచ్చహీనములు కూడ అనిపించవు. పరిశ్రమ యందు ప్రేమ వలన, ప్రేమ స్వర్గతుల్యముగ నుండును.

స్త్రీ పురుషు లొకరినొకరు ప్రేమించుకొనునపుడు ఒకరి కొకరు ప్రాణత్యాగమునకైన సిద్ధపడుదురు. అట్లే పరిశ్రమను ప్రేమించువారు పరహితకార్యమునందు ప్రాణములను కూడ లెక్కచేయక సాగుచు నుందురు. ప్రేమించుటలో పరహితమును ప్రేమించుట అత్యుత్త మముగ మేము భావింతుము.

74

## మార్గము - అనుగ్రహము

పని పెరిగినపుడు దురదృష్టమని భావింపకుము. పరిశ్రమ కది ఒక అవకాశమని తెలియుము. ఎంత పరిశ్రమించిన అంత దేహధాతువులయందు అగ్ని ప్రవేశించును. నడుము బిగించి పరిశ్రమించుచు పరహిత కార్యము లొనర్చుము. అలసట యని భావింపకుము. ఈనాటి నీ పరిశ్రమ భవిష్యత్తున నీవు పొందు పంట అని తెలియుము. విత్తనములను నాటిన వాడు పరిశ్రమించనిదే పంట లభించునా? పరిశ్రమించక పంటను పొందుటవలన నీవు సృష్టియందు ఋణపడుచు అధోగతి చెందుచు నుందువు. పరిశ్ర మించుచు పంటను పంచినచో ఉత్తమగతులు లభించును. సూక్ష్మ లోకములు చేరిన వారందరును పరిశ్రమించి అందివచ్చిన పంటను పంచినవారే గాని, తమకై అనుభవించినవారు కాదు. వారే నీకును మార్గదర్శకులు. అదే మార్గమున నీవు పయనించుము.

అనంతమగు పరిశ్రమ గావించి, అంది వచ్చిన పంటను పంచి, ఆత్మయందు విశ్రమించుట మేమందించు మార్గము. ఆత్మాను భూతి సోమరులకై నిర్దేశింప లేదు. యజ్ఞార్థమే జీవించుచు సర్వ విధమగు ఋణములనుండి విముక్తులైన వారికే ఆత్మ సంయమము,

ఆత్మానుభూతి, ఆత్మగ విశ్రమించుట యున్నది. పరిశ్రమయందలి మాహాత్మ్యము తెలియుట నీ వంతు. పరిశ్రమ ననుసరించు వారిని నడిపించుట మా వంతు. అనుగ్రహించుట దైవము వంతు.

75

## వృక్షములు

నిర్మల హృదయము శుద్ధ స్ఫటికమువలె ప్రకాశించును. కనుకనే శుద్ధ స్ఫటికములను వాడుట ఒక సంప్రదాయమైనది. మబ్బు లేని ఆకాశము కూడ శుద్ధ స్ఫటికమే. స్ఫటికము పారదర్శకముగ నుండును. అట్లే మానవ హృదయమున మర్మము లేనపుడు శుద్ధ స్ఫటికమువలె మెరయును. ఓంకారము చేయగనే హృదయాకాశ మంతయు శుద్ధ స్ఫటికమువలె గోచరించును. ఓంకారోచ్చారణ కూడ అసుర తత్వమును పారద్రోలి సుర తత్వము నావిష్కరించుట కొరకే. తెల్లని తెలుపు స్వచ్ఛతకు చిహ్నము. అట్టి స్వచ్ఛతకై కృషి చేయుట ప్రధానమైనది.

అంతర్దర్శనములు, అంతరానుభూతులు పొందుటకు ప్రయత్నించువారు ప్రాథమికముగ నిర్మల హృదయులై యుండవలెను. పరిశుద్ధ జీవనము మాత్రమే నిర్మల హృదయమును ఆవిష్కరింప గలదు. నిర్మల హృదయమావిష్కరింపబడు వరకు అంతరంగమున ఓంకారమును స్మరించుట సాగవలెను. అటుపైన ఓంకారము అనుస్మరణమై నిలువవలెను.

హిమాలయములలో సాధకులు దేవదారువృక్షపు స్పర్శను అరచేతుల యందు పొందుచు, ఓంకారమును ధ్యానము చేయుచు దివ్యత్వమునకై యత్నింతురు. దేవదారు వృక్షమందు అట్టి దివ్యతత్త్వము యున్నది. మునివ్రేళ్ళతో స్పృశించుచు, అరచేతులతో స్పృశించుచు, వృక్షమునుండి ప్రసరించు దివ్యప్రజ్ఞను అనుభూతి చెందుచు, ధ్యానములు చేయు ఆచారమున్నది. దివ్య వృక్షములన్నియు ఈ విధమైనటువంటి నిర్మలత్వమును ప్రసరింపజేయగలవు.

వృక్షములు అనునిత్యము సూర్యుని నుండి తేజస్సును, ప్రాణమును అందుకొనుచు పరిసరములలోనికి ప్రసరింపజేయుచు నుండును. నిట్టనిలువుగ, ఎత్తుగ పెరుగు వృక్షములయందీ శక్తి యున్నది. అట్లే రావి, మఱ్ఱి ఇత్యాది వృక్షములనుండి కూడ ఇట్టి ప్రసారమును పొందవచ్చును. వృక్షములు దివ్యస్పర్శ నీయగలవని తెలిసినవారు చాల తక్కువ. ఒక మహావృక్షము, ఒక మహాత్మునివలె యోగక్షేమములను అందించగలదు. వృక్షముల నుండి సందేశము లందుకొని జీవితములను నిర్వర్తించుకొనుచు ఎందరో సాధకులు సిద్ధులైనారు. వృక్షములను నఱకు నరజాతికి వృక్షముల విలువ తెలిసినపుడే నిజమగు పురోగతి లభించును.

76

## సత్యయోగము - శ్వేతబృందము

అద్భుతముల కాకర్షించువారు సత్యము నెరుగలేరు. సత్యమున కాకర్షింప బడినవారు అద్భుతములకు విలువీయరు. సత్యము కన్న అద్భుతమైన విషయ మేమున్నది. సత్యము నుండియే సర్వము ఉద్భవించును. సత్యమెరిగిన వానికి అద్భుతములు పిల్ల చేష్టలుగ నుండును. సత్యము నుండి పుట్టిన సంకల్పము నుండి మహత్తు పుట్టును. మహత్తు ఉన్నది లేనట్లుగాను, లేనిది ఉన్నట్లుగను గోచరింపజేయు మాయాశక్తి. దివ్యసంకల్పము కాలము, ప్రకృతితో కూడి మహత్తును ఏర్పరచును. దివ్యసంకల్పము సత్యమునుండి ఉద్భవించు ఒక తరంగము. సత్యదర్శనము నాశించుట వలన జీవుడు సత్యమార్గమున ప్రవేశించి, సత్యదర్శను లగుదురు. అద్భుతముల నాశించువారు ప్రకృతి శక్తులకు లోనై మాయను బడుదురు.

శ్వేతద్వీప వాసులమగు మేము సత్యమునకు ప్రాధాన్యత నిత్తుముగాని, అద్భుతములకు ప్రాధాన్యత నీయము. అద్భుతములకు అచ్చెరువొందుటకన్న ఆచరణాత్మకమగు యోగమున ప్రవేశించుట శ్రేష్ఠము. ఆచరణమునకే యోగవిద్య. ఆచరణము వలననే మానవుని యందు వలసిన రసాయన మార్పు ఏర్పడి అతని మనస్సు నుండి

బుద్ధిలోనికి ప్రవేశించును. ఆచరణ మార్గముననే బుద్ధినుండి ఆత్మ లోకమున ప్రవేశించును. తనయందలి రసాయనపు మార్పు వలన పూర్వము అద్భుతములుగ తోచినవి సహజము లనిపించును. సత్యమున, సత్యమార్గమున అష్టప్రకృతుల విన్యాసము లన్నిటిని చక్కగ దర్శింపవచ్చును. సత్యమార్గము సహజమగు మార్గము. పంచ భూతముల యందు, త్రిగుణముల యందు, మహాచైతన్యము నందు అంతర్హితముగ నున్నది సత్యమేగదా!

సత్యదర్శనమున పయనించువానికి నవావరణల యందలి శక్తుల మాహాత్మ్యములు అప్రయత్నముగనే దర్శనమగుట, విశద మగుట యుండును. నవవిధ శక్తుల కాశింపక సత్యము నాశ్రయించి, ప్రకృతి శక్తుల విన్యాసమును దర్శించుటే యోగము. యోగము సత్యదర్శన మార్గము. అందంతర్హితముగ ప్రకృతి దర్శనముకూడ జరుగును. శక్తుల కాశింపక సత్యము నాశ్రయించి, దర్శించి సత్య వంతుడగుట మేమందించు యోగము. అందులకే శ్వేతబృందము. శ్వేతబృందములోనివారు పరిశ్రమించుటేగాని ఆశించుట అనునది విసర్జింతురు. పరిశ్రమ అంతయు పరహితము ననుసరించియే యుండును.

77

## అలజడి

**హి**మాలయములందు ఆకసమున అపుడపుడు శ్వేతాశ్వములు వేగముగ పరువెత్తు చుండును. అవి మెఱపులవలె పయనించుచు స్ఫూర్తి నిచ్చును. వానిని దర్శించు వారియందు మెఱపు భావన లవతరించును. అట్టి మెఱపు భావనను భూమిపై అవతరింప జేయుటకు సిద్ధులు, సాధ్యులు, సాధకులు కృషి సలుపుచుందురు.

ప్రపంచమున ఒక మెఱపు భావన అవతరించినపుడెల్ల కొంత అలజడి కూడ కలుగుచుండును. ప్రతి అలజడి కొంత స్థితి మార్పును కలిగించును. అలజడి లేక రసాయనమే లేదు. రసాయనము లేనిచో మార్పు రాదు. ప్రస్తుతమున ప్రపంచమున ఏర్పడుచున్న అలజడి కంతయు కారణము నూతన చైతన్య అవతరణముగ గూడ దర్శింప వచ్చును. అలజడులను మాత్రమే దర్శించు వారికి అంతయు అయోమయముగ గోచరించును. అలజడి పర్యవసానము దర్శించు వారికి దివ్య సంకల్పము అవగాహన యగును. సమస్యలు పరిష్కరింప బడినపుడే గదా పురోభివృద్ధి సాధ్యపడును. సమస్యలను కప్పిపుచ్చు కున్నచో అవి మరణ కారణము లగును.

సమస్యలను పాతివేయుటకన్న వానిని గుర్తించి పరిష్కరించుకొనుటవలన జాతి పురోభివృద్ధి చెందును. నరజాతి వ్యాధి నివారణమునకే ప్రస్తుత అలజడులన్నియు.



## 78

## జీవ పోషణము

**జం**తువులకైనను, నరులకైనను పసితనమున తల్లిపాలే శ్రేష్ఠము. తల్లిపాలయందు ప్రేమ యున్నదని, ప్రేమ జీవుని పోషించు నని ఎరిగినవారు బహుకొద్దిమంది. పాలపదార్థము దేహమును పోషించగ, పాలయందలి తత్వము జీవుని పోషించును. దేహపోషణ విద్యలు మానవుడెన్నియో నేర్చినాడు. జీవుని పోషించు విద్యలు మాత్రము నేర్వలేకున్నాడు.

పిల్లలకు పాలిచ్చు తల్లులు ఆతురపడక, ప్రేమతో పాలిచ్చినచో మొదటి రెండు సంవత్సరములలోనే పిల్లలకు ప్రేమతత్త్వమును అందించవచ్చును. అట్టి తల్లులు నిజమగు మాతృమూర్తులు. పాలార గించు శిశువులకు ప్రేమారగింపుకూడ చేయవచ్చును. పాలు హృదయ సంబంధిత గ్రంథులనుండి ప్రకృతి తల్లుల కేర్పరచును. కనుక పాలయందు హృదయతత్వము అంతర్హితముగ నున్నది. దేహపోషణ మునకే పాలు అనుకొనుట అవివేకము. పోషక పదార్థము లేవియైనను ప్రేమతో అందించిన జీవుడు గూడ పోషింపబడును. ఇది తెలియని వారు పాలిచ్చుట, వడ్డించుట, పోషక పదార్థములను వండుట

కేవలము భౌతికమే యగును. పాలిచ్చు వారు, వండి వడ్డించువారు ప్రేమ లేనివారైనపుడు జాతి ఉద్ధరణకు ఒక మహత్తర అవకాశము మృగ్యమగును.

79


## ఒడ్డాణము

మీకొక చిత్రమైన విషయమును తెలిపెదను. భారతదేశమున ప్రస్తుతమున స్త్రీలు దక్షిణాపథమున మాత్రమే ఒడ్డాణము ధరింతురు. అదియును పర్వదినములయందే పేరంటమునకై మాత్రమే ధరింతురు. అందునా సంపన్నులే గొప్పతనము కోసము ధరింతురు.

కాని ఒడ్డాణము ధరించు ఆచారము అతి ప్రాచీనము. జ్ఞాను లగు ఆర్యులు ఒడ్డాణ ధారణమును స్త్రీ, పురుషులకు నిర్దేశించిరి. మానవుడు మనసు ప్రధానముగ జీవించువాడు. అతని బొడ్డునందెన్నో ఆలోచనలున్నవి. అందు శ్రేయస్సు కలిగించునవి, కలిగించనివి కూడ యుండును. ఆలోచన లన్నిటికి బొడ్డు కేంద్రము. కోరికలకు కూడ అదియే కేంద్రము. భావములను నియమింపజేయుటకు బొడ్డు సంబంధిత ఆచారములు ఆర్యు లిచ్చినారు. బొడ్డును బంగారపు బిళ్ళతో పరిరక్షించు ఆచారముకూడ ఆర్యు లిచ్చినారు. అట్లు పరి రక్షించుటవలన ఇతరుల భావముల దుష్ప్రభావము తమపై పడకుండును. బంగారము సూర్యప్రజ్ఞ కలిగియుండును. అది ప్రాణమును, తెలివిని పరిరక్షించును. అందుచేత బొడ్డు బిళ్ళలు పిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు కూడ ధరించెడివారు.

మరియొక విశేష మేమనగ బొడ్డు పెరుగనీయకుండుట ఆర్యధర్మము. పొట్ట పెరిగినచో బొడ్డు విచ్చుకొనును. బొడ్డు విచ్చు కొనినచో ఆరోగ్యమున కపాయకరము. కనుక స్త్రీ పురుషులు కూడ నడికట్టు బిగించి యుండెడివారు. నడికట్టు సన్నముగను, బిగుతుగ నున్నచో ఆరోగ్యము పటిష్ఠముగ నుండును. యోగమున గూడ ఓడ్యాణబంధము చాల ప్రధానమైనది. నడుము పలుచగనున్న వారికి ప్రజ్ఞ ఊర్ధ్వముగ ప్రసరించుటకు అవకాశము మెండుగ నుండును. నడికట్టు బిగువు సడలినచో ఉదరవితానము పదను కూడ తగ్గును. అపుడు ప్రజ్ఞ ఊర్ధ్వముఖము పట్టుట కష్టమగును. మధ్య కూటము, శక్తి కూటము రెండిటిని అనుసంధానము చేయునది కటి. కటిభాగము బలముగ నుండుట, బొడ్డును సంరక్షించుకొనుట యోగమున ప్రధానమగు అంశములు.

ఎట్టి పరిస్థితులలోను బాహ్యమునకు బొడ్డు ప్రదర్శింప బడరాదు. అది అనాగరికము కూడ. బొడ్డు ప్రదర్శనము చేయు స్త్రీలు వివేకము లేనివారు. ఆర్యుల ఆచారమున ఎన్నియో యోగ రహస్యము లిమిడియున్నవి. అందు ఒడ్డాణాచారము ఒకటి.



# 80

## నిశితత్వము

**భా**వము, భాష, చేతలయందు నిశితత్వము చాల ప్రధాన మైనది. బాణమును ప్రయోగించు విలుకాడు గమ్యము యొక్క కేంద్రము నెట్లు గురిపెట్టునో అంత నిశితముగ భావము, భాష, చేతలకు శిక్షణిచ్చుట ఒక ముఖ్యమగు సాధన. పనులు చేయునపుడు సుమారుగ చేయుట, దాదాపుగ పూర్తిచేయుట అశ్రద్ధకు సంకేతము. అట్లే భాషణయందు అవసరము లేని పదములు వాడుట, అవసర మగు పదములు వాడకుండుట వలన భావము సూటిగ, స్పష్టముగ తెలియరాదు. మాటలాడుట అందరూ చేతురుగాని, కొందరికే ఎట్లు మాట్లాడవలయునో తెలియును. భావ ప్రకటనము నైపుణ్యముతో నుండవలెను. దాదాపుగ అదే అర్థమువచ్చు పదములు వాడుట మేమంగీకరింపము. సరియగు పదము వాడుట వాఙ్మయ తపస్సునకు సంబంధించిన అంశము. అనేక పర్యాయపదము లున్నను, అందే పదము సందర్భోచితమో ఆ పదమునే వాడవలెను. ఎక్కువతక్కువలు పనికిరావు. దీనివలన స్పష్టత పెరుగును. మరియు నిశితత్వము పెరుగును. మనసున గూడ సూటిగ విషయమును గ్రహించుశక్తి లభించును. ఏకాగ్రత సిద్ధించును. భావములు పరిపరి విధములుగ పోవు అవగాహన పెరుగును. ఆకళింపు కూడ స్పష్టముగ నుండును. అస్పష్టత నిర్మూలింపబడును. ఇది ఒక ఉత్తమమగు సాధన.

81

## సూర్యుడు - ధర్మము

ధర్మమునకు జీవితమును సమర్పించుటకై ప్రయత్నింపుము. ఇదియొక ఉత్తమమగు దీక్ష. ఎట్టి పరిస్థితులలోను ధర్మమునే అనుసరించుటకు కృషి సలుపుము. ఈ కృషి నిన్ను ఎన్నో జన్మపరం పరల నుండి తరింపజేయును. ధర్మాచరణము మాహాత్మ్యము యింతదని చెప్పుట కష్టము. అందరూ ధర్మమును గూర్చి తెలుపుదురే గాని ఆచరించువారు దాదాపు మృగ్యమే. ధర్మమును తు.చ. తప్పని వానిని మృత్యువు కూడ స్పృశింపలేదు. ఈ సత్యమును తెలుపుటకే యుధిష్ఠిరుని భారతమున పరిచయము చేయుట జరిగినది. నిజము నకు భారత కథయందు విజయుడు యుధిష్ఠిరుడే. అర్జునుడు కాదు. మహా ప్రస్థానమున యుధిష్ఠిరు డొక్కడే ధర్మమునకు దీటుగ నిలచి బొందితో స్వర్గమును చేరెను. ఎంత ధర్మము నాచరింతువో అంత రక్షింపబడుదువు. ఇతరములు రక్షింపలేవు.

ధర్మాచరణమునకు తూకము దయాగుణమున తెలియును. క్షమాగుణమున తెలియును. ఇతరులయందు క్షమ, దయ కలవారు సహజముగ ధర్మాత్ములు. అధర్మ మున్నచోట శత్రువు లుందురు. ధర్మమునకు సూర్యదేవుడే ప్రమాణము. అతడెదురులేని వెలుగు

కిరణములు కలవాడై యుండును. అతడమిత తేజోవంతుడేగాక, ప్రాణవంతుడు కూడ. సూర్యోపాసనము చేయువాడు ధర్మము నాచరింపనిచో, అతని ఉపాసనము బూడిదలో పోసిన పన్నీరు వంటిదగును.

82

# సూర్యోదయము

**సూ**ర్యోదయమునకున్న ప్రభావము భూమిపై మరే శక్తికిని లేదు. సూర్యోదయ మాహాత్మ్యమును గూర్చి వేదములు స్తుతి చేయుచు పూర్ణముగ స్తుతి చేయలేమని తెలిపినవి. సూర్యోదయమును అనుభవింపవలసినదేగాని వివరణమునకు పూర్తిగ అందదు. మానవునకు ప్రధానముగ వలసినది ప్రాణము, తెలివి. ప్రాణము దేహమును పోషించును. తెలివి జీవిని పోషించును. ఈ రెంటిని సూర్యోదయమిచ్చును. దైనందినముగ లభించునది సూర్యోదయము. దానికున్ముఖుడై దర్శించుట ఒక అదృష్టము. దర్శింపకుండుట చెప్పలేని దురదృష్టము.

సూర్యోదయమున కున్ముఖమై ఆరాధన చేయువానికి జీవితమున ఉత్పాతములు సంభవించినను నాశముండదు. నీవు నిదుర లేచుటయే అనునిత్యము నీలో జరుగు సూర్యోదయము. అప్రమత్తతతో నిదుర లేచిన వెంటనే ఏడు నిమిషములపాటు నీ హృదయమునందు సూర్యోదయము నూహించుచు పూజింపుము. ధ్యానింపుము. తదనుభూతిని పొందుము. అటుపైన దినచర్యలోనికి ప్రవేశింపుము. నీవు లేచిన వెంటనే ఇట్లు చేయుట ఎంతయు ఉపయోగకరము.

నీయందు తెలివి ఉద్భవించి నిదుర అను తమస్సు నుండి నీవు బాలసూర్యునివలె మేల్కాంచు చున్నపుడు అంతరంగమున ఈ దర్శనము చేసినచో పరమ శుభము నీకు లభించును. జీవితమున నీకు జయము సిద్ధించును. రామునకు అగస్త్యుడు బోధించినదీ రహస్యమే.

## 83

# సహజ ప్రకృతి

అతీతము అద్భుతము అగు విషయములేవియు లేవు. అంతయు ప్రకృతి సహజమే. ప్రకృతి అష్ట ప్రకృతులుగ నున్నది. ఒక ప్రకృతి కన్న ఒక ప్రకృతి సూక్ష్మమై ఎనిమిది ప్రకృతులుగ ఏర్పడి యున్నది. అన్నిటికి మూలముగ మూలప్రకృతి యున్నది. మూలప్రకృతి నుండి సూక్ష్మతమము, సూక్ష్మతరము, సూక్ష్మము, స్థూలముగా అవరోహణ క్రమములో ఎనిమిది ప్రకృతులున్నవి. తొమ్మిదవది అయిన మూలప్రకృతి అవ్యక్త మగునపుడు పది అగును. వ్యక్తమైనపుడు తొమ్మిదవది అగును. ఇన్ని శ్రేణులలో ప్రకృతి యున్నపుడు వాని అవగాహన ఆకళింపు అయినపుడు అద్భుతము లేముండును? అతీతమైన వేముండును? అసహజమైన వేముండును? అన్నియు సహజమే. అన్నియు సమంజసమే. ప్రకృతికి అతీతమగున దేమియు లేదు. ప్రకృతి హృదయము నెరిగినవానికి అంతయు సహజమై యుండును. అద్భుతము లేవియు ఉండవు. చిన్నతనము నుండి నవశ్రేణులలో వ్యక్తమైయున్న ప్రకృతిని విద్యద్వారా పిల్లలకు పరిచయము చేసినచో వారియందెంతో పరిణతి కలుగ గలదు. మానవుడు పరిపూర్ణుడగుటకు ప్రకృతి స్థితులన్నిటిని పరిచయము

చేయవలెను. కేవలము స్థూల ప్రకృతిని గూర్చి తెలుపుచు, స్థూలము కన్న ఏమియు లేదను అజ్ఞానమున జీవించు జాతికి అన్నియు అద్భుతములుగనే గోచరించును. కేవలము స్థూల జ్ఞానము పసితనమే. పసివాడు తనకంతయు తెలుసునని విఱ్ఱవీగుచున్నపుడు పెద్దలు వానికొక మూర్ఖునిగను, అహంకారిగను భావింతురు. అట్టివాడు పెద్దవాడైనను స్థూలమును తప్ప అంగీకరించడుగాన, పసివానిగనే గోచరించును. మానవజాతి ఇట్టి మూర్ఖత్వమున బడి నశించుచున్నది. విద్యావేత్తలీ విషయమును గమనించుట లేదు. విద్యావేత్తలు కూడ స్థూలవిద్య నెరిగినవారే గాని సూక్ష్మవిద్య నెరిగినవారు కాదుగదా! ఇట్టి జాతికి పరిష్కారమెట్లు లభించును? కాలము ద్వారా ప్రకృతియే పరిష్కరించవలెను.



84

## ప్రమాణము

దిగ్భ్రాంతి చెందుట, భయపడుట, నిరాకరించుట నీ మనో తత్త్వమున విసర్జింపబడినపుడు నీవగ్ని యోగమునకు చేరువగుదువు. ప్రకృతి యందు అన్నియు సహజమే గనుక ఒక భూకంపమునకు గాని, ఒక అగ్ని ప్రమాదమునకు గాని, ఒక జల ప్రమాదమునకు గాని యోగి యందు కంపనము లుండవు. గమనించుట, తనవంతు కర్తవ్యమును నిర్వర్తించుట మాత్రమే యుండును. లోకాలోక సన్ని వేశములను గమనించగల శక్తి యోగమున సహజముగ అలవడును. పంచభూతములు తమదైన రసాయనమును తాము తయారుచేయుచు జీవులకందించు చుండును. నిరంతర మీ రసాయనము సాగుచునే యుండును. సామాన్యము, అసామాన్యము అగు రసాయనములు ప్రకృతి అందించుచుండును. సాధారణ సన్నివేశములు, అసాధారణ సన్నివేశములు జరుగుచున్నపుడు అందు ప్రకృతి నర్తనమును చూచుటయేగాని, దిగ్భ్రాంతి చెందుట, భయపడుట, నిరాకరించుట వలన ప్రయోజనము లేదు.

నీవు ఒక విస్తృతమగు కార్యమును తలపెట్టినపుడు అకాల

వర్షము కురిసినచో నిరసించుటవలన ప్రయోజనమేమి? నీరసమే కలుగును. నిర్జించుటకు వీలులేని విషయములయందు నిరోధమునకు ప్రయత్నించుట అవివేకము. జరుగుచున్న మార్పును గమనించుచు, కర్తవ్యమును నిర్వర్తించుచు, ముందుకు సాగుట ఒకటియే మార్గము. యోగులట్లే యుందురు.

తన కన్నులముందే నిష్కారణముగ యాదవులందరు కలహించి ఒకరినొకరు చంపుకొనుచుండగ నిర్లిప్తుడై చూచుచు నుండిన కృష్ణ పరమాత్మయే మాకు యిట్టి సందర్భములందు ప్రమాణము. మీకును అదియే ప్రమాణము.

85

## క్షమ

**క్ష**మ గలవాడే లోతైనవాడు. అతడే గంభీరుడు. క్షమ లేనివాడు దుష్టత్వమునకు ద్వారములు తెరచును. ధరించుట, భరించుట, సహించుట, క్షమించుట యిత్యాది లక్షణములు లేనివాడు అకస్మాత్తు సన్నివేశములందు రాణించకపోగ, కలవరపడుచు కలవరపెట్టును. క్షమ గలవారిని సూక్ష్మలోకములందు ఆదరింతురు, గౌరవింతురు. సూక్ష్మలోకములందు క్షమకే విలువ యుండును. క్షమ గలవాడే త్వరిత గతిని పరిణామము చెందును.

క్షమ హృదయ కేంద్ర గుణము. క్షమను బట్టే హృదయము వికసించును. క్షమ లేని వానికి హృదయవికాసమే యుండదు. క్షమ లేకపోవుటవలన జీవుడు పరిమితుడగును. సంకుచితుడగును. క్షమాహీనత వలన మానవుడు హీనుడగుచున్నాడు. క్షమాలేమి వలననే మానవునకు ఆరోహణమున కవకాశము మృగ్యమైనది. క్షమ లేనివాడు తనకు తానే విఘ్నముల నేర్పరచుకొనుచున్నాడు. క్షమ లేనివానిని అవిద్య ఆవరించును. దుష్టశక్తులు వినియోగించు కొనును.

క్షమను సాధించి యుధిష్ఠిరుడు స్వర్గారోహణమునకు అర్హు డయ్యెను. క్షమ గలవాడు మాకు మిక్కిలి ప్రీతిపాత్రుడు. క్షమ గలవాని పరిశ్రమ మూడు లోకములందు కీర్తింపబడు చున్నది.

86

## అసురమాతలు

రెండవ సంవత్సరముననే శిశువునకు ప్రేమ పాఠములను బోధన చేయుట సదాచారము. ఈ ఆచారమునకు ఆచార్యత్వము వహించవలసినది తల్లియే. జాతియందు పరిణతికి తల్లులు చేయగల కృషి ఎంతయైననూ యున్నది. ఉగ్గుపాలతోనే సద్విషయములను పిల్లల కందించు తల్లులు మా దృష్టిలో దైవ సమానులే. ఏడు సంవత్సర ముల వరకు తల్లికి శిశువుకు అత్యద్భుతమగు హృత్ సంబంధము నెలకొని యుండును. ఈ కాలమున తల్లి పిల్లలకు నేర్పు సద్గుణములు జీవితాంతము ఉన్నతికి తోడ్పడును. గర్భమున నుండగనే తల్లి శిశువునకు అధ్యాపకత్వము వహించినచో అట్టి శిశువు అత్యద్భుతముగ పరిణామము చెందగలడు. ఇట్టి పవిత్రమగు విషయములకు ఆధునిక కాలమున అవకాశము కరవైనది.

పిల్లల మనోగత మెరిగి వారిని చక్కగ తీర్చిదిద్దని తల్లులు, వారి పెరుగుదలకు సరియగు కృషికి, ప్రాథమికముగ నిర్వహించని తల్లులు దయ్యములే అగుచున్నారు. సహనము లేక పిల్లలను సమకాలీన అనాగరిక వేషభాషలకు, ఆహారపు అలవాట్లకు గురిచేయు చున్న తల్లులు జాతి ద్రోహులని తెలియవలెను. అసురమాతలని తెలియవలెను.

87

## మహాత్ముల బృందము

కవాటములు తట్టుట మా పని. వినికిడిని గమనించి కవాటములు తెరుచుకొనునట్లు చేయుట మీ పని. మేము తట్టు కవాటములు, మీరు తెరువవలసిన కవాటములు హృదయమందే యున్నవి. మీ హృదయ కవాటములు తెరువబడినచో దూరప్రాంతములు, దూర దేశములు, రమణీయమగు ప్రదేశములు, దూరదేశవాసులు మీకు పరిచయమై జీవితపరిధి అపరిమిత మగును. మహాత్ముల సాన్నిధ్యము లభించును. మహాత్ము లందరును తాము శంబళ నుండి వచ్చినామని పలుకరు. కాని వారి వాక్కు, చేత జీవులకు అనిర్వచనీయము, ప్రశాంతత కలిగించును. మానవుల యందు సంక్షోభ మెక్కువగ నున్నపుడు వారెక్కువగ మానవుల మధ్యనే సంచరింతురు.

ఇహమే సమస్తముగ జీవించువారికి అదనపు దృష్టి నేర్పరచుటకే మహాత్ములు అను నిత్యము ప్రయత్నింతురు. మహాత్ముల బృందముల యొక్క ఉనికిని విశ్వసించువారు వారి సాన్నిధ్యమును తప్పక పొంది కృతకృత్యులు కాగలరు.

88

## బడిపంతులు

**మా**నవ జాతికి మహోత్కృష్టమగు సేవ చేయగలిగిన వారు బాలబాలికల ఉపాధ్యాయులు. బాలబాలికలకు ప్రతినిత్యము మానవుని ఔన్నత్యము, హోదా, హుందాతనము, బాధ్యత గుర్తు చేయుట ఉపాధ్యాయుల బాధ్యత. చిన్నతనముననే మానవత్వపు విలువలు బాలబాలికలలో ఏర్పరచుట వలన వారి జీవితములు సంస్కారవంతమగు మార్గములలో పయనించును. పిల్లలకు పరిశ్రమ యందలి విలువ బాగుగ బోధింపవలెను. పరిశ్రమించు వారిని ప్రపంచ మాదరించును. పరిశ్రమ వలననే సంఘమున ఉత్తమ కార్యములు నిర్వర్తింపబడును. పరిశ్రమ వలననే మనసేంద్రియ శరీరములు చురుకుగ నుండును.

ఉపాధ్యాయుల జీవితము అతి సామాన్యమైనను, వారు నిర్వర్తించు వృత్తి అసామాన్యము. వారు భావిపౌరులకు చక్కని ఆశయములను ఏర్పరచుకొను స్ఫూర్తిని ప్రసాదించగలరు.

బాలబాలికలకు తేనెటీగలవలె పరిశ్రమించి, జ్ఞానము ప్రోగు చేసుకొని, వృద్ధి చెందుడని ఉపాధ్యాయులు బోధించవలెను. తేనెటీగ

తేనెను ప్రోగుచేయుటలో అద్భుతముగ శ్రమించును. మకరంద మెక్కడున్నదో అచ్చటికెల్ల చనును. అట్లే విద్యార్థులు అహర్నిశలు పలువిధములుగ జ్ఞాన సముపార్జన చేయుడని బోధింపవలెను.

89

## తపన

**జి**జ్ఞాసువునకు దశదిశలు జ్ఞాన ద్వారములే. జ్ఞాన మే దిశ నుంచి యైనను లభించ వచ్చును. తూర్పు దిక్కు నుండియే జ్ఞానము రావలెనని ఆంక్ష యేమియు లేదు. మత గ్రంథములే జ్ఞాన మిచ్చునను భావన సంకుచితము. జీవనమున జ్ఞాన మెచటినుండియైనను వ్యక్తము కావచ్చును. జిజ్ఞాసువులకు జ్ఞానము ప్రధానముగాని మాధ్యమము కాదు. ఎవరు చెప్పిరను దానికన్న ఏమి చెప్పిరి అనునది ముఖ్యము. అంతరాత్మకు ప్రేరణ, వికాసము నిచ్చునది జ్ఞానము. శాస్త్ర ప్రమాణము కొరకై వెతుకులాడుట కన్న స్ఫూర్తి నందించు జ్ఞానము ననుసరించుట మిన్న. పలువురి అభిప్రాయములతో సంబంధములేక అంతరాత్మ ప్రబోధమును అనుసరించుట వలన జ్ఞాన మార్గమున సాధకుడు సులభముగ సాగును.

దొరికిన దమృతమైనపుడు అది దేవత లిచ్చిరా, లేదా అనునది ప్రధానము కాదు. సుజ్ఞానము లభించినపుడు అంగీకరించి అనుస రించుట ప్రధానము కాని, ప్రమాణములకై వెదకుట అజ్ఞానము. జ్ఞాన సముపార్జనమునకు ప్రాణములను కూడ తెగించి దూరదేశము లేగినవారు, పర్వత శ్రేణులయందు ప్రవేశించినవారు ఎందరో కలరు. జ్ఞానమునకై తపన లేనివారికి జ్ఞానము లభింపదు.

## 90

# సహకారము

నవజీవనము కోరుచున్నావా? సహకరించుట నేర్చినచో క్రమముగ జీవనము నవజీవనమై ఆనందము నిచ్చును. సహకార మను సద్గుణము నవజీవనమునకు ద్వారములు తెరచును. సృష్టి యందు సహకారము అత్యంత విలువైన సుగుణము. సత్పురుషులకు సహకరించి సన్మార్గమును పొందినవా రెందరో కలరు. శ్రీరామునికి సహకరించి అడవి మనిషి గుహుడు, అడవి పక్షి జటాయువు, అడవి కోతి సుగ్రీవుడు, అసురజీవి విభీషణుడు మహోన్నత స్థితిని పొందిరి.

తమకై తాముగ పొందలేని ఉన్నత స్థితులను మహాత్ముల సేవద్వారా పొందుట సహకారము వలననే సాధ్యము. నీకన్న జ్ఞానము నందు, గుణమునందు పెద్దయగు వారితో నీవు సహకరించుట, నీ ఉన్నతికి కారణమగుట, సహకరింపక అహంకరించినచో అవకాశము కోల్పోవుట జరుగును. ప్రకృతి అందించు అవకాశము లను ఉపేక్షించిననాడు ప్రగతి దుర్లభమై యుండును. సత్పురుషుల సమాశ్రయము, వారి కార్యములందు సహకరించుట, వారి ఆశయములను పరిపూర్తి గావించుటలో పరిశ్రమించుట, ఇత్యాదివి జీవులను కృతకృత్యులను చేయును. సహకరించుట నేర్వని వానికి జీవితము నిస్తేజమై, బరువై నిలచును.

# 91

## కార్యోన్ముఖత

**మా** శ్వేతబృందమును బాహ్యముగ గౌరవించువారు చాలా మంది యున్నారు. కాని అంతరంగమున మమ్ములను, మా బోధలను అనుమానించువారు, తప్పించుకు తిరుగువారు మెండు. త్రికరణ శుద్ధి యనునది సత్సాధనకు పునాదిరాయి. త్రికరణశుద్ధి లేనివారు పరము నెట్లూ చేరరు. ఇహమున కూడ సుఖ ముండదు.

శ్వేతబృందము ఒక వానప్రస్థాశ్రమము కాదు. వృద్ధాశ్రమమూ కానేకాదు. అది ఒక క్రియాశక్తి కేంద్రము. ఇచ్ఛా జ్ఞానములు నిరంతరము దివ్యప్రణాళిక ననుసరించి క్రియారూపమును ధరించు కురుక్షేత్రము. బృందముచే నిర్వర్తింపబడు కార్యముల వలన ఎన్నియో భౌగోళిక పరిష్కారములు కలుగుచుండును. లోక శ్రేయస్సు నిర్వహింప బడుచుండును. బహుముఖమగు కార్యములు జరుగుచున్నను బృంద సభ్యులు ఏకోన్ముఖముగ దివ్య సంకల్పమును నిర్వర్తించు చుందురు. ముక్కుకు తాడు వేసి, కళ్ళకు గంతలు కట్టి గుఱ్ఱము నెట్లు నడిపింతురో అట్లు స్వచ్ఛందముగ మేమందరము దీక్షాయుతులమై సృష్టి సంకల్ప మును బహు విధములుగ నిర్వర్తింప జేయుదుము. పరిశ్రమ, వ్యవసాయము మా పట్టుకొమ్మలు. క్రమశిక్షణతో కూడిన మా కార్యశక్తి ఎట్టి ఆకర్షణలకు వికర్షణలకు లోను కాదు.

## 92

# లోకహితము

**భూ**గోళముపై ఏదో ఒక చోట కొందరు జీవులు దురదృష్ట పరిస్థితులలో గోచరించుచునే యుందురు. అట్టివారికి మీ నిత్య ప్రార్థనలయందు హితము కోరుడు. ఇతరుల కష్టము తమ కష్టముగ భావించుట ఒక నూతన సంస్కారము నేర్పరచును. సోదరభావమును జనింపజేయును. మా బృందమున మేము చేయు నిత్యకృత్యములలో ఇది ఒకటి. తిండి, బట్ట, కనీసపు ఆరోగ్యము లేనివారి గూర్చి భావించి వారికి హితము జరుగవలెనని ప్రార్థించుటలో ఔన్నత్య మున్నది. అట్టి ప్రార్థనల వలన విపత్తున నున్న జీవులకు సహకారము పొందు సౌకర్యమున్నది. బాధపడుచున్న జీవులు ఎవరో, ఎచ్చట నున్నారో తెలియ నవసరము లేదు. అట్టి వారిని గూర్చి చేయు ప్రార్థనలు ఆకాశమును చేరి అచట నుండి అవకాశములుగ దీనులకు చేరును. అట్టి భావముల నన్నిటిని మేము స్వయముగ శక్తిమంతము చేసి, చేరవలసిన చోటుకు చేర్తుము. భూగోళము నాలుగు దిక్కుల నుండి ఇట్టి భావము లుత్పన్నమైనచో లోకహితము చక్కగ నిర్వర్తింప బడగలదు. ఇట్టి యజ్ఞమున చేరుటకు దైనందినముగ నిర్ణీత సమయ ములో ప్రార్థన సలుపవచ్చును. నిలకడగ అట్లు ప్రార్థించు వానిని మేము గుర్తించుచు, సహకరించుచు యున్నాము.

93

## ఉత్సాహ సూక్తము

**కొం**దరికీ భూమి మరుభూమి (స్మశానము), వేదనా నిలయము, దుఃఖములకు ఆలవాలము, పాపములకు పరిష్కారము. భూమిపై పుట్టుటయే దురదృష్టముగ భావింతురు. మరికొందరికీ భూమి స్వర్గ తుల్యము, నవజీవనమునకు ఆవాసము, సృజనాత్మకతకు ప్రయోగశాల, పూర్ణ జీవనమునకు మెట్టినిల్లు. వీరికి భూమియొక పుణ్యనిలయము. బ్రహ్మ కల్పనలే ఉత్తమోత్తమము. ఇందలి నదులు, పర్వతములు, లోయలు, పంటభూములు, పండ్లచెట్లు మరియెచ్చటను కానరాని అద్భుత కల్పనలు.

జీవుల దృక్పథములబట్టి భూమి స్వర్గము కావచ్చును, నరకమూ కావచ్చును. సమతుల్యమగు యోగక్షేత్రము కావచ్చును. దృక్పథమును బట్టియే అవకాశములను అందిపుచ్చుకొనుట, జార విడుచుట కూడా జరుగును. భూమిపై కృతకృత్యులు కావలెనన్నచో జీవుడు తానుగ ఉత్సాహమును ప్రతిపాదించటము వలన, ఉత్సాహము జీవితమును తేలిక పరుచును. నిరుత్సాహము కృంగదీయును. ఉత్సాహమునకు కారణము అక్కరలేదు. ఉత్సాహము కొనితెచ్చుకున్నచోట అవకాశము మెండై నిలుచును. నిరుత్సాహ మున్నచోట అవకాశమే గోచరింపదు.

పక్షులు జీవులలో అత్యంత ఉత్సాహము కలవిగ గోచరించును. అవి అందరికన్న ముందుగా, అందరి కన్న ఎత్తుగా ఉత్సాహముతో విహరించు చుండును. ఉదయమెంత ఉత్సాహముతో గూళ్లనుండి దూర దేశములకు ఆకాశమున జనునో సాయంత్రం అదే ఉత్సాహ ముతో తమ గూళ్లను జేరును. పక్షి మాత్రపు ఉత్సాహము, జీవునకు ప్రతిరూపమైన మానవునకు లేకుండుట మా బృందమంతయూ కలత పడుచుండును.



94

## ధ్యానము - వెలుగు

ఎంత ఎక్కువగ వెలుగుండునో దాని పొలిమేర్లలో అంత ఎక్కువగ చీకటి యుండును. అచ్చటి చీకటి వెలుగు వలన ఏర్పడినది కాదు. వెలుగు లేమియే చీకటి. చీకటులను నిర్మూలించుటకు వెలుగు వేగముగా పయనించు చున్ననూ, చీకటిని పరిపూర్ణముగ నిర్మూలించ లేదు. కాని సత్యమొకటి యున్నది. వెలుగున్న చోట చీకటి యుండును. తానున్న చోట వెలుగున్నచో తనకి చీకటి యుండదు కదా! తానే వెలుగని తెలిసినచో తనయందు చీకటి యుండుటకు అవకాశ ముండదు. తాను వెలుగని తెలిసిన చోట చీకటి, భయము కూడ ఉండవు. అనుమానము, సందేహము కూడ నుండవు.

ఉదయమే సూర్యుని చూచి "ఆ సూర్యుడు, నేను ఒకటే. అతని యందు వెలుగెట్లు ప్రసరించు చున్నదో నా యందు అట్లే ప్రసరించు చున్నది. నా యందలి ఎరుకయే వెలుగు. నే నా ఎరుక యందే వశింతును. నా ఎరుక యను వెలుగు, నేనూ ఒకటియే." ఇట్టి భావము మీకు పరిపుష్టి నిచ్చును. ఉత్సాహము నిచ్చును. శక్తిని ఇనుమడింపజేయును. అతి ప్రాచీన కాలము నుండి చేయబడుచున్న సూర్యోపాసనము యొక్క అంతరార్థ మిదియే. సూర్యోపాసనము

చేయువారు హృదయమున సూర్యుని భావించుచూ సూర్యకాంతి దేహమంతటనూ వ్యాప్తి చెంది యున్నట్లుగా ధ్యానింపవలెను. అట్టి ధ్యానమే గాయత్రి ధ్యానము. అర్థరహిత ధ్యానముల వలన ప్రస్తుతము మానవులు బలహీనులై యున్నారు. ధ్యానములు, ప్రార్థనలు అర్థవంత ముగా యుండును. వెలుగు ధ్యానమును మాని ఇతర రూప ధ్యానము చేయుట వలన ప్రయోజనము లేదు.

95

## హృదయ తత్త్వము

హృదయ తత్త్వమున అహంకారమునకు తావులేదు. స్వార్థ చింతనకు తావులేదు. స్వ పర భేదమునకు తావులేదు. ఆత్మస్తుతికి, పరనిందకు తావులేదు.

సమభావము, సమదృష్టి, న్యాయము, ధర్మము, కరుణ, దయ, క్షమ, ప్రేమ యిత్యాది ఉత్తమ గుణములకు నెలవు హృదయము.

తర్కమునకు, వాదమునకు, లౌక్యమునకు హృదయము నిలయము కాదు. ఈ భావములు హృదయములపై నేర్పడు మేఘముల వంటివి. తర్కమునకు లౌక్యమునకు అందనిది హృదయ మగుటచే మహాత్ములను సామాన్యులు అవగాహన చేసుకొనలేరు.

హృదయస్థుని యొక్క క్షమాగుణము కేవలమతని సత్కార్యము లతో బేరీజు వేయుట కష్టము. అమితమగు కారుణ్యము కారణముగ క్షమ చూపునే గాని ఎదుటివారు క్షమార్హులు కారు. హృదయము నర్థము చేసుకొనువారు హృదయ మందుండువారే. ఇతరులకు హృదయస్థు లర్థము కారు.

96

## మార్గము

సర్వసాధనల పర్యవసానము పవిత్ర హృదయమును పొందుటకే. నిర్మల హృదయము అరుదుగ కన్పట్టు చుండును. శతాబ్దమున కొకరు కూడ నిర్మల హృదయులు గోచరింపరు. తమను తాము నిర్మల హృదయులుగ భావించుట భ్రమయే. నిర్మల హృదయులకు తమను గూర్చిన భావనయే యుండదు.

కరుడుగట్టిన అహంకారము హృదయ నైర్మల్యమునకు అడ్డు గోడ. దట్టమగు గోడల నడుమ హృదయము బిగింపబడి యున్నపుడు అట్టి హృదయమును పరిష్కరించుట కష్టసాధ్యము. మానవుని పశు స్వభావము మదముగ హృదయము చుట్టును పేరుకొని యుండును. ఆ మదము కరుగవలె నన్నచో ప్రకృతి యందు ఒక్కటియే ఉపాయ మున్నది. దీర్ఘకాలము తీరని కష్ట నష్టములలో నలుగుట వలన మదమంతయు కన్నీటి రూపమున కరుగును. దట్టమగు గోడలు బీటలు వారును. పశుత్వము నుండి మానవత్వములోనికి ఉద్ధరింప బడును. మానవత్వము ప్రాతిపదికగ హృదయ నైర్మల్యమునకు పునాదు లేర్పడును. సాటిజీవి కష్టనష్టములను గ్రహింప లేనివాడు హృదయ మును మలముల నుండి ఉద్ధరించలేడు. ప్రతివాని కష్టము తన

కష్టముగ భావించి, అందుండి వానిని ఉద్ధరించుటకు శక్తి వంచన లేక ఉపాయముతో కృషి చేయువాడు క్రమముగ నిర్మల హృదయమును పొందును. అట్టి ప్రయోగమును తనపై తాను నిత్యము చేసుకొనుట నిర్మల హృదయమునకు దారి.

97

## సహనము

విద్యలు మనోవికాసమునకే కాక హృదయ వికాసమునకు కూడ తోడ్పడవలెను. హృదయ కల్మషములను నిర్మూలించి, హృదయ నైర్మల్యమును ఆవిష్కరించునదే నిజమగు విద్య.

ఆధునిక కాలమున విద్యావంతులలో ఎక్కువమంది సహనము లేనివారై గోచరింతురు. అసహనము అవిద్య. సహనము అమృత తుల్యమగు విద్య. సహనము లేనివాడు సంస్కారము లేనివాడే. ఎంత అసహన ముండునో అంత కుసంస్కారియై మానవుడుండును.

మానవుడు నిజముగ పెరుగదలచినచో హృదయ భావమును పెంచుకొనుచు పోవలెను. విశాలహృదయము దివ్యలోకములకు ద్వారములు తెరచును. అట్టివారి హృదయములనుండి దివ్యత్వము భూమిపై అవతరించు అవకాశము మెండుగ నుండును. దూర ప్రాంతమందు జరిగిన ప్రాణిహింస, ప్రాణ నష్టము వినినంతనే మనసు తల్లడిల్లినచో అట్టివాడు లోకహితు డగుటకు పాత్రుడగును. అట్టివాని ప్రార్థనలు హితము కూర్చును. అట్టి లోకహితుడే ఉత్తమ పరిణామము నకు అర్హుడు.

98

## మా యజ్ఞము

**త**మకు తాము జీవించువారు పరిమిత జీవనులై యుందురు. జీవనమున తమను తాము మరచినవారు అపరిమితు లగుదురు. వారి నుండి అపరిమితముగ లోకహిత కార్యములు వ్యక్తమగు చుండును. అట్లు వ్యక్త మగునపుడు తమను తాము హితకార్యములకు సమర్పించుకొనుటయే కాని పరిమితులు నేర్పరచరాదు.

తమను తాము ఎంతగ మరతురో అంతగ వారి హృదయముల నుండి ప్రకృతి తనదగు కార్యములను నిర్వర్తించుకొను చుండును. అట్టివారి హృదయములను వాహికలుగ నెంచుకొని, బృహత్తరమగు కార్యములను నిర్వర్తించు చుండును. ఇట్టి వారి వలననే దివ్య ప్రణాళిక నిర్వర్తింపబడుచు నుండును.

ప్రస్తుత కాలమున పుష్టికరమగు హృదయములు తక్కువ. పుష్టికరమగు దేహములు ఎక్కువ. మానవజాతి యందు పరిపుష్టమగు దేహములు కలవారు కోకొల్లలు. కాని సంస్కరింపబడిన హృదయములు గలవారు బహుకొద్ది మాత్రమే. హృదయమును పవిత్రీకరించుటయే యజ్ఞముగ మైత్రేయీ సంఘము అహర్నిశలు కృషి సలుపుచు నున్నది.

# 99

## పని రహస్యము

మనస్సునకు అలసట యున్నది. హృదయమునకు అలసట లేదు. కనుకనే హృదయముతో పనిచేయువారి వైవిధ్య పరిశ్రమ మనస్సుతో పనిచేయు వారికి వీలుపడదు. అలసట ఎరుగదు గనుకనే నిరంతర స్పందనముతో జీవుని దేహమున నిలిపి అనుభవజ్ఞుని చేయు చున్నది. హృదయస్థుల పనితనము పరిసరముల జీవన నాణ్యతను పెంచును. పని పరిధులు నిరంతరము పెరుగుచు నుండును. తాను కర్తనను భావము కూడ క్రమముగ అదృశ్య మగును.

మనస్సెంత ఎక్కువగ పనిచేయునో అంత అలసట భావ ముండును. తాను కర్తనను భావము కూడ అధికమగు చుండును. పని తక్కువ, పని చేయు చున్నానను భావ మెక్కువగుచు, జీవనము భ్రమ భ్రాంతులతో లోనగును. విసుగు విరామము పెరుగుచుండును. తన పని ఎవ్వరును గుర్తించుట లేదను దుర్బలత్వము కూడ చోటు చేసుకొనును. పరిశ్రమ యందు తనను తాను మరచిన వానికే హృదయ కవాటములు తెరుచుకొనును.

100

## దేహము - హృదయము

ప్రస్తుత మానవుడు పరిశుద్ధమగు హృదయము కన్న పరి శుద్ధమగు దేహము కొరకై తపించు చున్నాడు. మనో నైర్మల్యము, హృదయ నైర్మల్యము మృగ్యమై దేహ నిర్మలత్వము పెంచుకొను చుండుట వలననే మానవజాతి తిరోగతి చెందుచున్నది.

హృదయమున జీవుడున్నాడు. జీవుని యందు ఈశ్వరు డున్నాడు. కనుక హృదయమును పవిత్రముగ నుంచుకొనుటవలన జీవుడు శాంతి, సౌఖ్యము పొందును. హృదయము, మనస్సు మలినమై దేహము మాత్రము పవిత్రీకరించుకొనుచు జీవించుట ప్రస్తుత నాగరికతలో మెండుగ గోచరించును. బలమైన సైనికు లెందరున్నను వారిని నడిపించుటకు సమర్థవంతుడగు రాజు, సేనాని ఎట్లవసరమో అట్లే మనో హృదయ నైర్మల్యము దేహమున కవసరము. రాముని దండు బలహీనమైనను రాముడు బలమైనవాడు గనుక విజయము పొందెను. జీవన యాత్ర విజయ మందుటకు హృదయ నైర్మల్యమే ప్రధానము.

101

## పరమౌషధము

దేహారోగ్యము కొరకై అనేకానేక పరిశోధనలు జరుగుచున్నవి. మానవ హృదయము మేల్కొనినచో మానవదేహ ఆరోగ్యమును గూర్చి అంత తపన చెందనవసరము లేదు. వైద్య రంగమున హృదయమును గూర్చిన అవగాహన కేవలము గుండెకాయకే పరిమితమై యున్నది. కామ క్రోధ రాగ ద్వేష మద మాత్సర్యములు హృదయమును నిత్యము కలుషితము చేయుచుండగ ఆరోగ్యము పదిలముగ ఎట్లుండును?

అహింస, సత్యము, దొంగబుద్ధి లేకుండుట, ఊరకే సంపదలను పొందవలెనను ఆశపడుట, నియతిలేని స్త్రీ పురుష కామము జాతియందు ప్రబలమై యుండగ, ఆరోగ్యమును గూర్చి తపన చెందుట అవివేకము.

పరిశుద్ధ జీవనమునకు పరిశుద్ధ హృదయమే వేదిక. పరిశుద్ధ ఆత్మ గూర్చి బోధలు చేయుట కన్న భావన చేయుట, తదనుగుణమగు ప్రవర్తన మేర్పరచుకొనుట వ్యక్తి కర్తవ్యమై యున్నది. తనకు తానుగనే ప్రయత్నముతో పరిశుద్ధుడగుట మార్గము.

102

## పవిత్రీకరణము

హృదయము కలుషితముగ నున్నపుడు భావము కలుషితము గనే యుండును. హృదయ నైర్మల్యము పొందుటకు ఋషులు ఓంకారము నందించిరి. ఓంకారము నిత్యము అనుసంధానము చేయు జీవునియందు కల్మషములు పారద్రోలబడును. సిద్ధి పొందిన యోగులు సైతము ఓంకార మంత్రమును నిత్యము ఉచ్చరించి ధ్యానింతురు. ఓంకార ముచ్చరించునపుడు తనలోని కల్మషము లన్నియు బహిష్కరింపబడుచున్నట్లుగను, ఇంద్ర ధనుస్సువలె క్రమముగ కాంతు లేర్పడు చున్నట్లుగను భావింపవలెను. చివరకు తెల్లని కాంతి మూలాధారము నుండి సహస్రారము వరకు బ్రహ్మదండమున ఏర్పడినట్లు భావన చేయవలెను. అటుపైన ధ్యానము సాగింపవలెను.

ఓంకార ధ్వని నీరసముగ కాక బలముగ నుచ్చరింపబడ వలెను. దేహమందు విద్యుత్తరంగములు సున్నితమగు ప్రకంపనము లుగ సుషుమ్న యందు మొదలై దేహమంతయు వ్యాప్తి చెందుచున్నట్లు భావింపవలెను. ఇట్టి ఓంకారము హృదయమును, మనస్సును, ఇంద్రియములను, శరీరమును కూడ పవిత్రీకరించును.

103

## ఔషధ సేవనము

రోగికి వైద్యమునందు విశ్వాసముండవలెను. అట్లే సాధకునకు బోధన యందు విశ్వాసముండవలెను. విశ్వాసము లేని రోగి ఔషధము లను క్రమబద్ధముగ స్వీకరింపడు. సొంత నిర్ణయములు చేయుచు నుండును. అట్లే సాధకుడు కూడ బోధనముల నాచరింపక అందు తెలిపిన మాహాత్మ్యములను ఆశించుచు నుండును. పరమగురువులను చూచుటకు ఆశపడుటకన్న వారి బోధనలను ఆచరించుట శ్రేష్ఠము.

ఔషధము శ్రద్ధగ స్వీకరించిన వానికి ఆరోగ్యము లభించినట్లే, బోధనల నాచరించు వానికి సాన్నిధ్యము లభించును. అటుపైన అవసర మును బట్టి దర్శనము కూడ లభింపవచ్చును. కనుక ఆచరణయే దివ్య సాన్నిధ్యమునకు, దర్శనమునకు మూల సూత్రమై యున్నది.

సద్గురువు లెప్పుడును సాధ్యపడునట్లే సాధనల నిత్తురు. దానిని క్రమము తప్పక నిర్వర్తించుట ఎదుగుదల కోరువానికి తప్పనిసరి. అంతరాయముల నధిగమించి, క్రమమున బోధనను దినచర్య యందు ప్రవేశింపజేసి నిర్వర్తించుటొక్కటే మార్గము.

(104)

## లోక ద్రోహి

గమ్యములేని ప్రయాణము, ప్రయోజనములేని జీవనము, తినబడని ఆహారము, వాడబడని వస్తువు వ్యర్థములు. అంతేకాక మోతబరువు కూడ. తీరి కూర్చొని ఊహించు వారి వలన ప్రయోజన మేమున్నది? సార్థకమగు కార్యము చిన్నదియైనను నిర్వర్తించుట ప్రధానము. దానివలన బుద్ధి స్థిరమై యుండును. ఉడత సేతువును కట్టుటకు చేసిన ప్రయత్నము స్వల్పము. కాని సంకల్పము అద్భుతము. ఎట్టి శ్రమ చేయక కాలమును వెళ్ళబుచ్చువాడు తనకు తాను బరువు. అంతేకాక లోకమునకు కూడ బరువు.

లోకమంతయు కురుక్షేత్రమై యుండగ కర్మము నాచరింపని వాడు లోకద్రోహియే యగుచున్నాడు. శరీర యజ్ఞము నుండి బ్రహ్మ యజ్ఞము నాచరించుట మేలు. శ్రమదానము నుండి విద్యాదానము వరకు భౌతిక ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ ఆనందమయ లోకములలో యజ్ఞము నాచరించవలెనేకాని, ఏమియు చేయక నుండు వాడు లోకద్రోహి.

(105)

## హృదయ శక్తి

నిర్మల హృదయము ఓంకారము వలన ఏర్పడుచున్నదన వచ్చును. నిర్మల హృదయము నేర్పరచి ఓంకారము అందు వసించును. తత్కారణముగ ఇచ్ఛా జ్ఞాన క్రియలు జీవుని హృదయము నుండి వ్యక్తమగుచుండును. పవిత్ర హృదయము కేవలము ప్రేమ, జ్ఞానములను మాత్రమే ప్రసరింపజేయునని భావింపరాదు. ఓంకార మున కావాసమగుటచే ఇచ్ఛా క్రియలు కూడ వ్యక్త మగుచుండును. భగవదేచ్ఛ జీవునకు కలుగుచుండగ భగవత్ కైంకర్యముగ కార్యములు నిర్వర్తింపబడు చుండును. ప్రేమ జ్ఞానములు భాషణమునందు, కార్యముల యందు వ్యక్తమగు చుండును.

ఓంకారము త్రిశక్త్యాత్మకము. కనుక ఓంకారము నుచ్చరించు సాధకుడు నిత్యము త్రిశక్తులను ఆవాహనము చేయుచునే యుండును. అవతరించిన త్రిశక్తులు దివ్యకార్యమును నిర్వర్తించుచు నుండును. కాలమును బట్టి, దేశమును బట్టి సప్తకిరణముల సంకల్పములు హృదయమున ఆవిర్భవించి జీవుని దివ్యకార్యమున నిమగ్నము చేయును. ఓంకారము సర్వశక్తిమంతము. అది దేవునికిని జీవునికిని గల వారధి.

## 106

## అభయము

సాధకుడు పవిత్ర హృదయమును పొందెనా లేదా అను ప్రశ్నకు తనయందే సమాధానమున్నది. తాను నిర్మలుడైనచో సత్వగుణము ప్రధానముగ ఏర్పడి యుండును. సత్వగుణమునకు ప్రధాన లక్షణము నిర్భయత్వము. దానినే 'అభయము' అని శ్రీకృష్ణుడు వర్ణించినాడు. పవిత్ర హృదయమున భయమునకు తావులేదు. నిపుణుడైన నావికుడు జలప్రవాహము అల్లకల్లోలమైనను నావ సురక్షితముగ పయనించుటకు వలసిన ఓర్పు నేర్పు చూపును. అట్లే నిర్మల హృదయుడు కూడ.

మానవజాతి యందు మహాత్ములందరును నిర్భయులే. హరిశ్చంద్రుడు, నలుడు, రాముడు, యుధిష్ఠిరుడు యిత్యాది వారు నిర్భయులు. గౌతముడు, ఏసుక్రీస్తు, సోక్రటీసు, చాణక్యుడు, పైథాగొరస్, ప్లాటో యిత్యాది వారి జీవితములందు కూడ నిర్భయత్వము గోచరించును. సత్యమునకై, ధర్మమునకై ప్రాణములను సమర్పించు వారందరును నిర్భయులే.

నిర్మల హృదయము పొందుటకు, నిర్భయత్వము కలుగుటకు ఓంకారము నాశ్రయింపుము. సుదీర్ఘమగు ఓంకారము లోపల బయట కూడ పవిత్రీకరించును.


## 107

# వృద్ధి

**భా**వ పరంపరలను పునఃపరిశీలనము గావించుటకు ప్రతిదినము నిద్రించుటకు ముందు సమయ మేర్పరచుకొనవలెను. దినమంతయు తనయందేర్పడిన భావము, భాష, చేత తన ఎరుకను నీరసింప చేసినదా? లేక బలము కూర్చినదా? భావ ప్రవాహమును పరిశీలించుకొనినచో ఇది తేటతెల్లమగును. ఎరుకను పెంపొందించు భావములను భాషయందు, ఆచరణ యందు ప్రవేశ పెట్టుటయే సాధనము. ఎరుకను పెంపొందించు కొనుచుండగ జీవుని ప్రజ్ఞ వికాసము చెందుచుండును. కనుక దివ్య భావములను భాషయందు, చేతయందు నిత్యము నిర్వర్తించుట నిజమగు సాధన.

అట్లుకాక నిత్య నైమిత్తిక కర్మలకే పరిమితమైనచో గానుగెద్దు జీవితము అగును. నిద్ర లేచుట, శుచి యగుట. యాంత్రికముగ ప్రార్థన చేయుట, ఉపాహారము గొనుట, తీరుబడి లేక చేసిన పనులనే చేయుచుండుట, అనగా ఉద్యోగమునకు వెళ్ళుట, వ్యవసాయ వ్యాపారములు చేయుట, మరల మధ్యాహ్నము భోజనము చేయుట, సాయంత్రము వరకు వృత్తి ఉద్యోగ వ్యాపారములలో మునిగి, అటుపై

తేలి ఇల్లు చేరి తిని పరుండుట. ఇట్టి నిత్యకర్మలు ఎట్టి వృద్ధియు నీయవు. నీకు వృద్ధి కలిగించని కార్యములలో నిమగ్నుడవై నర జన్మమును వృథా చేసుకొనుట సంపూర్ణమగు అజ్ఞానము. వృద్ధికై నిత్యము యత్నించుట సత్సాధన.




108

## కృతస్మర - క్రతుస్మర

**జీ**వులు వృద్ధి చెందుటకే సృష్టి యజ్ఞము. అట్టి యజ్ఞ నిర్వహణ మున నిరంతరము అనుస్యూతముగ ఊర్ధ్వలోకముల నుండి భూమికి, భూమిజీవులకు ప్రచోదనము గావింపబడుచున్నది. ఇది సత్యము. దీని యందు మానవజాతిని మేల్కొల్పజేయుటకే మా ప్రయత్నము. అనవరతము భూమి కందింపబడుచున్న ప్రచోదనము మేము నిత్యము ఆవాహనము గావించుకొని, పరితుష్టులమై భూమిపై సద్బోధ, సత్కర్మాచరణము గావించుచు నున్నాము.

ఇట్టి దివ్య ప్రచోదనము అనునిత్యము సాగనిచో భూమి జీవులకు వృద్ధి చెందు అవకాశమే లేదు. ఇట్టి నిత్య నిరంతర దివ్య అవతరణము నందు సాధకుడు ఉన్ముఖుడై యుండవలెను. మేమును సదా ఉన్ముఖులమై యున్నాము. కనీసము మా ఉనికిని నిత్యము గుర్తించినను మానుండి, మేము పొందిన ప్రచోదనము లభించును. అనంత ప్రకాశమునకు వాహికలుగ నుండుటయే మా పని. మాతో నిత్యము అనుసంధానము చెందువారు, వారి జీవితములను క్రతుబద్ధముగ నిర్వర్తించుకొనగలుగు చున్నారు. క్రతుబద్ధమగు

కార్యములు కర్తకు సిద్ధించును. వృద్ధిని ఇచ్చును. "కృతస్మర - క్రతుస్మర" కార్యములను క్రతుబద్ధముగ నిర్వర్తించుటకీ సంస్కృత వాక్య మీయబడినది. దీని ననుసరింపనివారు కాలచక్రమున గతి తప్పినవారై యుందురు.



## 109

# నేత్ర శిక్షణ

నీ చూపును, అవగాహనను పెంచుకొనదలచినచో ఉచ్ఛ్వాసను బలముగ, దీర్ఘముగ, శాంతముగ, సున్నితముగ, లోతుగ నిర్వర్తించుట అభ్యాసము చేయుము. చూచినపుడు పరికించి చూచుట కూడ నభ్యాసము చేయుము. పరికించి చూచుచు, అవగాహన చేసుకొనుటకు ప్రయత్నింపుము. ఉన్న ప్రపంచముననే సూక్ష్మ ప్రపంచము కూడ నుండుటచే అది క్రమముగ గోచరము కాగలదు. పై తెలిపిన అభ్యాసమున క్రమముగ హృదయముతో చూచుట ఆరంభమగును. హృదయముతో చూచుట అభ్యాసమైనచో నీ చూపు బాణమువలె ఇతరులను పరికించుట, అవగాహనము చేసుకొనుట జరుగును.

చూచుట నొక క్రతువుగా నిర్వర్తించుకొను విధానమున్నది. ఇట్లు చూచువారికి సున్నితము, అదృశ్యము అగు విషయములు దృశ్యమై మార్గము సులభమగును. ఓపిక లేనివారు, ఓర్పు లేనివారు, బాధ్యత పడనివారు ఇట్టి విద్యలను నేర్వలేరు. స్వచ్ఛందముగ తమకు తాము, మా బోధన లాధారముగ శిక్షణ నిచ్చుకొనువారే నిజమగు సాధకులు. అగ్నితత్వము అధికముగ నున్నవారికి నేత్ర విద్యలన్నియు సులభ సాధ్యము.

110

## సేవ - సమర్థత

విషమును స్వీకరించుచు అమృతమును పంచువారు నిజమగు శివభక్తులు. దేవదానవులకు అమృతము సిద్ధించుటకై విషమును మ్రింగినవాడు శివుడు. లోకుల పాపములను కడుగుచు, వానిని సంస్కారవంతులుగ చేయుచు, దివ్యమార్గమున ప్రవేశపెట్టుచు అహర్నిశలు కృషి సలుపువారు నిజమగు లోకహితులు. అట్టివారే మైత్రేయ సంఘ సభ్యులు కాగలరు.

ఇతరుల కష్టనష్టములను భరించుటకు, వారిని బాధలనుండి విముక్తుల గావించుటకు ప్రశాంత హృదయము ముఖ్యము. అట్టి హృదయమున సహనముండును. కనుక ఓర్పు, సహనము లేనివారు హీనులను, దీనులను రక్షించు ప్రయత్నము చేయుట అపాయకరము. ఎలుక గుండ్రాయి ఎత్తినట్లు విఫలమగుటయేగాక అపాయములు కూడ కొనితెచ్చుకొందురు. శివుడు సర్వ సమర్థుడు గనుక విషమును గ్రోలి అమృతమును, అమృత తుల్యమగు అనేక అంశములను సృష్టి యందు సిద్ధింపజేసినాడు. లోక సేవకులకు, సమతుల్యమగు సమర్థత కూడ అవసరము. సమర్థత లేని సేవ మృత్యువునకు కూడ దారి తీయవచ్చును.

111

## సంవాదము

పరమగురువు బోధలు విన్న శిష్యుడొకడు వినమ్రతతో ఇట్లని విన్నవించెను.

శిష్యుడు : గురుదేవా! మీ బోధనల యందు ఉపాసనము, అభ్యాసము చేయవలసిన సద్గుణము లెన్నియో గోచరించు చుండును. ఆ గుణములను పొందవలెనను ఆసక్తి జనించు చుండును. ఎచ్చట ప్రారంభింపవలెనో తెలియుట లేదు. ఆచరణకు ఉపక్రమించులోపున అలసత్వము ఆవరించుచున్నది. నాకా కల్యాణ గుణము లబ్బునను ఆశ సన్నగిల్లు చున్నది.

పరమగురువు : నా కీ కల్యాణ గుణములు కలవు అని భావించు వానికన్న నీవు తప్పక మిన్నయగు వాడవు. నీయందొక యథార్థమగు కల్యాణ గుణమున్నది. యథార్థమును గ్రహించు గుణము నీయందున్న కల్యాణ గుణము. దానినే బాగుగ నీయందు, పరిసరముల యందు గమనించు చుండుము. ఈ మార్గమున యథార్థమగు సత్యమును దర్శింపగలవు.

శిష్యుడు : గురుదేవా! దైవమును ప్రార్థించునపుడు దేనిని కోరుట అత్యుత్తమము?

పరమగురువు : దివ్యమగు వరములు కోరుటకన్న దయాగుణమును కోరుము. దయగల వానికే సత్యము, శాశ్వతము అగు అనుభూతి, ఆనందము యుండును. దయాగుణము దైవమును చేరు మార్గమని తెలియుము. దయగల వానికే సత్యదర్శనము కూడ కలుగును. నీవద్దకు చేరిన వారిని దయతో ఆదరించుట నేర్చుము.

*శిష్యుడు :* గురుదేవా! మీ సలహా సంపత్తి నాకెల్లప్పుడు యుండునట్లు ఆశీర్వదింపుడు.

పరమగురువు : నీవు త్రికరణశుద్ధిగ సలహాను కోరినపుడెల్ల ప్రకృతి యందలి ఏ రూపము నుండియైనను నా సలహా సంపత్తి నీకు లభింపగలదు. ఇది ప్రకృతి యందు యిమిడియున్న ఒక రహస్యము. త్రికరణశుద్ధిగ మార్గమును కోరిన వారికి మార్గము చూపుటకు ప్రకృతియం దనేక వసతులు కలవు. ఇది మరువకుము.

# మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఇతర రచనలు

1. అమనస్కుడు
2. అన్వేషకుడు
3. అసంగుడు
4. అంతర్దర్శన ధ్యానములు
5. హిమాలయ గురుపరంపర

6 మైత్రేయ మహర్షి బోధలు - 1

8. మైత్రేయ మహర్షి బోధలు - 2
9. మరువు మహర్షి బోధలు - 1
10. మరువు మహర్షి బోధలు - 2
11. దేవాపి మహర్షి బోధలు - 1

12 దేవాపి మహర్షి బోధలు - 2

13. ధనకాముని కథ
14. గీతోపనిషత్ - జ్ఞాన యోగము
15. గీతోపనిషత్ - కర్మ యోగము
16. గీతోపనిషత్ - సాంఖ్య యోగము
17. గీతోపనిషత్ - ధ్యాన యోగము
18. గీతోపనిషత్ - కర్మసన్యాస యోగము
19. గీతోపనిషత్ - విజ్ఞాన యోగము
20. H.P.B. ఆత్మసాధనా సూత్రములు

**21.** సంఘనీతి

**22.** శ్రీ లలిత (**10** భాగములు)

**23.** కథాదీపిక

**24.** మన మాస్టరుగారు

**25.** మాస్టర్ సి.వి.వి. యోగము

**26.** శ్రీకృష్ణ నామామృతము

**27.** సాయి సూక్తులు

**28.** శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు

**29.** ఓం

**30.** శ్రీ గురుపాదుకా స్తవము

**31.** భారతీయ సంప్రదాయము

**32.** మాస్టర్ సి.వి.వి. నూతన యోగము

**33.** మాస్టర్ సి.వి.వి. యోగము - కర్మరాహిత్యము


**34.** శ్రీ దత్తాత్రేయ

**35.** అంబరీషుడు

**36.** రుక్మిణీ కళ్యాణము

---

Please visit our website
(www.dhanistha.org.
info@dhanistha.org.) for Copies



దేవాపి మహర్షి చంద్రవంశపు రాజు. ఇతడు భీష్ముని తండ్రి అయిన శంతన మహారాజునకు అగ్రజుడు. ఆ జన్మలో దేవాపి బ్రాహ్మణ ధర్మమును స్వీకరించి తనకు తానుగ కోరి రాజ్యము నుండి బహిష్కరించబడెను. నిజమునకు కురు సామ్రాజ్యమునకు అతడు చక్రవర్తియై యుండవలసినది. కాని వాసుదేవుని వ్యూహము ననుసరించి వాసుదేవుడు శ్రీకృష్ణుడుగ అవతరించుటకు ముందుగనే రాజ్యపరిత్యాగము గావించెను.

దేవాపి మహర్షి ఆ జన్మలో శ్రీకృష్ణునికన్న నాలుగు వందల సంవత్సరముల ముందు పుట్టినవాడు. నాలుగు వందల సంవత్సరముల ముందు దైవము యొక్క వ్యూహమును గ్రహించి, అందు తన పాత్రను గ్రహించి, తదనుగుణముగ చక్రవర్తిత్వమును పరిత్యాగము చేయుటకు కొంత దూరదృష్టి కావలెను. అది ఋషిదృష్టి. దేవాపి ఋషి మాత్రమే కాదు, రాజర్షి, రాజర్షి మాత్రమే కాదు మహర్షి. దేవాపి, శంతనుడు, కాశీరాజగు దివోదాసు, జగద్గురువగు పరాశర మహర్షి- వీరందరును సమకాలికులు, వీరు ఆ జన్మల యందు, ఆయా దేహము లందుండుట పురాణపురుషుని అవతరణమునకు నాలుగు వందల సంవత్సరముల ముందు జరిగినది.

ధనిష్ఠ

ISBN 978-81-89467-67-8